


ఆంధ్ర సచిత్ర వార పత్రిక
19-10-84
రు. 2/-

కొత్తది

అద్వితీయ శక్తిదాయక పానీయం. జిల్లనిపించే నారింజ రుచిగలది!





విటమిన్-సి తో పరిపుష్టమైనది.

గ్లూకోజ్ చేరిన కొత్త గ్లూకోన్-సి. మీ బిడ్డను ఉరుకుల పరుగుల ఉత్సాహంతో నింపి ఉంచే, అనుకూలమైన సత్వర శక్తిదాయక ఆహారం.

ఇది, పిల్లలలో పళ్ళు, ఎముకలు, శరీర ధాతువుల పెంపుదలను అత్యవసరమైన విటమిన్ సితో పరిపుష్టమైనది.

ఒక గ్లాసు చల్లని ఐస్ వాటర్‌లో నాలుగు టీస్పూన్ల గ్లూకోన్-సి కరిగించి, జిల్లనిపించే నారింజ రుచిగల ఉల్లాస పానీయాన్ని తయారుచేయండి, రోజుకు రెండుసార్లు మీ బిడ్డకివ్వండి.





గ్లూకోన్-సి

GLL-1174

ముఖ చిత్రం

తే. 14-9-84న వెలువడిన వార పత్రిక (రాధ) ముఖ చిత్రము చాలాఆకర్షణీయముగా ఉన్నది. మా ఇంటి అందరినీ ఆకర్షించినది.

వి. కుమారి, నీలానగరం

* * *

4-9-84 సంచికలో వెలువడిన 'రాధ' ముఖచిత్రంతో మమ్ములని ఎంతో ముగ్ధ మనోహరముగా, చక్కటి రూపంతో, కలువ రేకుల వంటి కాటుక కళ్లతో వెలువడి పత్రిక ఎంతోఆకర్షణీయముగా వున్నది. "జీవితం మైనస్ సెంటిమెంట్, శ్రావణి సీరియల్స్ చాలా బాగున్నవి.

–బి. శ్రీనివాసరావు, అనకాపల్లి

* * *


ముద్దబంతి మురిపాలు
ముద్దులొల్కు చెక్కిళ్ళు
సమ్మోహనా వీక్షణాలు
విప్పారిత విరజాజి... నటిరాధ ముఖారవిందం
వీనుల విందు లొల్కెను.

నల్లా అభిమన్యుడు, నైవేలి

కథలు

ఆదూరి సావిత్రిగారి 'విధి ఒక విషవలయం' (28-9-84) హృదయాల్ని కదిలించింది. నిజంగా రచయిత్రి ఎంత గాఢంగా ఆలోచించి ఆ కథ వ్రాశారా అనిపిస్తుంది. సంసారాన్ని ఎలా పోషించాలో దిక్కు తెలియని పరిస్థితి – నిస్సహాయ స్థితిలోని వారిని చూసి గేలి చేసేవారు. మనలో ఎక్కువ. ఈ మనస్తత్వం మారినపుడు మనం సమంగా ఆలోచించ గలుగుతాము.

–రావూరి వివేకానందస్వామి, కటక్



ధర్మపథం అమృత పథం

ధర్మపథం శీర్షిక నన్నెంతగానో ఆకట్టుకుంది. ఆ వారం పత్రిక కొన్నాను అంటే మొదట నా కళ్ళు వెదికేది బులుసు వేంకట రమణయ్యగారి అమృత సమానమైన ధర్మపథం కోసం. అంతటి దివ్య సందేశాన్ని అందిస్తున్న ఆ మహానుభావుడు నిజంగా ధన్యజీవి.

వి. జయరామిరెడ్డి, కర్నూలు

విజ్ఞాన దాయకం

ఈ వారం ప్రారంభింపబడిన కొత్త శీర్షిక విజ్ఞానదాయకంగా వుంది. పిల్లలు–వారిమానసిక ప్రవృత్తులను గురించి డాక్టర్ శ్రీమతి జయా నాగరాజ తెలియ పరచుటకు ముందుగా 'పిల్లలు–అవిధేయత' అను అంశము గురించి రాసిన విషయాలు బాధ్యత గల తలి దండ్రులు ఒక్క క్షణం ఆలోచించే విధముగా' నున్నవి. పిల్లల ప్రవర్తన పెద్దలు పిల్లలను తీర్చిదిద్దే పద్ధతుల పైన, తీసికొన్న శ్రద్ధా సక్తుల పైన ఆధార పడి వున్నదనుట సత్యదూరం కాదని ఈ శీర్షికన ఈ వారం తెలియ చేశారు.

–స్వరాజ్యలక్ష్మి, ఆనందగజపతిరావు, తెట్టంగి

న్యూఢిల్లీ లేఖ

21-9-84 వారపత్రిక ముఖ చిత్రం– సుహాసిని– నన్ను ఆకర్షించింది. డా. జయ్ దుబాషి రామ్‌లాల్‌గారిపై అభిప్రాయం చాలా బాగుంది.

జయప్రకాశ్‌మూర్తి, హైదరాబాద్ ☐

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభు ప్రసాద్

సంపాదకుడు :

(1938-1972)

శుక్రవారం : 19-10-'84

శ్రీ రక్తాక్షినామ సం. ఆశ్వయుజ బ. నవమి

సంపుటము 77 : సంచిక 7

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-00
ఆరు మాసాల చందా	రు. 55-90
పోస్టులో ఏడాది చందా	రు. 111-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

'కంచు కాగడా'లో

కృష్ణ

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

జియాని ఎందుకు పొగుడుతారు వీళ్ళు ?

పాకిస్తాన్‌ని గురించి మనకి ఎక్కువ తెలీదు- అక్కడ క్రూరంగా పాలించే వాళ్ళున్నారన్న సంగతి తప్ప. నాట్సీ జర్మనీలో, ఫాసిస్టు ఇటలీలో ఒకప్పుడు ఇలాగే ఉండేదేమో. ఉండేదేమో కాని అప్పుడప్పుడు పాకిస్తాన్ వెళ్ళి వచ్చే కొందరు భారతీయులు ఇంకో విధంగా ఉన్నట్లు రాస్తూ ఉంటారు. కుల్దీప్ నయ్యార్ రాసినది చదవండి, ఖుష్‌వంత్‌సింగ్ రాసింది చదవండి; పాకిస్తాన్ ఒక భూలోక స్వర్గం అన్నట్లు, జియా - ఉల్ - హక్ అతి దయామయుడన్నట్లు రాస్తారు వాళ్ళు! ఎమ్. జె. అక్బర్ లాంటి వ్యక్తి ఇలాగ రాసినా అర్థం ఉంది. అసలు ఆయన ఒక ముసల్మాను, మరొక ముసల్మానుని పొగుడుతున్నాడు- అంతే కదా! ఖుష్‌వంత్ సింగ్ అంటారా? ఆయన వట్టి అమాయకుడు. ఆయనకెవరయినా కొంత విస్కీ పోస్తే చాలు ఆ పోసినంత గొప్ప వాడు లేడంటాడు. ఒకానొకప్పుడు ఆయన సంజయ్‌గాంధీకన్నా పెద్ద ఇంజనీరు ఈ ప్రపంచంలో లేడనుకునేవాడు. కుల్దీప్ నయ్యార్ మాట ఏమిటి? ఈయన గొప్ప జర్నలిస్టు కదా? ఇలాంటి వాళ్ళు ఇస్లామాబాదు వెడతారూ? వెళ్ళి అక్కడి వాళ్ళు చేసిన విందులు ఆరగిస్తారూ? వాళ్ళు పోయించిన మద్యాన్ని తాగుతారూ? ఇంకా ఏదయినా చేస్తారూ? అంతా అయిన తర్వాత భారత దేశానికి తిరిగి వచ్చి జియా ఒక పెద్ద మనిషి, వీరుడు, మర్యాద ఉట్టిపడేవాడు అని పొగడుతారూ? ఈ జియా వాళ్ళలో చాందిని చౌక్‌లో అమ్మే పరాటాలనీ, కబాబ్‌లనీ ప్రసంసించేవాడుట. అందుకనే ఆయనంటే వీళ్ళకి ఇంత గౌరవం. జియాకి మొగల్ వంటలంటే ఇష్టంట. అందుకని అంతవాడు లేడంటారు వీళ్ళు. జార్జి ఫెర్నాండెస్, బిజూ పట్నాయక్‌లు రాటు తేలిన రాజకీయవాదులే కాని వాళ్ళు కూడా ఇలాగే రాస్తారు. ఇద్దరూ ఇస్లామాబాదు వెళ్ళి వచ్చారంటారు (నిజానికి ఎక్కడికి వెళ్ళారో ఏమో!) వెళ్ళి వచ్చి జియాకి దురుద్దేశాలు లేవని ప్రకటించారు. ఢిల్లీలో అందరితోనూ అన్నారు : "యుద్ధాన్ని నిషేధించే ఒప్పందం చేసుకుంటే ఆ దేశాల మధ్య సంబంధాలే మారిపోతాయి, సేనల సంఖ్యలు కూడా తగ్గిపోతాయి" అని వీరు వివరించారు.

అసలు పాకిస్తాన్‌లో ఏమి జరుగుతోందో తెలుసుకోవాలంటే వేరే పుస్తకాలు చదవాలి. ఈ మధ్యనే లండన్‌లో జెఫ్రీ మూర్ హవుస్ అనే అతను రాసిన పుస్తకం ప్రకటించారు. పాకిస్తాన్‌లోని గూండాలు చేసే పనులని వర్ణించాడు ఈయన తన పుస్తకంలో. ఆ దేశంలోని గూండాలందరిలోనూ పెద్ద గూండా జియా కాకపోతే ఇంకెవరు? ఆ పుస్తకంలో ఒక చోట ఇలాగ రాసి ఉంది :

"శ్రీ అబ్దుల్ హలీమ్ అనే ఆయన పాకిస్తానీ పీపుల్స్ పార్టీకి చెందిన మేధావి. పోలీసు వాళ్ళు అతన్ని నేల మీద పడేసి స్పృహ పోయేదాకా రొమ్ము మీద కాళ్ళతో తొక్కారు. ఆ తర్వాత అతన్ని బోర్లా పడుకోబెట్టి, కాళ్ళని ఎడం చేసి వాటిని మెలి పెట్టారు. అటు పయిన అతని చేతులకి బేడీలు వేసి వాటిని ఎత్తి నుంచోమన్నారు. మెడకీ, చేతులకీ మధ్య ఒక కడ్డీని పెట్టి దానికి 20 కిలో గ్రాముల బరువు తగిలించారు. ఆయన ఇలాగ నుంచుని ఉండగా పోలీసు వాళ్ళు ఆయనని అయిదుగురు పోలీసులు లాటీలతో కొట్టారు. ఈ చిత్ర హింస 15 రోజులు బాటు కొనసాగింది. రాత్రి పూటల శ్రీ హలీమ్ కాళ్ళకి గొలుసులు వేసి ఆయనని నుంచునే ఉండమనే వాళ్ళు. ఆ పిదప కొత్త హింసలు ప్రారంభించారు. గంటల సేపు ఆయనని పడుకోబెట్టి- వెల్లకిల్లానూ, బోర్లానూ కూడా- ఆయన మీద రోకలిలాంటి కొయ్య కడ్డీని అప్పడాల కర్రలాగ వత్తే వాళ్ళు. దీనికి ఇరువయిపులా ఇద్దరు పోలీసులు తమ బలంకొద్దీ నొక్కి పట్టుకునేవాళ్ళు. మరి కొన్ని సారులు ఆయన రహస్యాంగానికి తాడు కట్టి అబ్దుల్ హలీమ్‌కి నెత్తురు వచ్చేదాకా ఈడ్చే వాళ్ళు. ఒక చోట ఈ హింస ముగిసిన తర్వాత ఇంకొక చోటికి తీసుకుపోయి అక్కడా మళ్ళీ హింసలు పెట్టేవాళ్ళు."

మూర్ హవుస పాకిస్తాన్‌ని పర్యటించాడు- తన సొంత కర్చు మీద, డిక్టేటరు అతిథిగా కాదు, మన భారతీయ మిత్రులలాగ- తన పుస్తకం రాసే ముందు. దాని పేరు "ది ఫ్రాంటియర్." అది చదివితే తెలుస్తుంది. పాకిస్తాన్‌లో ఎందరిని (లాయరులనీ, జర్నలిస్టులనీ, కవులనీ, ఇతరులనీ) చిత్ర హింస పెడుతున్నారో. అబ్దుల్ హలీమ్ ఒక పత్రికలో కొన్ని వ్యాసాలు రాశాడని ఆయనని పట్టుకుని ఇలాగ చిత్ర హిస పెట్టారు గూండాలు. (ఆ పత్రికని మూసి వేశారు.) హలిమ్ వకీలు దాఖలు చేసిన "ఎఫిడాలిట్"ని చదివి దానిలోని భాగాలనే ఉదహరించాడు మూర్‌హవుస్.

మన భారతీయ ప్రబుద్ధులు ఎవరికీ హలీమ్ తటస్థ పడలేదేమి? హలీమ్ కాదు పోనీ ప్రతిపక్షాల వారు ఇంకెవరూ తగలలేదేమి? పాశ్చాత్య దేశాల నుండి వచ్చి వెళ్ళిన వాళ్ళు ఎవరో ఇదంతా రాస్తారు కానీ భారతీయలు పాకిస్తాన్ వెడితే జియా ఎంత మంచి వాడో వర్ణించే పుస్తకాలు రాస్తారేమిటి? కలకత్తా నుంచి వెలువడే ఒక దినపత్రిక తాలూకు జర్నలిస్టు ఏమి రాశాడో చూడండి :

"నాకు పెద్ద ఇంటర్‌వ్యూయే ఇచ్చాడు అధ్యక్షుడు జియా. నాతో మాట్లాడినంతసేపూ ఆయన మర్యాదగా ఉన్నాడు. ఈయన ఇలాంటి వాడా, అనిపించింది నాకు. అయితే నేను తెలుసుకున్నదేమిటంటే ఆయన నాకు మాత్రం చూపించిన మర్యాద కాదు ఇది. ఎవరితోనయినా ఇంత సౌమ్యంగానే ఉంటాడుట శ్రీ జియా. ముందు 4 నిముషాల ఇంటర్‌వ్యూ ఇస్తానని ఆయన 150 నిముషాలదాకా మాట్లాడాడు...."

1930 ప్రాంతంలో మాస్కో వెళ్ళిన బెర్నార్డ్‌షా, బీట్రిస్ వెబ్‌లో ఇలాంటి చెత్తే రాశారు. అప్పటిలో స్టాలిన్ ఎందరినో సఫా చేస్తూ ఉంటే వీళ్ళు- వీళ్ల లాంటి వాళ్ళు మరి కొందరూ యదార్థాలని గుర్తించలేకపోయారు. వాళ్ళకి రాజకీయ జ్ఞానం చాలా తక్కువ. స్టాలిన్‌తో "యుద్ధం వద్దు" అనే ఒప్పందం చేసుకోవాలని తాపత్రయ పడే వాళ్ళు వీళ్ళు. నియంతలు అందరూ ఒకటే. పక్క దేశంలోని నియంత ఎంత చక్కగా నచ్చినా అతని క్రౌర్యం ఎక్కడికి పోతుంది?

మన మిత్రులు ఎన్ని పుస్తకాలు రాస్తే ఏమిటి? ఎన్ని వ్యాసాలు రాస్తే ఏమిటి? పాకిస్తాన్‌లో అంత కాలం గడిపి కూడా వాళ్ళు జాఫ్రే మూర్‌హవుస్ చూసినది చూడలేదేమిటి?

నాకు ఒక "పండితుడు" తెలుసు. ఈ మధ్యనే ఆయన చీనా, పాకిస్తాన్ దేశాలు చాలాసారులే పర్యటించి వచ్చాడు. ఇంకా కొన్ని దేశాలు కూడా వెళ్లొదనుకోండి. (ఈయన సుబ్రహ్మణ్య స్వామి కాదు.

(61వ పేజీ చూడండి)

వ్యక్తిగతం



శ్రీమతి షీలాబప్పూ మారిషస్‌లో మహిళల హక్కులు, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రిగా స్త్రీల అభ్యుదయానికి ఎంతో కృషి చేసిన సంస్కర్తగా పేరు తెచ్చుకున్నారు. సిద్ధాంతపరమైన విభేదాల కారణంగా తమ పదవిని తృణ ప్రాయంగా త్యజించి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. మూడేళ్లపాటు రాజకీయాలకి దూరంగా ఉన్న శ్రీమతి షీలాని గత సంవత్సరం తమ మంత్రి వర్గంలో చేరవలసిందిగా మారిషస్ ప్రధాని ఆహ్వానించారు. మహిళలకి ప్రయోజనకర మైన ఎన్నో పథకాలని ఈమె రూపొందించారు. గర్భస్రావాన్ని చట్టబద్ధం చెయ్యడం, ప్రభుత్వోద్యోగాల్లోకి మహిళలకి ఉన్నట్లే పరి శ్రమలో పని చేసే స్త్రీలకి కూడా సమానంగా ఆర్థిక సౌకర్యాలని కలిగించడం, మహిళా కేంద్రాలద్వారా నిరక్షరాస్యతని నిర్మూలించడం వంటి కార్యక్రమాలని ఈమె చేపట్టారు. గతంలో ఎం.ఎం.ఎం. పార్టీ అధ్యక్షురాలిగా, పట్టణ డెప్యూటీ మేయరుగా పని చేసిన ఈమె మహారాష్ట్రనించి వలస వెళ్లిన ఒక కుటుంబానికి చెందిన మహిళ..... □



దక్షిణ కొరియా అధ్యక్షుడు ఛున్ డు వాన్ సియోల్ లో 1988లో జరిగే ఒలింపిక్స్‌ని ఎంతో సమర్థవంతంగా నిర్వహించగలమని అంటున్నారు. మంచి దక్షతగల పరిపాలకుడిగా మంచి పేరు తెచ్చుకున్నాఈయన తమని వ్యతిరేకించేవారిని నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తారన్న అపప్రథ కూడా ఉంది. ఛున్‌డువాన్ జపాన్ సందర్శించబోతున్నారు. వెయ్యి ఏళ్ల తర్వాత దక్షిణ కొరియా జపాన్‌ల మధ్య సయోధ్యకిది నాంది అవుతుంది. ఆయన రక్షణ కోసం జపాన్ భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నది. ఇందు కోసం 23వేల మంది పోలీసు సిబ్బందిని నియమిస్తారట. అమెరికా అధ్యక్షుడు రీగన్ వచ్చినప్పుడు కూడా ఇటువంటి ఏర్పాట్లు జరగ లేదట...... □



19-10-1984 శుక్రవారం మొదలు 25-10-1984 గురువారం వరకు

★ **మేషం :** ఎంతో ధనం ఇతరుల నుండి రావలసినది ఉంది గదా? ఎంతో సమాచారం యితరుల నుండి సేకరింపవలసినది ఉన్నది కదా? ఎందుకు యత్నించరు? సుఖ శాంతులకు లోపం కలుగనున్నది. స్త్రీలకు : ఉద్యోగమందు సదవకాశం, ధనాదాయం.

★ **వృషభం :** వ్యాపార వ్యవహారాలందు ఏదో ఆటంకం చెప్ప వీలున్నది. 'గ్రహచారం' అలా ఉన్నదని గ్రహించాలి. పాత వ్యాధులు కొందరకు పొక్కే అవకాశమున్నది. ఔషధ సేవ తప్పనిసరి అవుతుంది. శస్త్ర చికిత్స కూడా కొందరకు అవసరం. స్త్రీలకు : వృత్తియందు పెంపు, అధికారమందభివృద్ధి.

★ **మిధునం :** నూతనాంశాలు గ్రహించనున్నారు. రచనా విధాన శాలుగు రూకలు సంపాయించుకోనున్నారు. నటనా విధాన బాగా లబ్ధి కొందరకు లభించగలదు. వ్యాపారంలో ఏవో అడ్డంకులు రానున్నవి. స్త్రీలకు : గృహ సంబంధమైన వస్తు సేకరణ. ఉద్యోగంలో నూతనావకాశాలు లభ్యం కాగలవు.

★ **కర్కాటకం :** చాలామందికి ప్రయాణ మూలకంగా అనుకూలత, ధనాదాయం, విశిష్ట వ్యక్తుల పరిచయం, రాజకీయంగా అనుకూలత, స్వల్పంగా ఆరోగ్య భంగం చెప్పదగిన అంశాలు. వ్యాపారం యధాతథం. స్త్రీలకు : కుటుంబంలో కలతలు రావచ్చు. నూతనోద్యోగ యత్నాలయందు సుముఖత గలవారం.

★ **సింహం :** సజ్జన సాంగత్యానికి, సత్కాలక్షేపానికి, సత్సంగానికి, సదవకాశాలు అన్ని రంగాలలో లభించగల సమయం. శ్రమించండి, సత్ఫలం అనుభవించండి. స్త్రీలకు : అన్ని రంగాలలో అనుకూలత, ముఖ్యంగా ఉద్యోగానందం నిరాక్షేపణగా చేకూరుతుంది.

★ **కన్య :** రాజకీయంగా మీ ఎత్తులు ఫలవంతం కాగలవు. రావలసిన ధనం అంది అవసరాలు తీరుతాయి. కుటుంబానందానికి ఎలాంటి లోటు రాదని గ్రహించుకోండి. స్త్రీలకు : నూతన బంధుత్వ యత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యాభివృద్ధి చెప్పదగిన ముఖ్యాంశం.

★ **తుల :** వ్యవహారానుకూలతకు, చేసిన తప్పులు సవరించుకొనుటకు అనుకూల సమయం. వారాంతంలో ప్రీతికరమైన వార్త వినే అవకాశమున్నది. రాజకీయంగా చికాకు. స్త్రీలకు : సద్గోష్ఠి, ఉద్యోగాభివృద్ధి, ఆదాయం గలవారం.

★ **వృశ్చికం :** నూతనాంశాలు గ్రహిస్తారు. విద్యావంతులతో గోష్ఠి చెప్పదగిన అంశం. సుఖశాంతులకు ఎలాంటి లోపం లేదు. వ్యాపారంలో నూతన మార్గాన అభివృద్ధి. కొందరకు అప్రయత్న ధన లబ్ధి చెప్పదగిన అంశం. స్త్రీలకు : గౌరవం, ఆదాయం, ఆనంద మయమైన వారం.

★ **ధనుస్సు :** మీకు కాని వారి మూలముననో, అపరిచితుల మూలముననో చికాకులు ఏర్పడటం, అపనిందలకు గురికావలసి రావటం జరుగుతుంది. మీరు ఉద్యోగరీత్యా గావించిన ప్రయత్నాలు ఫలవంతం కాగలవు. స్త్రీలకు : క్రయ విక్రయలాభం, ధనలబ్ధి.

★ **మకరం :** ఈ వారం ఎన్నో వ్యవహారాలు సానుకూలం చేసికోవాలని, ఎందరతోనో ఏవో విషయాలను గూర్చి సంప్రదించాలనీ ఎలాగైనా ధనాదాయం పొందాలనీ యత్నిస్తారు. అన్నీ గాకున్నా, కొంతైనా మేలే అనిపిస్తుంది. స్త్రీలకు :- కొందరకు రాజకీయంగా ఆనందదాయకం.

★ **కుంభం :** ఇతరుల వలన మోసగింపబడుతారేమో! జాగ్రత్త! వస్తు విక్రయం వలన లాభించే మార్గమున్నది. రచనా వ్యాసంగం సత్ఫలదాయకం. స్త్రీలకు : అభిమానుల ఆదరణ, వృత్తియందు పెంపు ఆరోగ్యమందు అభివృద్ధి చెప్పదగిన సమయం.

★ **మీనం :** ఇతరుల మూలాన అందవలసిన పైకం సమయానికి అందదు. అధికారుల వలన జరుగవలసిన పనులు క్రమంగా జరుగవు. ఆశించిన ధనం అందదు. గ్రహించి మెలగండి. స్త్రీలకు : శుభ వార్త శ్రవణం, మంచి ధనాదాయం చెప్పనైనవారం.

—విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి


కేతినేని పిక్చర్స్
బ్రతుకు పూలబాట కాదు
విరుల పాన్పు కాదు
అడుగడుగునా గతుకులు -
ఒడుదుడుకుల వెతలు!
LAKSHMI PUBS.
భారతంలో శంఖారావం
కథ: డా॥ యం. ప్రభాకరరెడ్డి స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: బి. భాస్కరరావు నిర్మాత: ఆర్. కేతినేని
సంగీతం: జె.వి. రాఘవులు కెమెరా: సత్తిబాబు మాటలు. ప్రాసల కూర్పు: కె.ఎ. మార్తాండ్
లక్ష్మీ ఫిలింస్

దేదీప్య

కంచుమర్తి వెంకటేశ్వర రావు

9

(గత సంచిక తరువాయి)

రోజులు ఎవరితోనూ ప్రమేయం లేకుండా సాఫీగా గడుస్తున్నాయి. దేదీప్య దినచర్యలో మార్పులేదు. ఉదయం నుండి సాయంత్రం వరకు స్కూలు. సాయంత్రం శిరీషకు ట్యూషను. తనకు తెలియకుండానే శిరీషపై ఒక రకమైన అభిమానం, ప్రేమ కలిగాయి. శిరీషను చూస్తున్నంతసేపు దేదీప్య హృదయంలో ఏదో తెలియని అనుభూతి. సాయంత్రం కోసం ఎదురు చూసేది. స్కూలులో చూసినా ఇంటిదగ్గర శిరీషకు పాఠాలు చెబుతుంటె ఏదో తెలియని బంధం వారి మధ్య వున్నట్లు ఆ ఆకర్షణ అలా కలిగేది.

సాయంత్రం శివప్రసాద్ ఇంటికి వెళ్ళేసరికి ఇల్లంతా హడావిడిగా ఉండడం గమనించింది. చుట్టాలు వచ్చారు కాబోలుననుకుంది.

అప్పుడే లోపలి నుండి బయటకు వస్తున్న శివప్రసాద్ దేదీప్యను చూసి ఆగిపోయాడు.

''రండి, మీకోసమే ఎదురు చూస్తున్నాను. మా అక్క, పిల్లలు వచ్చారు. పరిచయం చేస్తాను.''

అతనితో లోపలకు నడిచింది దేదీప్య.

సోఫాలో కూర్చుని శిరీషకు కబుర్లు చెబుతున్న ఒకామె దేదీప్యను చూసింది ఎవరన్నట్లు.

''అక్కా... శిరీష టీచర్ దేదీప్య.

మా అక్క సుస్మిత.''

దేదీప్య నమస్కరించింది.

సుస్మిత నవ్వుతూ కూర్చోమంది.

సుస్మితను చూడగానే ఓ రకమైన అభిమానం కలిగింది. పరిచయమైన పావుగంటకే కలివిడిగా మాట్లాడుతున్న సుస్మిత ధోరణి ఎంతో నచ్చింది దేదీప్యకు.

అందంగా, నాజూగ్గా ఉన్న దేదీప్యను కళ్ళార్పకుండా చూసింది సుస్మిత కొంతసేపు. స్కూలు నుండి డైరెక్టుగా వచ్చిందేమో చిరు చెమటలు తెల్లని ముఖంమీద స్పష్టంగా కనిపిస్తున్నాయి. పెద్దగా అలంకరణలు లేకపోయినా దేదీప్య అందం చూపరులకు అసూయ కలిగించేలా ఉంది.

''ఏమిటలా చూస్తున్నారు.''

''ఇంత అందంగా ఉన్న మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలంటే మగవాడు ఎంత అదృష్టం చేసుకుని పుట్టాలాని అంచనా వేస్తున్నాను.''

సుస్మిత మాటలకు దేదీప్య చిన్నగా నవ్వింది.

''ఆఁ.అన్నట్లు మరచిపోయాను. రేపు శిరీష పుట్టినరోజు. పుట్టినరోజుకు రావడం నాకు ఆనవాయితి. నేను ఏ ఒక్కసారైనా రాలేదంటే మా శివుడుకి కోపం. వచ్చేవరకు లెటరు కూడా వ్రాయడు. బట్టల షాపుకు బయలుదేరమంటున్నాడు. ఒక్క అరగంట మాతో మీరు రావాలి.''

జరిగిన కథ—2 : బలరాం, పార్వతమ్మల రెండవ కూతురు దేదీప్య. స్కూల్లో అక్క పోలికలతో ఉన్న పాపను చూస్తుంది దేదీప్య. ఏడేళ్ళ క్రిందట ఇల్లు వదిలిన అక్క అవంతిని గురించి తెలుసుకోవాలనే ఆశతో శిరీషకు ట్యూషన్ చెప్పను అంగీకరిస్తుందామె. శిరీష అవంతి కూతురా! కాదా! అని తెలుసుకోవాలని తహతహలాడుతోంది దేదీప్య. స్నేహితురాలు సరళతో సినిమాకెళ్ళిన దేదీప్యకు సినిమా హాల్లో శిరీష, శివప్రసాద్‌లు కలిసారు.

కాదనలేక పోయింది.

సుస్మిత టవలిస్తూ ముఖం కడుక్కోమంది.

దేదీప్య సందేహిస్తూనే బాత్‌రూంకు వెళ్ళి ముఖం కడుక్కొని టాయిలెటయింది.

పిల్లలను ఆయాకు అప్పగించి బయట కొచ్చారిద్దరూ.

అప్పటికే కారు స్టీరింగు దగ్గర కూర్చుని ఉన్నాడు శివప్రసాద్.

వెనుక సీట్లో కూర్చున్నారిద్దరూ.

''ఇక్కడకు రాగానే అడవిలోంచి ఒక్కసారే మనుష్యుల మధ్యకు వచ్చినట్లుంది.''

''అదేమిటి. మీరున్నచోట మనుషులు ఉండరా.''

దేదీప్య అలా అడగగానే గట్టిగా నవ్వింది సుస్మిత.

''భలేవారే. మావారు వరంగల్ జిల్లాలో ఇంజనీయరు. కంపెనీ అడవిలో ఉంది. క్వార్టర్సు ఊళ్ళో. చిన్న చిన్న ఇళ్ళు తప్ప మరేవీ ఉండవు. ప్రతీ వస్తువూ ఖరీదే.

''ఒరేయ్ శివుడూ. మీ బావగారు నిన్ను రమ్మన్నారు.''

''ఏమిటక్కా. వచ్చి ఆరుగంటలైనాకాలేదు అప్పుడే వెళ్ళిపోతున్నట్లు ఈ పిలుపు లేమిటి''

''ఆఁ నువ్వలాగే అంటావు. అప్పటికప్పుడు చెప్పితే సెలవు దొరకలేదని తప్పించుకుంటావు.''

మాటల్లోనే కారు బట్టలషాపు దగ్గర ఆగింది.

ముగ్గురూ లోపలకు వెళ్ళారు.

శివప్రసాద్‌ను చూసి ప్రొప్రైటరు విష్ చేసాడు.

సుస్మిత చీరలు సెలక్టుచేసి రడీమేడ్ సెక్షనుకు వెళ్ళింది.

శివప్రసాద్ గులాబీరంగు చీర తీసి దేదీప్యకు చూపించాడు.

''ఎలాగుంది''

''బాగుంది.''

''మీకు సరిగ్గా మేచవుతుందని నేనంటాను. మరి మీరేమంటారు.''

దేదీప్య మాట్లాడలేదు.

''ఈ చీర పేక్ చేయండి.''

శివప్రసాద్ సేల్స్ మెన్‌కి చెప్పడంతో తత్తరపడింది.

''ఎవరికి ?''

''మీకే.''

''వద్దు.''

వాళ్ళ సంభాషణంతా దూరం నుండే గమనిస్తోంది సుస్మిత. హుందాగా ఉన్న శివప్రసాద్ ప్రక్కన అంతే పొడవుగా అందంగా నిలబడిన దేదీప్యను చూసి ముచ్చటైన జంట అనుకుంది. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చి ఓ నిట్టూర్పు విడిచింది.

''ఏమిటి.మీ వాదన'' అంది దగ్గరకు వస్తూ.

''అక్కా...ఈ చీర దేదీప్యగారికి ప్రజెంట్ చెయ్యాలనుకుంటున్నాను. ఎందుకో తెలుసా, శిరీషకు దేదీప్యగారు ట్యూషను ప్రారంభించి నెలరోజులైంది. ఫీజు ఎంతివ్వాలో నాకు తెలియదు. ఎంతో ఆవిడగారు చెప్పలేదు. ట్యూషను ఫీజుగా అనుకోండి, లేదా మా శిరీష గురువుగారికి ఇచ్చే కానుక అనుకోండి. యామై కరెక్ట్.''

శివప్రసాద్ మాటలకు సుస్మిత నవ్వింది.

''కరెక్ట్. దేదీప్యగారూ, మీరు తప్పకుండా తీసుకోవాలి.''

''నేను డబ్బుకోసం శిరీషకు ట్యూషను చెప్పడంలేదు. శిరీష గురించి ...'' అనేసి నాలిక్కరుచుకుంది దేదీప్య.

శివప్రసాద్, సుస్మిత తెల్లబోవడం చూసి దేదీప్య తనను తాను తమాయించుకుని పేకెట్ అందుకుని ''థేంక్స్'' అంది నవ్వుతూ.

శివప్రసాద్, సుస్మిత తేలిగ్గా నవ్వేసారు.

బట్టలషాపు నుండి బయటకొచ్చి కారులో కూర్చున్నారు. కొంత దూరం వెళ్ళేసరికి సరళ రోడ్డు ప్రక్కగా నడుస్తుండడం దేదీప్య చూసి కారు ఆపమంది.

''సుస్మితగారూ. మా స్నేహితురాలితో వెళతాను. సారీ... ఏమీ అనుకోవద్దు'' అంది దేదీప్య సుస్మితతో కారు దిగి.

సరళను ఆపి రెండడుగులు వేసింది.

''దేదీప్యగారూ.''

శివప్రసాద్ పిలుపుకు ఆగిపోయింది.

సరళ కొంచెం దూరం వెళ్ళింది.

శివప్రసాద్ దేదీప్య దగ్గరకు వచ్చాడు.

''ఏమిటి.''

''మీరు రేపు శిరీష పుట్టినరోజుకు తప్పకుండా రావాలి. ఇఫ్ యూ డోంట్ మైండ్. మీరు రేపు వచ్చేటప్పుడు ఈ చీర కట్టుకుని రావాలి .. ప్లీజ్.''

అనేసి గబగబా వెళ్ళిపోయాడు కారు దగ్గరకు.

దేదీప్య ఆశ్చర్యంతో అలాగే నిలబడిపోయింది.

సరళ కేకతో తేరుకున్న దేదీప్య ముందుకు నడిచింది.

దగ్గరకి వెళ్లడానికి తయారైంది దేదీప్య. టేబిలు మీద పేకెట్ కనిపించింది.

ఆ చీర కట్టుకోవాలా వద్దా.

శివప్రసాద్ అభ్యర్థన కళ్ల ముందు మెదిలింది.

దేదీప్యకు నవ్వొచ్చింది.

ఆ చీర కట్టుకుంది.

అప్పుడే లోపలకు వచ్చిన పార్వతమ్మ కూతురు ముస్తాబును చూసి మురిసిపోయింది.

''దేదీప్యా ఒకసారి బయటకు రా.''

తల్లి మాటలకు అర్థం తెలుసు. కొత్త



10

ఉదయాన్నే లేచి తలంటు పోసుకుని చీర కట్టుకుని వంట గదిలోకి వెళ్ళింది అమ్మకు సాయం చేయడానికి.

''దేదీప్యా... స్కూలుకు వెళ్ళవా.''

అడిగింది పార్వతమ్మ టిఫిను ప్లేటులో వేస్తూ.

''లేదమ్మా... ఈవేళ మా స్నేహితురాలింట్లో పార్టీ ఉంది. అందుకని సెలవు పెట్టాను'' అంది.

మధ్యాహ్నం భోజనం చేసింతర్వాత శిరీష

చీర కట్టుకున్నరోజున దిష్టి తీయనిదే బయటకు కదలనివ్వదు.

పార్వతమ్మ దిష్టి తీసి కూతురును కౌగిలించుకొంది.

బలరాం కూడా కూతురును ముచ్చటగా చూస్తాడు.

''దేదీప్యా నిన్ను పెళ్లికూతురుగా చూడాలని ఉందమ్మా.''

తండ్రి మాటలకు ఆర్ద్రమైంది దేదీప్య మనసు.

అవంతి వెళ్లినప్పటి నుండి దేదీప్య వాళ్లకు ఆరోప్రాణం. దేదీప్య ఎక్కడకు వెళ్లినా, ఏ పని చేసినా అడ్డుచెప్పరు. దేదీప్య మీద వాళ్లకు అంత నమ్మకం. అక్క దూరమైనప్పటి నుండి అమ్మా, నాన్న ఎంత బాధపడుతున్నారో గ్రహించిన దేదీప్య వాళ్ల మనసుకు కష్టం కలిగించేలా ఎప్పుడూ ప్రవర్తించలేదు.

''చూడమ్మా మా వయసయిపోతుంది. కొడుకుల కళ్లెదుట రాలిపోవాలనుకుంటారు అంతా. ఆ అదృష్టం మాకు లేదు. కొడుకులైనా, కూతుళ్లైనా మీరే. మా స్వార్థం కాకపోతే ఎన్నాళ్లు ఆడపిల్లను ఇంట్లో ఉంచుకుంటాం. పెళ్లిళ్లు చేయలేని అసమర్థుడంటుంది లోకం. అవంతి అలా వెళ్లిపోయింది. నిన్ను కూడా దూరం చేసుకోలేము. పెళ్లి విషయంలో నీకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాను. మా కళ్లముందు జరిగితే చాలు. అదే మాకు తృప్తి.''

తండ్రి మాటలకు దేదీప్య కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

''తప్పకుండా నాన్నా నా పెళ్ళి మీ ఇష్ట

ప్రకారమే జరుగుతుంది'' అంది ఇంకేమనాలో తోచక.

బయటకు వచ్చింది. బజార్లో శిరీషకు ప్రజంటేషను కొని శివప్రసాద్ ఇంటికివెళ్ళింది. వరండాలోనే ఎదురయ్యాడు శివప్రసాద్.

దేదీప్యను రెండు క్షణాలు కళ్ళార్పకుండా చూసాడు.

దేదీప్య అతనివైపు చూడలేక తలదించుకుంది.

రెండడుగులు వేసింది.

'దేదీప్యగారూ !'

ఆగింది. వెనక్కి తిరిగి చూసింది.

క్షణ కాలం ఆ యిద్దరి చూపులు కలుసుకున్నాయి.

''థేంక్స్'' అని చెప్పి కారు దగ్గరకు నడిచాడు.

దేదీప్య లోపలకు వెళ్ళేసరికి సుస్మిత పనిలో ఉంది.

''రండి దేదీప్యగారూ. మీ గురించే ఎదురు చూస్తున్నాను. సాయంత్రం శివుడి స్నేహితులంతా వస్తారు. పనులన్నీ ఒక్కదాన్నే ఎలా చెయ్యాలిరా అనుకున్న సమయంలో మీరు వచ్చారు'' అంది సుస్మిత.

దేదీప్య సుస్మితకు తోడుగా ఉండి అన్ని పనులూ చకచకా చేసింది.

''స్వీటుల్లో మీకేది ఇష్టం.''

అడిగింది సుస్మిత.

''గులాబ్ జాం''

''అరె! మా శివుడుక్కూడా అదే ఇష్టం. ఇద్దరిదీ ఒకటే టేస్ట్.

ఈసారి దేదీప్య మాట్లాడలేదు.

''దేదీప్య''

ఐదయ్యేసరికి శివప్రసాద్ స్నేహితులంతా వచ్చారు

శిరీషను తయారుచేసింది సుస్మిత.

ఏర్పాట్లను దగ్గరుండి చేస్తున్న దేదీప్యను మెచ్చుకోలుగా చూసి రూంలోకి వెళ్ళాడు. శిరీష 'డాడీ' అంటూ శివప్రసాద్‌ను చుట్టేసింది.

శిరీషను ఎత్తుకుని బయటకు వచ్చాడు.

సుస్మిత, దేదీప్య బయటకు వచ్చారు.

శివప్రసాద్ ప్రక్కన నిలబడిన దేదీప్యను చూసిన చాలా కళ్ళు మెరిశాయి. దేదీప్య అందానికి ముగ్ధులయ్యారు. దేదీప్య టీచరని తెలిసిన వారు తప్ప అందరూ శివప్రసాద్ చుట్టమనుకున్నారు.

ముద్దుగా, బొద్దుగా ఉన్న శిరీషను ముద్దు పెట్టుకున్నారు.

శివప్రసాద్ శిరీషచేత కేక్ కోయించాడు.

శిరీష శివప్రసాద్‌కు ముందు కేకు ముక్క ఇచ్చింది.

శిరీషను చూస్తుంటే హృదయంలో ఏవో జ్ఞాపకాలు కదులుతుంటే అప్రయత్నంగా కన్నీళ్ళొచ్చాయి దేదీప్యకు. కేకుముక్కను తననోట్లో పెడుతున్న శిరీషను హృదయానికి హత్తుకుని ముద్దులు కురిపించింది.

కన్నీటిని తుడుచుకుని గబగబ గదిలోకి వెళ్ళిపోయింది.

దేదీప్య ప్రవర్తన చాలా మందికి వింతగా అనిపించింది.

సుస్మిత, శివప్రసాద్ ముఖాలు చూసుకున్నారు.

పార్టీ పూర్తయ్యేసరికి ఎనిమిదయింది.

సుస్మిత దేదీప్య దగ్గరకు వెళ్ళింది.

దేదీప్య ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుని ఉంది.

''దేదీప్యగారూ. రండి భోంచేద్దురు. చాలా అలసిపోయారు పార్టీలో ఏవీ తీసుకోలేదు.''

''వద్దండీ. నాకు ఆకలిలేదు. ఇప్పటికి చాలా ఆలస్యమైంది. అమ్మా, నాన్నా కంగారు పడతారు'' అని లేచింది దేదీప్య.

సుస్మిత దేదీప్య భుజంమీద చేతులువేసింది.

''ప్లీజ్... నాకోసమైనా మీరు కొంచెం తిని వెళ్ళాలి.''

సుస్మిత మాటకు కాదనలేకపోయింది. భోజనం అయిందనిపించి శిరీష దగ్గరకు వెళ్ళింది. శిరీష ఆదమరచి నిద్రపోతోంది. శిరీషను ముద్దుపెట్టుకుని వెళతానని చెప్పింది దేదీప్య సుస్మితకు.

శివప్రసాద్ బయటకువెళ్ళి ఇంకా రాలేదు.

'అమ్మో... ఒంటరిగా వెళతారా నాకే భయంగా ఉంది. ఒక అరగంట వెయిట్ చేయండి. శివుడొచ్చి డ్రాప్ చేస్తాడు.''

సుస్మిత మాటల్లోనే శివప్రసాద్ లోపలకు వచ్చాడు.

మరి తప్పదన్నట్లుగా దేదీప్య కారులో కూర్చుంది.

కారును నెమ్మదిగా పోనిస్తున్నాడు. ఉదయం నుండి తిరుగుడుతోనే సరిపోయిందేమో అలసట శివప్రసాద్ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. మాటి మాటికి జేబురుమాలుతో ముఖాన్ని తుడుచుకుంటున్నాడు.

దేదీప్య కళ్ళు మూసుకుని కూర్చుంది.

ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

శిరీష అవంతి కూతురేనా ?

అవంతి ఎక్కడుంది ?

తెలుసుకోవాలి.

దేదీప్య కళ్ళు తెరిచింది.

శివప్రసాద్ చూపులన్నీ రోడ్డు మీద ఉన్నాయి.

''ఏవండీ''

దేదీప్య పిలుపుకు ఆమె వైపు చూసాడు శివప్రసాద్.

''శిరీష తల్లి ఎవరు ? ''

ఊహించని ప్రశ్న దేదీప్య వేయగానే కొంతసేపటివరకు మాట్లాడలేదు శివప్రసాద్. అతను నుండి వచ్చే జవాబుకోసం ఎదురు చూస్తున్న దేదీప్యకు అతను మాట్లాడకపోవటం నిరాశ కలిగించింది.

''పోనీ ఆమె పేరు చెప్పండి.''


శివప్రసాద్ దేదీప్య వైపు చూడకుండానే చెప్పాడు.

''ప్రతిమ.''

''నో మీరంతా అబద్ధం చెబుతున్నారు.''

విజయనగరం లయన్స్ క్లబ్‌వారు ఉపాధ్యాయ దినోత్సవం (5-9-84) నాడు ఉపాధ్యాయిని శ్రీమతి నిష్కల పార్వతిని సన్మానించారు. చిత్రంలో శ్రీమతి వి. కుసుమాంబ, శ్రీమతి పి. రాజకుమారి, శ్రీమతి ఎన్. పార్వతి (సన్మానితురాలు), శ్రీమతి మాలారాజుగార్లని చూడవచ్చు.





అని గట్టిగా అరవాలనుకుంది. కానీ తమాయించు కుంది.

ఇల్లు దగ్గరవడంతో కారు ఆపమంది. కారులోంచి దిగి ఇంటివైపు నడిచింది.

థేంక్స్ అని కూడా చెప్పలేదు.

దేదీప్య వెళ్ళినవైపు చాలాసేపు చూసాడు. తర్వాత కారు వెనక్కు తిప్పాడు శివప్రసాద్.

11

దేదీప్యకు అంతా అయోమయంగా ఉంది.

శిరీష అవంతి కూతురు కాదా...

ముమ్మూర్తులా అవంతిని పోలిన శిరీష అవంతి కూతురు కాదంటె నమ్మశక్యం కావడం లేదు. అలాగని మనిషిని పోలిన మనుష్యు లుంటారనే నిజం తెలిసినా శిరీష విషయంలో అన్వయించుకోలేకపోతోంది.

శివప్రసాద్ అబద్ధం చెప్పాడా...

అబద్ధం చెప్పవలసిన అవసరం అతని కేముంది ?

తనెవరో అతనికి తెలియదు. అటువం టప్పుడు శిరీష గురించి తనకు అబద్ధం చెప్ప వలసిన అగత్యం అతనికి లేదు.

శిరీష అవంతి కూతురు కాదనే అబద్ధాన్ని ఎంత నమ్మలేకపోతుందో, శివప్రసాద్ చెప్పిన అబద్ధంలోని నిజాన్ని కూడా దేదీప్య అర్థం చేసుకోలేకపోతోంది.

ఆలోచనలు ఓ కొలిక్కి రావడంలేదు. స్కూలుకు వెళ్ళిందేగాని లెసన్స్‌మీద మనసు నిలపలేకపోతోంది. సరళ కోసం చూసింది. రాలేదు. జ్వరమని లీవు లెటరు పంపించినట్లు తెలియగానే మధ్యాహ్నం పర్మిషను తీసుకుని సరళింటికి బయలుదేరింది దేదీప్య.

ఇంటికెళ్ళేసరికి మంచంమీద పడుకుని ఉంది సరళ.

"రా. దేదీప్యా... ఉదయం కాస్తంత జ్వరం తగిలితే డాక్టరు రెస్టు తీసుకోమని చెప్పాడు."

ఫ్లాస్కులోని కాఫీని గ్లాసులో పోయడానికి లేవబోయింది సరళ. దేదీప్య సరళను వారించి తనే కాఫీని రెండు గ్లాసుల్లో పోసి ఒకటి సరళ కిచ్చి తనొకటి తీసుకుంది.

"దేదీప్యా... నాకేమనిపిస్తుందో తెలుసా... ఈ జ్వరం మరింత ఎక్కువై ప్రాణం పోతే బాగుణ్ణనిపిస్తుంది."

సరళ అలా అనగానే తన చేత్తో నోటిని మూసేసింది దేదీప్య.

"సరళా, ఎందుకంత బెంబేలు పడతావు. రాను రాను నీకు నిరాశ ఎందుకు పెరుగుతోంది? జీవితం చాలా ఉంది. ఏమంత వయసు ముంచుకు పోయిందని బాధ పడతావు."

దేదీప్య మాటలకు చిన్నగా నవ్వింది సరళ.

"ఏ ఆశతో జీవించాలో అర్థంకాక" అంది సరళ.

దేదీప్య మాట్లాడలేదు.

"దేదీప్యా, నా గురించి ఈవేళ నీకు చెప్పాలని ఉంది. నా కథ విని నన్ను జాలితో ఓదార్చే మనిషి నువ్వొక్కర్తివేనని నా నమ్మకం. అందుకే నీకంతా చెప్పి నా గుండెలో రగులుతున్న చిచ్చును కొంత చల్లార్చుకుంటాను." అని సరళ చెప్పడం ప్రారంభించింది.

12

వేగేశ్వరపురం పశ్చిమగోదావరి జిల్లాలో చిన్న ఊరు. ఊరు చిన్నదైనా పచ్చని పొలాలతో అందంగా ఉంటుంది. ప్రవహించే గోదావరి మరింత అందాన్నిస్తుంది.

వెయ్యి గడపలున్న ఆ ఊరులో తాతలనాడు కట్టిన పెద్ద ఇల్లు మాది. మా నాన్నగారు మాధవరావు ఇంటికి పెద్దకొడుకు. అతనికి ఒక తమ్ముడు, చెల్లెలు. ఇంటి పెత్తనమంతా నాన్న గారిదే. అందరూ కలిసి ఉండేవారు.


నాన్నగారికి పెద్ద కూతురును నేను. నా తర్వాత తమ్ముడు. మరి పిల్లలు పుట్టక పోవడంతో మా ఇద్దరిని ముద్దుగా చూసేవారు నాన్న.

నేను నల్లగా పుట్టడమే పొరపాటు. ఇంట్లో తప్ప బయటకు వెళితే నన్ను అందరూ అసహ్యించుకునేవారు. ఎవరూ కలివిడిగా మాట్లాడేవారు కాదు.

ఐదోతరగతి పాసయ్యాను. ఆరోతరగతి చదవాలంటే మా ఊరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రక్క ఊరు వెళ్ళాలి. ఆ స్కూలుకు వెళతానంటే అమ్మ, నాన్న ఒప్పుకో లేదు. చదివింది చాలన్నారు. అదృష్టంకొద్దీ ఆ సంవత్సరమే మా ఊరుకు హైస్కూలు వచ్చింది.

నేను పొంగిపోయాను.

(ఇంకా వుంది)





కె. ఎస్. ఎస్. ఆర్. అమలాపురం

నా వయస్సు 53 సం.లు. గత 10 సం.ల వరకు చాలా ఓపికగా ఉండేవాడిని. ఈ మధ్య నరాలలో సత్తువ లేదు. రతి యందు తీవ్రమైన ఉద్రేకము కలుగును. కాని అంగము నిలువదు. రతి సల్పినా స్పెర్మ్ పడదు. నరాల బలానికి బ్రాంది లాంటి వాటిని సేవించమని అలాగయితే రతి సమయమందు తృప్తి కలుగునని కొందరు సలహా ఇచ్చారు.

★ వయస్సు మీరినకొద్దీ సహజంగానే లైంగిక కలయికలో ఆసక్తి, పటుత్వం ముందుకన్నా తగ్గుతుంది. లబూబ్‌కబీర్ అనే యూనానీ మందు వాడి చూడండి. బ్రాంది సేవించటం వల్ల రతి సమయంలో తృప్తి కలుగుతుందనేది ఒక భావనే తప్ప యదార్థం కాదు.

ఎం. ఎల్. కె. – కానుమోలు

మా బాబు వయస్సు 10 నెలలు. 3 నెలల క్రితం బాబుకి పాల ఉబ్బసం వచ్చినది. రెండు రోజులు బాగా జ్వరం వచ్చినది. డొక్కలు ఎక్కువగా ఎగరేస్తూ అమితమైన బాధ అనుభవించాడు. తెరిపి లేని దగ్గు, ఆయాసం వున్నది. ఆహారం ఏమీ ఇమడలేదు. 5వ రోజుకి కొంచము తగ్గి ఊపిరితిత్తులలో గురగుర వున్నది. మరల ఇప్పుడు ఆ విధముగానే వచ్చినది. దీనికి ఏ మందులు వాడాలి?

★ దీనిని బ్రాంకియొలైటిస్ అని అంటారు. పై లక్షణాలు వచ్చినప్పుడు వెనువెంటనే చిన్న పిల్లలను చూసే వైద్యుల దగ్గరకి తీసుకు వెళ్లి చూపించవలసి ఉంటుంది. అవిల్, ఫిరిటాన్ వంటి మందులు, కార్టిసోన్, డెరిఫిలిన్ వంటి మందులు వైద్యులు అవసరాన్నిబట్టి వాడటం జరుగుతుంది.

టి. ఆర్. సి. ఎమ్. – ఏలూరు.

నాకు చిన్నతనములో ముక్కు కుట్టించినారు. నాకు ఇప్పుడు 30 సంవత్సరములు. ఈ మధ్యనే ముక్కు ప్రోగు తీసివేసినాను. ఇప్పుడు ఆ కుట్టు అసహ్యంగా వున్నది. కుట్టు పూడిపోవటానికి ఏదైనా మార్గము వున్నదా?

★ ఏ ప్రత్యేక చికిత్సా లేకుండానే ఆ కుట్టు పూడిపోతుంది. పై పూతగా టెర్రామైసిన్ స్కిన్ ఆయింట్‌మెంట్ వాడండి. □

కన్నప్రేమా! నీ ఖరీదెంత?

శ్రీ మధురజీ



ఆనంద భవన్

అధునాతనంగా, ఆకర్షణీయంగా, ఖరీదుగా, ఠీవిగా ధనవంతుని దర్పంలా వుంది. చుట్టూ అశేషంగా పరుచుకున్న పూరి గుడిసెల మధ్య గర్భ దరిద్రుల నడుమ ఆగర్భ శ్రీమంతునిలా వుంది. బడుగు జీవుల మొండి గోడల కొంపల మధ్య మహారాజుల పాల రాతి మేడలా దర్జాగా వుంది.

తూర్పున వెలుగు రేకలు విచ్చుకుంటున్న వేళ.

ఖరీదైన హాల్లో విదేశీ గోడ గడియారం సంగీతాన్ని మేళవించి ఆరు గంటలతో మేలుకొలుపులు పాడుతున్న వేళ.

సరిగ్గా అదే వేళకు మూడో అంతస్థులో ఆరో నెంబరు గదిలో విదేశీ అలారం విన సొంపుగా మ్రోగుతోంది.

అప్పటికే నిద్ర లేచిన ఆరేళ్ల వికాస్ నిద్ర కళ్లతో గోడ మీదున్న రంగు రంగుల క్యాలెండర్‌ను నిర్లిప్తంగా గమనిస్తున్నాడు. మరో మంచంలో తొమ్మిదేళ్ల విరిత యింకా తృప్తిగా నిద్ర పోతూనే వుంది. కిటికీలో నుండి తెరలు తెరలుగా వస్తున్న పిల్ల గాలులకు క్యాలండర్ మీదున్న రంగుల బొమ్మలు గమ్మత్తుగా కదులుతున్నాయి.

క్యాలండర్‌మీద ఎవరో అమ్మా, నాన్నలు ఆనందంగా వున్నారు. నాన్న గుర్రంలా మోకాళ్ల-మీద వంగుంటే నాలుగేళ్ల పిల్లవాడు వీపుమీద రౌతులా స్వారీ చేస్తున్నాడు. ఆ పిల్లవాని కన్నుల్లో ప్రపంచాన్ని జయించినంత విజయగర్వం.

అమ్మ మెడ చుట్టూ చేతులు వేసి కావలించుక వేలాడుతున్న ఆరేళ్ల బాలిక. ఆ బాలిక మొహంలో సంతోషం పొంగి పొర్లుతోంది. ఆ అమ్మా నాన్నలు ప్రపంచాన్నే మరచిపోయి తమ పిల్లల మొహాల్లో వెలిగి పోతున్న కాంతి పుంజాలను ఆనందంతో గమనిస్తున్నారు.

వికాస్ తదేకంగా ఆ క్యాలండర్‌ను గమనిస్తు-న్నాడు. ఎందుకో ఎంత సేపు చూచినా మళ్లీ మళ్లీ చూడాలని ఉంటుందేమో ఆ దృశ్యాన్ని.

వికాస్ మనసులో అకస్మాత్తుగా అమ్మా నాన్న మెదిలారు. ఆ చిన్నారి కళ్లలో ఓ క్షణం మెరుపు మెరిసింది. కానీ ఆ మెరుపు కేవలం ఒక్క క్షణమే. మరుక్షణం చీకటి ఆవరించింది.

స్ప్రింగ్ తలుపు మెల్లగా తెరుచుకుంది. తెరుచు-కున్న తలుపులగుండా ఎవరొస్తారో వికాస్‌కు తెలుసు.

ఆయా సరస్వతమ్మ!

సరస్వతమ్మకు నలభై ఏళ్ళుంటాయి. వికాస్ పుట్టుకకు ముందే ఆనందభవన్‌లో ప్రవేశించిది. సరస్వతమ్మ భర్త రాజయ్య అయ్యగారి కారు డ్రైవర్. మొదట్లో సరస్వతమ్మ వంట పనులవీ చూస్తున్నా విరిత, వికాస్‌లు పుట్టాం తర్వాత వాళ్లిద్దరికీ ఆయా అయ్యింది. పిల్ల లిద్దరి అవసరాలు దగ్గరుండి చూడటం ఏ క్షణం ఏం కావలసినా క్షణాల్లో వారి కవి అమర్చటం వారు ఆరు గంటలకు నిద్ర లేచింది మొదలు మళ్లీ తొమ్మిది గంటలకు నిద్రలోకి జారుకునే దాకా అన్నీ సరస్వతమ్మ చేతుల మీదుగా జరగాలి. సరస్వతమ్మ జీవితంలోవిరిత, వికాస్‌లు ఓ ప్రధాన భాగం.

'అమ్మాయిగారూ.... ఆరు గంటలయింది లెగండమ్మా....చూడు వికాస్ బాబుగారు అప్పుడే నిద్ర లేచారు కూడా.... ఊఁ ఊఁ.... లెగండి విరితమ్మాయిగారూ..... అమ్మగారికి తెలిస్తే నన్ను కోప్పడతారు....'

'అప్పుడే సిక్స్ అయ్యిందా ఆయా.....'

'ఆరు దాటి పోయిందమ్మాయిగారూ....'

విరిత కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది. వికాస్ అప్పటికే మంచం దిగి కిటికీ దగ్గర నుంచుని తోటలోకి చూస్తున్నాడు. తోటలో అవుట్ హవుస్ ప్రక్కనున్న సరస్వతమ్మ గుడిసె కనబడుతోంది. గుడిసె ముందు కుక్కి మంచంలో సరస్వతమ్మ భర్త డ్రైవర్ అంజయ్య వెల్లకిలా ఆకాశం చూస్తూ పడుకున్నాడు. రాజయ్య గుండెల మీద కూర్చుని దట్టంగా పెరిగిన మీసాలు పెరుకుతున్నాడు. సరస్వతమ్మ కొడుకు ఐదేళ్ల చిన్నయ్య.

'అరే వెధవా! యిదేం ఆటరా... వుండు నీ పని చెప్తా....' రాజయ్య చిన్నయ్య చెవి పట్టుకో బోయాడు. కానీ వాడు హఠాత్తుగా మంచం దూకి తూనీగలా పరుగు లంకించుకున్నాడు. చిన్నయ్యను వురికి పట్టుకోబోయి మంచం పట్టె కాలికి తగిలి మంచంలో బోర్లా పడ్డాడు రాజయ్య.

దూరంగా నిలబడి చప్పట్లు కొడుతూ పక పకా నవ్వుతున్నాడు చిన్నయ్య. వికాస్ కూడా చప్పట్లు కొడుతూ కిల కిలానవ్వుతూన్నాడు.

'ఏంటి బాబుగారూ....బలే నవ్వుతున్నారు...'

'అదిగో అటు చూడు ఆయా....' సరస్వతమ్మ కిటికీలో నుండి తోటలోకి చూచింది.

'మా చిన్నయ్య వాళ్ల నాన్నను ఆట పట్టిస్తున్నాడు మా వా దొట్టి అల్లరి వెధవ బాబూ.... వాడికి చదువూ గిదువూ వంట బట్టేట్టు లేవు'

వికాస్ మనసులో అమ్మా నాన్నలు మెదిలారు.

నవ్వుతున్న పెదవులు హఠాత్తుగాఆగిపోయాయి.

వికాస్, విరితల స్నానాలు దగ్గరుండి చేయించింది సరస్వతమ్మ. ఇద్దరికీ ఖరీదైన బట్టలు వేసింది. నీడలు కనబడే బూట్ వేసింది. విదేశీ సెంట్లు

చిరునవ్వు

మురిపించే చిరునవ్వు
నాకు దూరం కాకు నువ్వు!
సుదీర్ఘమైన ఈ జీవన యానంలో
కష్టాలు ఎన్ని ఎదురైనా
కక్షలూ కార్పణ్యాలు నన్ను
వేపిరించినా

కుంగి పోక లొంగిపోక
జయించే శక్తి నీకుంది
అదే నాకు కావలసింది!
హృదయంలో అగ్ని పర్వతాలు
బద్దలవుతూన్నా
మనసు మమతా మనుషుల
అసూయాగ్నిలో పడి
మాడి మసవుతున్నా
బంధనాల బాహువుల్లో బతుకు చితికి
పోతున్నా

అన్నీ మరపించే చిరునవ్వా
నాకు దూరం కాకు నువ్వు!
లోకం నన్ను కాదన్నా
తోడింకెవరూ లేకున్నా
నీవు జోడుగా వుంటే చాలు
నేను నిండుగా వుండగలను
నువ్వుంటే ఆరోగ్యం
నువ్వుంటే ఆనందం
నువ్వే ఒక అందం
నీ నీడలో ఎక్కొచ్చును అందలం
మురిపించే చిరునవ్వా
నాకు దూరం కాకు నువ్వు!

— శారదా అశోకవర్ధన్

కన్న ప్రేమా నీ ఖరీదెంత?

పూసింది. శుభ్రంగా, అందంగా తలలు దువ్వింది. విరిత జడలో గులాబీని సుతారంగా అమర్చింది. వికాస్‌కు టై బిగించింది.

వికాస్ విరితలు

మంచి ముత్యాల్లా మెరిసి పోతున్నారు.

నందనంలో విరిసిన పారిజాతాల్లా వెలిగి పోతున్నారు.

హాల్లోని గడియారం ఎనిమిది గంటలని చెప్పింది సంగీతం వినిపిస్తూ.

డైనింగ్ హాలు.

ప్రత్యేకంగా ఫ్రాన్స్‌నుండి దిగుమతి చేసుకున్న డైనింగ్ టేబులు యజమానుల గొప్పతనానికి సజీవమైన ఉదాహరణలా వారి ఖరీదైన అభిరుచికి తిరుగులేని సాక్ష్యంలా హుందాగా వుంది.

వికాస్, విరిత చెరో కుర్చీలో కూర్చున్నారు.

వికాస్ మాటి మాటికి గుమ్మం తెర వంక చూపులు సారిస్తున్నాడు. కళ్లల .. నిరీక్షణ.

రమేష్ చౌదరిగారు, గాయిత్రీ దేవిగారు ఠీవిగా డైనింగ్ హాల్లో ప్రవేశించారు.

'గుడ్ మార్నింగ్....డాడీ అండ్ మమ్మీ....' ఉత్సాహంగా పలికారు.

'గుడ్ మాణింగ్....గుడ్ మాణింగ్....' మమ్మీ, డాడీ బదులు పలికారు.

వికాస్, విరితలకు యెదురుగుండా కూర్చున్నారు రమేష్ చౌదరి, గాయిత్రీదేవి గారలు. వారికి యెదురుగుండా రక రకాల పదార్థాలు వేడి పొగలు గ్రక్కుతూ, కమ్మని వాసనల్ని వ్యాపింప చేస్తున్నాయి.

'సరస్వతీ....పిల్లలకు వడ్డించు-'

'అలాగేనమ్మగారూ....'

సరస్వతి వడ్డించింది. విరిత తలవంచుకుని తినటం ప్రారంభించింది మౌనంగా. వికాస్ కనీసం ప్లేటు వంక కూడా చూడకుండా తల్లి వంకే కళ్లార్పకుండా చూస్తున్నాడు.

'కమాన్ మై బాయ్....హావ్ యువర్ టిఫిన్' గాయిత్రీదేవి చెప్పారు.

'ఉహుఁ....నాకొద్దు'

'అదేం....?!' – తండ్రి.

'మమ్మీ....తినిపించా...లి' తలవంచుకుని కోరిక బైట పెట్టాడు.

అమ్మ కొసరి కొసరి తినిపిస్తే కడుపునిండా తినాలన్న కోరిక మనసులో బలంగా నాటుకొనేలా చేసింది వికాస్‌కు రాత్రి చిన్నయ్యకు ఆయా సరస్వతమ్మ వెన్నెట్లో గోరు ముద్దలు కొసరి కొసరి తినిపిస్తున్న దృశ్యం.

'వాట్.... నాన్సెన్స్.... వికాస్ నువ్వింకా చిన్న పిల్లాడివి కాదు.... ఊరికే తినెయ్' మమ్మీ తీవ్రంగా చూస్తూ మందలించింది.

'యు ఆర్ నాట్ ఎ కిడ్ మై సన్ – ' నవ్వుతూ భార్యను బలపరిచాడు.

వికాస్ బిక్క మొహ మేసుకున్నాడు. తమ్ముని బిక్క మొహాన్ని చూసి కిసుక్కున నవ్వింది విరిత. వికాస్ మనసు చిన్నబోయింది. రాత్రి ఆ దృశ్యం చూశాక చిన్నారి మనసు ఈ క్షణం కోసం తహ తహ పడింది. కానీ ఆ కోరిక యిలా అపహాస్యానికి గురవుతుందని వికాస్ మనసు ఊహించలేక పోయింది.

'చిన్నయ్యది మాత్రం నా వయసు కాదేంటి....?

వికాస్ ఆ ప్రశ్న యెవ్వరినీ అడగలేదు. మౌనంగా తలవంచుకుని తినటం ప్రారంభించాడు. తల్లి గాని, తండ్రిగాని తనను గమనిస్తున్నారేమోనని ఆశగా కను కొలుకుల్లో నుండి గమనించాడు.

వికాస్ ఆశ నిరాశే అయ్యింది.

గాయిత్రీదేవిగారు తన రాజకీయాల గురించి చెపుతున్నారు.

రమేష్ చౌదరిగారు తన బిజినెస్ గొడవల గురించి చెపుతున్నారు.

'మమ్మీ.... మీరు డాడీ.... సాయంకాలం నాలుగింటికి మా కాన్వెంట్‌కు రావాలి' విరిత చెప్పింది.

'ఎందు కేమిటి ?'

'సాయంకాలం పేరెంట్స్ గెట్ టుగెదర్ ఫంక్షనుంది'

'నాలుగింటికా....బహుశా నాకు కుదరకపోవచ్చు. సరిగ్గా నాలుగింటికే సోషల్ వెల్ ఫేర్ మినిష్టర్‌గారు మురికివాడల్ని విజిట్ చేస్తున్నారు. నేను తప్పని సరిగా దగ్గరుండాలి....మీ డాడీకి వీలయితే రాగలరులే....'

'ఆఁ ఆఁ...చూద్దాం'

బ్రేక్ ఫాస్ట్ ముగిసింది.

'గాయిత్రీ....నేను ఫ్యాక్టరీకి వెడతాను...ఓ అర్జంటు మీటింగుంది....'

'పదండి....పదండి...నేనూ ఓ సారి ఛీఫ్ మినిష్టర్‌గార్ని కలిసి రావాలి...ఉమెన్ వెల్‌ఫేర్ సొసైటీ గురించి ఓ చిన్న లిటిగేషనుంది....ఎలాగైనా ఆ అడ్డు తొలగించాలి మనం....చూడు సరస్వతీ! పిల్లలిద్దరినీ జాగ్రత్తగా కార్లో కాన్వెంట్‌కు తీసికెళ్ళు హడావుడిగా పైపు కాల్చుకుంటూ రమేష్ చౌదరిగారు వెళ్ళిపొయ్యారు.

పట్టు చీర పదే పదే సవరించుకుంటూ గాయిత్రీ దేవిగారు వెళ్ళిపొయ్యారు.

వెళ్ళిపోతున్న అమ్మా నాన్నలను శూన్య దృక్కులతో గమనిస్తున్నాడు వికాస్. ఆ చిన్నారి చూపుల్లో ఎవరికీ అర్థం కాని నిరాశ! ఆ లేత మనసులో కన్నవారి కర్థం కాని చీకటి పొరలు!!

రెండు కార్లు వెళ్లిపోయిన శబ్దం డైనింగ్ హాల్లోకి వినిపించింది.

'పదరా వికాస్....కాన్వెంట్‌కు టైమవుతోంది' విరిత హెచ్చరించింది. వికాస్ బదులు పలకకుండా అంగీకారంగా తలూపాడు.

సరస్వతమ్మ యిద్దరి స్కూల్ బాక్సులూ సర్దింది. మళ్లీ ముఖాలకు పౌడరద్ది, చెదిరిన ముంగురులు సవరించింది. డ్రైవర్ వచ్చి వినయంగా నిలుచున్నాడు.

'పదండి బాబుగారూ.... పదండమ్మాయిగారూ....

ఇద్దరూ బూట్లు టక టక లాడించుకుంటూ మెట్లు దిగారు. డ్రైవరు తలుపు తెరిచి పట్టుకున్నాడు. వికాస్, విరిత వెనుక సీట్లో కూర్చున్నారు. సరస్వతమ్మ ముందు కూర్చుంది.

కారు కాన్వెంట్ కేసి కదిలింది

వికాస్ కాన్వెంట్‌లో చేరి అప్పుడే ఆరు నెలలు గడిచి పొయ్యాయి క్రొత్తలో కాన్వెంట్‌లో చేరినపుడున్న వుత్సాహంలో నూరవ వంతయినా యిప్పుడు వికాస్‌లో లేదు.

వికాస్‌కు ఎక్కడో ఏదో వెలితి. ఆ వెలితి క్రమ క్రమంగా పెద్దదవుతోంది ఏదో కావాలని మనసు పదే పదే కోరుకుంటోంది. కాని తను కోరుకుంటున్నది ఎలా చెప్పాలో తెలియటం లేదు వికాస్‌కు

క్లాసు మొదలయ్యింది.

మేడమ్ 'మదర్' పాఠం చేపుతోంది. వికాస్ కూడా పుస్తకం తెరిచి పాఠం వింటున్నాడు. పాఠం కంటె ముందు రంగు రంగుల బొమ్మ. బొమ్మలో ఓ తల్లి. ఆ తల్లి కొంగు నీడన దాక్కున్న ఓ కొంటె పిల్ల-వాడు.

వికాస్ పాఠం వినకుండా ఆ బొమ్మనే నిశితంగా గమనిస్తున్నాడు. ఆ తల్లి మొహంలోకి పరిశీలనగా చూస్తున్నాడు. ఆ తల్లి కళ్ళు కొడుకుమీద వాత్సల్యంతో తారకల్లా మిల మిలా మెరుస్తు-న్నాయి.

'మరి మమ్మీ కళ్ళు... ఎప్పుడూ అలా.. అలా.. .వుండవేం..... ఆ పసి మనసు అంతరాంతరాల్లో జవాబు లేని ప్రశ్న. జవాబు తెయని ప్రశ్న.

హఠాత్తుగా వికాస్ కళ్ళ ముందు రాజయ్య – చిన్నయ్యల పరుగు మెదిలింది.

తన గదిలో గోడమీదున్న రంగు రంగుల క్యాలండర్‌లోని తల్లి మెదిలింది.

'వికాస్... బి అలర్ట్' మేడం హెచ్చరించింది

వికాస్ మనసును అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించాడు.

మధ్యాహ్నం ఒంటి గంటకు సరస్వతమ్మ క్యారియర్ తెచ్చింది కాన్వెంట్ డైనింగ్ రమూలో యిద్దరికీ వడ్డించింది.

విరిత తన ఫ్రెండ్స్‌తో తెగ కబుర్లు చెపుతూ భోం చేస్తోంది. వికాస్ మౌనంగా తింటున్నాడు

'ఆయా ...మమ్మీ యింటి కొచ్చిందా ...'

'వచ్చారు బాబుగారూ....'

'మరయితే నాలుగ్గింటికి ఫంక్షన్‌కు రమ్మన్నామని చెప్పు'

'అలాగే బాబుగారూ. ..'

సాయంకాలం మూడింటికే క్లాసులు ముగిశాయి నాలుగింటికి తల్లి దండ్రుల సమావేశం. చాలమంది తల్లి దండ్రులు ఒక్కొకరే వస్తున్నారు. వారి తల్లి దండ్రుల రాకతో పిల్లల మొహాల్లో ఉత్సాహం వెల్లి విరుస్తోంది.

వికాస్ చూపులన్నీ గేటుమీదే వున్నాయి కారు రాక కోసం. కానీ వికాస్ ఎదురు చూస్తున్న కారెంతకూ రాలేదు.

వికాస్ మనసులో ఎక్కడో నిరుత్సాహం.

కానీ ఆ కాన్వెంట్‌లో జరుగు ఫంక్షన్‌కు తనను ఛీఫ్ గెస్ట్‌గా పిలిస్తే తప్ప గాయిత్రీదేవిగారు రారని వికాస్‌కేం తెలుసు పాపం!

పోనీ కనీసం తనకు అక్కర కొచ్చే ఏ చిన్న మినిష్టరుగారు ముఖ్య అతిథిగా వచ్చినా...గాయత్రీ-దేవిగారు హాజరయ్యే వారు. కేవలం పిల్లల ముచ్చట తీర్చటానికి తన 'విలువైన' కాలాన్ని వృధా చేసుకునే పిచ్చి తల్లీ కాదు సామాన్య గృహిణీ కాదు గాయత్రీ-దేవిగారు.

ఏ చిన్న ఫంక్షనయినా సరే అది ఏదో విధంగా బిజినెస్‌కు ముడి పడకపోతే రమేష్ చౌదరి గారికి ఆ విషయమే గుర్తుండదసలు

విరిత వికాస్‌లా సున్నిత మనస్కురాలు కాదు. పైగా వికాస్ కంటె రెండు మూడేళ్ళు పెద్దది. మమ్మీ మనస్తత్వం పూర్తిగా కాకున్నా కొంతైనా అర్థం చేసుకుంది కాబట్టి మమ్మీ కోసం వికాస్‌లా ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నిరీక్షించలేదు. తన ఫ్రెండ్స్‌తో సరదాగా కబుర్లు చెపుతోంది

'వికాస్! అదిగో మా మమ్మీ వస్తోంది' ప్రక్కన కూర్చున్న రాజేంద్ర హుషారుగా బెంచీ దూకి ఎదురు వెళ్లాడు. రాజేంద్ర క్కూడా ఆరేళ్ళకు మించి వుండవు.

రాజేంద్ర తల్లి నడుము చుట్టి వేశాడు కౌగిలించుకుని. ఆమె రాజేంద్ర బుగ్గ మీద సుతారంగా ముద్దు పెట్టుకుంది

ఆ దృశ్యాన్ని చూస్తూ వికాస్ అప్రయత్నంగా తన చెంప తుడుచుకున్నాడు. ఒకసారి గాయిత్రీదేవిగారు యిదే కాన్వెంట్‌కు ఛీఫ్ గెస్ట్‌గా వచ్చారు. ఆమెగారు కారు దిగి దిగటంతోటే అప్పటికి కేవలం వారం క్రిందటే కాన్వెంట్‌లో చేరిన వికాస్ – తల్లి చెరుగు క్రింద దూరబోయాడు ఆనందంతో అప్పుడామె వికాస్‌ను ముద్దు పెట్టుకోకపోగా అంత మందిలోనూ తీవ్రంగా మందలించింది. వికాస్ చిన్నబోయిన మనసుతో, కళ్ల నీళ్లతో బిక్క చచ్చి నిలబడి పొయ్యాడు. ఆ చిన్నారి మనసు సర్దుకో-లేనంతగా గాయ పడిందా క్షణంలో

కొందరు ఎంత పెరిగినా చిన్నారి మనసుల నర్థం చేసుకోలేరు మరి! రాజేంద్ర తల్లిని కౌగలించు-కున్నపుడు వికాస్ మనసులో గతించిన గతం కదలాడింది.

రాజేంద్ర వికాస్‌కు తన మమ్మీని పరిచయం చేశాడు. వికాస్ వినయంగా నమస్కరించాడు. బదులుగా వికాస్‌ను దగ్గరకు తీసుకుని నుదుటిమీద గాఢంగా చుంబించింది ఆమె

అనుకోని ఈ ఘటనకు వికాస్ మనసు పులకించింది. తన్మయత్వంగా ఆమె కళ్లలోకి తదేకంగా చూశాడు. ఆ కళ్లలో . వికాస్‌కు తమ మేడమ్ వుదయం చెప్పిన 'మదర్' కనబడింది.

'ఏం బాబూ! మీ మమ్మీగారు రాలేదా... ?'

తియ్యని కంఠం నిండా తరగని ఆప్యాయత. స్పర్శే కాదు ఆ పలకరింపు కూడా సేద తీర్చే మలయ మారుతంలా ఆనందంగావుంది వికాస్‌కు.

'యింకా రాలేదండి... యిక రారేమో....' వికాస్ గొంతులో నిరాశ.

'పోనీ– నే వచ్చేశాగా బాబూ. . యిప్పు డిక నేనే మీ యిద్దరికీ మమ్మీని....'

వికాస్ మొహంలో ముసురుకుంటున్న నిరాశల నీలి నీడలను పసి గట్టి చెదరగొట్టటానికి ప్రయత్నించిందామె. ఆమె ప్రవృత్తి రీత్యా మమతలు పంచి యివ్వగల చల్లని తల్లే కాదు వృత్తి రీత్యా పసి పిల్లల మనస్సుల్ని అవలీలగా చదువగల ఉపాధ్యాయురాలామె.


ఫంక్షన్ మొదలయ్యింది.

వికాస్, రాజేంద్ర ఆమె కటూ యిటూ కూర్చున్నారు. వికాస్ మనసు ఆనందంతో గంతు లేస్తోంది. తను వెదుకుతున్నది హఠాత్తుగా దొరికి-నట్లయ్యింది. మమ్మీ రాలేదన్న విషయమే గుర్తుకు రాలేదు వికాస్‌కు ఫంక్షన్ పూర్తయ్యే వరకూ.

కారు వచ్చింది ఆయా సరస్వతితో.

'ఏం బాబూ...నువ్వూ, విరితా ఒక్కసారి మా యింటికి రారాదూ.. .' ఆదరంగా ఆహ్వానించింది ఆమె. ఆమె పిలవకున్నా వెళ్లాలని వుంది వికాస్‌కు.

కానీ–తన పర్మిషన్ లేకుండా ఎక్కడికి వెళ్ళినా మమ్మీ సహించదని తీవ్రంగా మందలిస్తుందని యింతకు మునుపే స్వానుభవంలోకి వచ్చింది కనుక తన మనసులోని కోరికను మనసు మూలల్లో



బలవంతంగానైనా సరే దాచుకోక తప్పింది కాదు వికాస్‌కు.

'మళ్ళీ ఎప్పుడయినా వస్తానండి'

'ఆల్ రైట్ అలాగే... తప్పక రావాలి సుమా...'

'నమస్తే' వికాస్ అనుకోకుండా చేతులు జోడించాడు.

ఆమె బదులుగా వికాస్‌కో తీయని ముద్దిచ్చింది

కారు కదిలింది. రాజేంద్ర ఆమె యెక్కిన రిక్షా కదిలింది.

సుఖంగా కారులో కూర్చున్నా యిరుకు రిక్షాలో దాదాపు తల్లి ఒడిలో ఆనందంగా కూర్చుని పయనిస్తున్న రాజేంద్రమీద వికాస్ మనసులో ఎక్కడో రవ్వంత ఈర్ష్య లీ ాకదిలింది.

సాయంకాలం

గార్డెన్‌లో వికాస్, విరిత కాస్సేపు ఆడుకున్నారు. ఆటల్లో కూడా బట్టలు మురికి చేసుకుంటే గాయిత్రీదేవిగారు కోప్పడతారు. మొరటు పిల్లల్లా కాకుండా పాలిష్డ్‌గా ఆడించమని స్ట్రిక్ట్‌గా ఆర్డర్స్ జారీ చేశారు.

వికాస్ మనసులో చిన్నయ్యలాసరదాగా మట్టిలో దొర్లి యిసుకలో దూకి ఆడుకోవాలని వున్నా 'కుదరదు' కాబట్టి సరిపెట్టుకోక తప్పదు.

సరస్వతమ్మ యిద్దరికీ స్నానం చేయించింది బట్టలు మార్చింది.

సరిగ్గాఆరు గంటలకు ట్యూషన్ మేడమ్ వచ్చారు. ఎనిమిదింటి వరకు ఆమె ట్యూషన్ చెప్పారు. ఎనిమిదింటికి డైనింగ్ హాల్లో భోజనం అంత విశాలమైన టేబిల్ ముందు వికాస్, విరిత. ఎప్పుడో తప్ప గాయిత్రీదేవిగారు, రమేష్‌చౌదరిగారు ఎనిమిదింటికి యింటికి రారు. మళ్ళీ ఉదయం ఎనిమిది గంటలకు తప్ప మమ్మీ, డాడీ కనబడరు వికాస్‌కు

ఎనిమిదిన్నర నుండి తొమ్మిది వరకూ టేప్ రికార్డులో సంగీతం వింటూనో, ఏవైనా కథల పుస్తకాలూ, బొమ్మల పుస్తకాలూ చదువుతూనో కాలక్షేపం.

తొమ్మిది గంటలకు తప్పని సరిగా నిద్ర.

విరిత మనస్తత్వం అదో రకం. దేనికయినా సులభంగా అలవాటు పడిపోగలదు- సర్దుకపోనూ

కన్న ప్రేమా నీ ఖరీదెంత?

గలదు. కాని వికాస్ మనసు మరీ సున్నితం సున్నితమైన ఆ మనస్సు పొరల్లో ఎక్కడో ఏదో గాయమైంది. ఏదో ఏదో కావాలని ఆ లేత మనసు పదే పదే ఆరాట పడుతోంది. కాని ఆ మనసులోని ఆరాటాన్ని అర్థం చేసుకుని ఆదరించగల వారేరీ? వికాస్ తనను అను క్షణము కనిపెట్టుకున్న సరస్వతమ్మ అర్థం చేసుకోలేనంతటి అమాయకుడు కాదు వికాస్.

సరస్వతమ్మ చిన్నయ్య పట్ల కనబరచేది ప్రేమ.

వికాస్, విరితల పట్ల చూపించేది బాధ్యత, డ్యూటీ.

ఆటు మొన్న, మొన్న, నిన్న, నేడు, రేపు, మరునాడు ఆ పై మరునాడు .. రొటీన్ యాంత్రికం. ఒకే గాడిలో తిరుగుతున్న జీవిత చక్రం

అందుకే అన్ని సుఖాలున్నా ఆ పసి మనసులో వెలితి.

అన్నీ అందుబాటులో నున్నా ఏదో కనబడని లోటు

వికాస్ కళ్ళు మూసుకున్నాడు. ఎందుకో నిద్ర రావటం లేదు. విరిత గుర్రు పెడుతూ హాయిగా నిద్రపోతూ వుంది వికాస్ మనసులో హఠాత్తుగా రాజేంద్ర మెదిలాడు. తల్లి ప్రక్కన పడుకుని- ఒక చేత్తో తల్లిని కావలించుకుని తృప్తిగా పడుకుని వుంటాడేమో! అప్రయత్నంగా విశాలమైన తన మంచంలో తన ప్రక్కన చూసుకున్నాడు ఖాళీ మంచం వెక్కిరించింది మనసు బాధతో మూలిగింది.

వికాస్ కళ్ళు ఎదురుగా నున్న గోడమీద నిలిచాయి.


తండ్రి వీపు మీద స్వారీ చేస్తున్న చిలిపి కుర్రాడు.

తల్లి మెడను కావలించుకున్న అందాల అమ్మాయి

తదేకంగా చూస్తూ.. చూస్తూ.. అలసి కళ్ళు మూసుకున్నాడు వికాస్.

సరిగ్గా అప్పుడు రెండుకార్లు పోర్టికోలో ఆగాయి.

విదేశీ గడియారం సంగీతం వినిపిస్తూ పదకొండు గంటలు కొట్టింది



* * *

మళ్ళీ తెల్లవారింది.

గడియారంతో పాటు యాంత్రిక దినచర్య మొదలయ్యింది వికాస్‌కు ఎంత మాత్రమూ వుత్సాహంగా లేదు. ఆయా చెప్పిన వాటిని మౌనంగా చేయించుకుంటున్నాడు.

ఎనిమిది గంటల వేళ డైనింగ్ హాల్లో బ్రేక్‌ఫాస్ట్

వికాస్ మౌనంగా గుమ్మంకేసి చూస్తున్నాడు.

రమేష్ చౌదరిగారు, గాయిత్రిగారు ఉరుకులు, పరుగులు మీద వచ్చారు వికాస్ మొహం చిన్నబోయి వుండటం వారిద్దరిలో ఎవ్వరూ గుర్తించలేదు.

'గుడ్ మార్నింగ్. '

'వెరీ గుడ్ మార్నింగ్...' పలుకరింపుల్లో కూడ యాంత్రికత్వం

'సరస్వతీ! నాకు త్వరగా వడ్డించెయ్ నే నర్జంటుగా వెళ్ళిపోవాలి. మినిస్టర్ గారీవేళ పబ్లిక్ మీటింగ్ ఆపెండ్ చెయ్యాల్సి వుంది.

'వారికి మీటింగ్ వుంటే నీ కెందుకోయ్ అంత తొందర'

'నేను లేకుంటే ఆ మంత్రిగారికి నోట మాటరాదు మరి'

గలగల నవ్వులు రాజీ యాలు బిజినెస్ ముచ్చట్లు మార్కెట్లు కాన్ఫరెన్సులు...

వారి మాటల్లో ప్రపంచమంతా దొర్లుతోంది తమ చిన్నారులు తప్ప. ప్రజలందర్నీ 'పునరుద్ధరించగల' మంటున్న నాయకురాలికి తన పిల్లల కేంకావాలో కూడా తెలియకపోవడం విచిత్రం!

సరస్వతమ్మ హడావుడిగా వడ్డించింది.

విరిత, వికాస్ మౌనంగా తలవంచుకుని తింటున్నారు- వికాస్ మధ్య మధ్య మమ్మీ, డాడీలను గమనిస్తున్నాడు.

బ్రేక్ ఫాస్ట్ ముగిసింది. పిల్లలు కాన్వెంటుకు సిద్ధమయ్యారు- సరస్వతమ్మతో సరిగ్గా అప్పుడు తోటమాలి రంగయ్య పరుగుల మీద వచ్చాడు.


'యిగో సరసవతమ్మా... మీ సిన్నయ్యగాడు కాల్వారి రోడ్డు మీన బోర్ల బడినాడు... తలకు సిన్న గాయమైంది .. 'అమ్మో' అని గోల గోలగా ఏడుత్తున్నాడు. ..'

'ఆ!!'- సరస్వతమ్మ చేతిలోని కాన్వెంట్ బాక్స్ జారింది.

సరస్వతమ్మ కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. ఆ కళ్ళనిండా ఆందోళన, భయం, ఆదుర్దా చోటు చేసుకున్నాయి. వికాస్ ఆయా ముఖంలోని భావాలు చదవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ కళ్ళలో ప్రతిబింబిస్తున్న తల్లి మనసును అర్థం చేసుకోటానికి యత్నిస్తున్నాడు.

'అమ్మగారూ....' గాయిత్రీదేవిగారి గంభీరమైన ముఖం చూసి... మాటలు గొంతులోనే ఆగిపొయ్యాయి. సరస్వతమ్మకు.

'ఇదిగో రంగయ్యా... ఆ పిల్లవాన్ని మన డాక్టరుగారి దగ్గరకు తీసి కెళ్ళండి... యిదిగో సరస్వతీ! వాడికేమీ కాదు గాని కాన్వెంటుకు ఆలస్య మవుతోంది వీళ్ళని తీసికెళ్ళు'


"తలనొప్పికోసం ఎన్నో వాడి చూశాను...
అయితే అత్యుత్తమంగా పనిచేసేది సారిడన్!"
ఒక్క బిళ్ల సారిడన్ వేసుకుంటే చాలు. మీ తలనొప్పి క్షణంలో వదిలి పోతుంది. కారణం, ఔషధ పరిశ్రమలో ప్రపంచ నేతలైన రోష్‌వారు పరిశోధించి రూపొందించిన అద్వితీయ ఔషధ సూత్రం సారిడన్‌లో ఉండడమే!
కనుక, ఈసారి మీకు తలనొప్పి వచ్చినప్పుడు గట్టి మందే వేసుకోండి. సారిడన్ తీసుకోండి.
Saridon
సారిడన్
ట్రేడ్‌మార్కు 'రోష్'
ఒక్కటి, నిజంగా పనిచేసేది.
RPL-1205

'అది కాదండమ్మగారూ...' ఆ తల్లి మనసు ఏదో చెప్పటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూనే వుంది.

'మమ్మీ .. పాపం ఆయాను వెళ్లనీయండి... కార్లో మేం వెళ్లి పోగలంలే...' సరస్వతమ్మ ఆందోళన గమనిస్తూ వికాస్ అన్నాడు.

'నోర్మూసుక వెళ్ళు'

సరస్వతమ్మ, వికాస్, విరితలు నిశ్శబ్దంగా కదిలారు.

'పిచ్చి మొహం... దెబ్బ తగిలిన పిల్లవాడికి తగిన వైద్యం కావాలిగాని... తనెళ్లి ఏం చెస్తుంది... బ్లడీ సెంటిమెంట్స్'

ఆ మహాతల్లికి తల్లి మనసు అంతబాగా అర్థమయ్యింది మరి!

ప్రతి అవసరాన్ని 'ఖరీదుల దృష్టితో' చూట్టం తప్ప సున్నితమైన విషయాలు ఆ ప్రజా నాయకురాలికి మరోవిధంగా బోధపడవు.

కార్లో కూర్చున్నా వికాస్ మనసు ఆందోళనగానే వుంది. మధ్య మధ్య చూపులు ముందుకు సారించి ఆయా చెంపల మీదుగా కారుతున్న కన్నీటిని ఆర్ద్ర హృదయంతో తిలకిస్తున్నాడు.

'ఆయాకు నేనేం సాయం చేయగలను...?'

క్లాసు రూములో కూడా వాతావరణం ఆహ్లాదకరంగా లేదు. కారణం వికాస్ మిత్రుడు రాజేంద్ర ఆ రోజు కూడా క్లాసుకు రాలేదు. అప్పటికి నాలుగురోజులుగా రాజేంద్ర కాన్వెంటుకు రాలేదు జ్వరంతో.

'అయ్యో పాపం... రాజేంద్ర జ్వరంతో ఎంత బాధ పడుతున్నాడో... పోనీ ఒకసారి చూసొస్తే... అమ్మో.. మమ్మీకి తెలిస్తే . ప్చ్.... తెలియనీ జ్వరంతో నున్న ఫ్రెండును చూస్తే తప్పేమిటి... ఏమయినాసరే సాయంకాలం వెళ్ళాలి... ఎటూ మా కారు వెళ్లే దారిలో నేగా రాజేంద్ర యిల్లు ...' పాఠం వినకుండా ఆలోచిస్తున్నాడు.'

రాజేంద్ర తల్లి వికాస్ మనసులో మెదిలింది

ఆ రూపం వికాస్‌కు తెలియని తృప్తినిచ్చింది.

సాయంకాలం

'డ్రైవర్! యిక్కడ కారాపు. .' వికాస్.

'అదేంటి బాబుగారూ...' సరస్వతమ్మ

'మా ఫ్రెండు రాజేంద్రను చూడాలి '

'అమ్మగారు కోప్పడతారు..'

'డ్రైవర్... ఆపుతావా..దూకమంటావా... కోపంగా గద్దించాడు వికాస్. కారు సడన్‌గా ఆగిపొయ్యింది. తలుపు తెరచుకుని చకచకా ఆ ఇంట్లోకి వెళ్లి పోయాడు వికాస్. విరిత ఆశ్చర్యంగా వికాస్‌లోని ధైర్యాన్ని, మార్పును గమనిస్తోంది.

'రాజేంద్రా... రాజేం...'

'రా బాబూ... రా... రా... నీ ఫ్రెండును పరామర్శించడానికి వచ్చావా...' ఆ తల్లి ఆదరంగా ఆహ్వానించింది వికాస్‌ను. రాజేంద్ర బెడ్‌మీద కూర్చున్నాడు నీరసంగా. జ్వరం తగ్గినా నీరసం తగ్గలేదు. ఆమె వికాస్‌కు బిస్కెట్లు, టీ యిచ్చింది. అంతకంటే ఎంతో ఖరీదైన బిస్కట్లు తిన్నా వాటిలోలేని రుచి ఆమె యిచ్చిన బిస్కట్లలో కనబడింది వికాస్‌కు.

ఆ పసి మనసుకేం తెలుసు ఆ రుచి ఆ తల్లి మనసులో నిదని!

కన్న ప్రేమా నీ ఖరీదెంత?

'రాజేంద్రా! మీ అమ్మగారు స్కూలు కెళ్లలేదా..'

'నాకు జ్వరం వచ్చిందగ్గర్నుంచి మా అమ్మ స్కూలుకేకాదు... నా గురించిన బెంగతో అన్నం నీళ్ళు మానేసింది' నవ్వుతూ చెప్పాడు రాజేంద్ర.

'బాబూ... వాడి మాటలు నమ్మకేం .. నా ఆందోళన, భయం వాడికే వాడికెగతాళిగానే వుంటుంది....'

వికాస్‌మనసులో ఉదయం సరస్వతమ్మ ముఖం మెదిలింది. మరుక్షణం... ఆయాను శాసిస్తున్న మమ్మీ ముఖం మెదిలింది.

అను క్షణం తల్లి యిలా కనిపెట్టు కున్నప్పుడు నాలుగైదు రోజులు జ్వరమొచ్చినా సరేబలే సుఖంగా వుంటుందని పించింది. ఆ వాతావరణాన్ని, ఆ తల్లి శ్రద్ధను, ఆందోళనను, ప్రేమను గమనిస్తున్న వికాస్‌కు.

అరగంట తర్వాత మనసు కదలనని మొరాయిస్తున్నా కదిలాడు.

వికాస్ మనసిప్పుడు తేలికగావుంది.

ఆ రాత్రి కళ్ళు మూసుక పడుకున్నా వికాస్ మనసులో ఉదయం జరిగినసంఘటన సాయంత్రం రాజేంద్ర యింట్లోని దృశ్యం పదేపదే కదలాడాయి.

ఆ రెండు దృశ్యాల్లోని భేదాన్ని కూడా ఆ లేత మనసు చాలావరకు గ్రహించ గలిగింది.

* * *

వికాస్ మనసులో మార్పు ప్రారంభమయ్యింది. తనుకోరుకున్నది రోజు రోజుకూ తనకు దూర మవుతున్నందుకు బాధ... అవమానం.

ఆ బాధ, అవమానాల్లోనుంచి కసి...

ఆ సాయంకాలం

చిన్నయ్యతో కలిసి మట్టిలో ఆడుకుంటున్నాడు. ఇసుకలో దొర్లాడు. వీధిలో బండివాడు అమ్ముతున్న ఐస్‌ఫ్రూట్ కొనుక్కున్నాడు. కావాలని బట్టలు మాపేసుకున్నాడు. ట్యూషన్ మేడమ్‌తో తగువు పెట్టుకున్నాడు.

మర్నాడు

ఉదయం ఎనిమిదయినా మంచం దిగలేదు. టిఫిన్ ప్లేటు విసిరేశాడు. వంట మనిషితో పోట్లాట వేసుకున్నాడు. అలిగి కాన్వెంటు మానేశాడు.

కావాలనే... అర్థంకాని కసితో గడియారానికి ముడివడ్డ తన దినచర్యను బలవంతంగాబద్దలు చేశాడు.

ఆయా వద్దంటున్నా వినకుండా మధ్యాహ్నం ముసుగుతన్ని రాజాలా నిద్రపోయాడు.

గాయత్రీదేవిగారికి సరస్వతమ్మ వికాస్‌ను గురించి ఫిర్యాదు చేసింది.

వికాస్ చేస్తున్న అల్లరి వెనుక, ఆగడం వెనుక ఆ పసి మనసు కోరుతున్నదేదో అర్థం చేసుకోగల నేర్పు, ఓర్పు, సహృదయత, వివేచన, ఆడమనసు ఆ గొప్పింటి యిల్లాలుకు లేవు.

వికాస్‌ను తన గదికి పిలిపించింది. వాడిని లాలించి, బుజ్జగించి విషయంతెలుసుకోడానికి బదులు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రాన్ని సంధించింది.

వికాస్ అంతరాంతరాల్లో మమ్మీని ఎదిరించాలన్న కసి...

ఎదురు తిరిగాడు. మాటకు మాటాఅన్నాడు.

గాయత్రీదేవిగారి మనసు కోపంతో కుత కుత వుడికింది.

'కుర్ర కుంక.. నాకే యెదురు తిరుగుతావా రాస్కెల్....'

వికాస్ చెంపలు చెళ్ళుమన్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తున్న సరస్వతమ్మ గుండెలు జల్లుమన్నాయి. సరస్వతమ్మను కూడా తీవ్రంగా కేకలేశారు.

తనే దగ్గరుండి బలవంతంగా కారెక్కించి కాన్వెంటుకు పంపారామెగారు వికాస్‌ను. వికాస్ గురించి కాన్వెంటు ప్రిన్సిపాల్‌గారికి ఫోన్ చేశారామె.

ఆ తర్వాత తన బాధ్యత తీరినట్లు తృప్తిగా నిట్టూర్చి కిండర్‌గార్డన్ స్కూల్లో చిన్న పిల్లలకు 'సందేశాన్నందించటానికి కారెక్కారు.

సాయంకాలం

ఇంటికి వచ్చీ రాగానే వికాస్ మంచమెక్కాడు జ్వరంతో. శరీరం కాలిపోతున్న పెనంలాగా వేడిగా వుంది. కళ్ళు మూసుక పడుకున్నాడు.

సరస్వతమ్మ అయ్యగారికీ, అమ్మగారికీ ఫోన్ చేసింది.

'తాము రావటం ఆలస్యం కావచ్చు... డాక్టరుగారికి ఫోన్ చెయ్– ఫోనులో నుండి ఆయాకు ఆదేశం.

డాక్టరుగారు, నర్సు వచ్చారు. ఇంజక్షన్ యిచ్చి అరగంట కూర్చున్నారు. అయ్యగారుగాని రాలేదు. నర్సుకు వాడవలసిన మందుల గురించి వివరంగా చెప్పి అవసర మయితే తనకు ఫోన్ చెయ్యమని చెప్పి డాక్టరుగారు వెళ్లారు.

గంట తర్వాత వికాస్ కళ్ళు తెరిచాడు.

'ఆయా... మమ్మీ రాలేదా...' కంఠం నిండా ఆతురత.

'రాలే...దు...వస్తా...మన్నారుబాబు...గారు.'

వికాస్ కళ్ళు మూసుకున్నాడు. మూతలుపడ్డ ఆ రెప్పల వెనుక రాజేంద్ర, రాజేంద్ర తల్లి కదులుతున్నారు. తన తల్లి ఆందోళన గురించి, పరిచర్యల గురించి రాజేంద్ర నవ్వుతూ చెప్పిన విషయాలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

అర్ధరాత్రిదాకా మమ్మీ కోసం.. అరగంటకోసారి అడిగి... అడిగి .. నిరాశతో నిద్రపోయాడు. వికాస్ మనసు అసంతృప్తితో కాలిపోతోంది. డాక్టరుగారు శరీరం వేడి తగ్గించ గలిగారు కాని... మనసులోని మంటల నార్ప గలిగారా?

ఆ మనసుకు మందు మరోచల్లని మనసు మాత్రమే అందివ్వగలదు

మరి– ఆ 'మనసుకు' అలాటి సున్నిత విషయాలు అర్థం కావు. అర్థమయినా తీరిక వుండదు.

మరునాడు వుదయమే ఫోన్ చెప్పింది....

'అమ్మగారు రాత్రి జిల్లా పర్యటనకి వెళ్లారని... నాలుగు రోజులదాకా రారని'అయ్యగారు ఆ ముందురోజే బిజినెస్ కాన్ఫరెన్సుకి బొంబాయి వెళ్లారట.!

ఆ సంఘటనతో వికాస్ మనసు మరికోలుకోలేనంతగా గాయపడింది.

వారం రోజుల తర్వాత జ్వరం తగ్గింది. కానీ ఎవ్వరితోనూ మాట్లాడటం మానేశాడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న భావన.....

మరునాడు వుదయం డైనింగ్ టేబిల్ దగ్గర

'వికాస్‌కు మన సిటీలోని కాన్వెంట్ సూటయినట్లులేదు. మద్రాస్ పబ్లిక్‌స్కూల్లో చేర్పిద్దాం... మిరేమంటారు....' గాయిత్రీదేవిగారు అడిగారు.

'నో నే చేరను' వికాస లేచి వెళ్ళిపోయాడు నిరసనగా, కోపంగా

'కుర్ర వెధవ... వాడికేం తెలుసు...... స్కూల్ సీటు రిజర్వు చేశా... రేపే ప్రయాణం'

'నీ యిష్టం .. పిల్లల గురించి నీకంటే నాకు తెలుసా?–' భర్త జవాబు.

రెండు రోజుల తర్వాత వికాస తప్పనిసరిగామనసు చంపుకొని కన్నీళ్లతో కారెక్కాడు. మద్రాస్ పబ్లిక్ స్కూల్లో చేర్పించి, తృప్తిగా నిట్టూర్చారు గాయిత్రీదేవిగారు.

ఓ నెల తర్వాత

'వికాస్ సీరియస్ స్టార్ట్ యిమిడియట్లీ' మద్రాస్ పబ్లిక్ స్కూల్ నుండి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చింది. గాయిత్రీదేవిగారు, రమేష్‌చౌదరిగారు మద్రాసు చేరుకున్నారు.

వికాస్ హాస్పిటల్లో బెడ్‌మీద మగతలో వున్నాడు.

'ఏమయింది డాక్టర్'

డాక్టర్‌గారి ప్రక్కనున్న పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వివరించారు.

'వికాస్ ఎందుకో ఈ వాతావరణానికి అడ్జస్ట్ కాలేకపోయాడు. ఎప్పుడూ డల్‌గా వుండేవాడు. ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్‌తో బాధ పడుతుండేవాడు. మొన్న క్లాస్‌లో టీచరు పాఠం చెపుతున్నారు. అందులో ఓ బీద తల్లి తను ప్రాణాధికంగా ప్రేమించే తన కొడుకు... ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకున్నప్పుడు...వాడిని రక్షించుకో-టానికి మంటల్లోకి దూకుతుంది ఆ తల్లి. కొడుకును రక్షించ గలుగుతుంది కాని... ఆ మంటల్లో ఆమె చనిపోతుంది. అప్పుడు వికాస్ పిచ్చివానిలా లేచి... నో నో ఆ తల్లి చనిపోవటానికి వీల్లేదని 'కేకలేస్తూ స్పృహ తప్పి పడిపొయ్యాడు. ఇక్కడకు చేర్పించిం తర్వాత కూడా ఆ తల్లి గురించి, తల్లి ప్రేమ గురించి మధ్య మధ్య అర్ధం లేకుండా ఏవేవో మాట్లాడుతూనే వున్నాడు.....'

గాయిత్రీదేవిగారి కళ్ల వెంట కన్నీళ్ళు.

రమేష్‌చౌదరిగారు బలవంతంగా కన్నీళ్ళు ఆపు-కుంటున్నారు.

ఆ తల్లి చెక్కిళ్ల మీదుగా ధారాపాతంగా కారు-తున్న కన్నీళ్ళు యిన్నేళ్ళుగా మనసుకు పట్టిన మురికిని శుభ్రంగా కడిగివేస్తున్నాయి.

కన్నీటి కారు మబ్బులు కమ్మిన ఆమెగారి ముఖంలో యిపుడు ఆడ మనసు' కనబడుతోంది. వేగంగా ఆందోళనగా కొట్టుకుంటున్న ఆ గుండెల్లో 'తల్లి మనసు' రేకులు విచ్చుకుంటోంది. తను యిన్నేళ్ళుగా చేస్తున్న తప్పేమిటో యిపుడు స్పష్టంగాఅర్ధమవుతోంది.



'బాబూ' బావురుమన్నారు గాయిత్రీదేవిగారు. 'భగవాన్... నా బాబును బ్రతికించు తండ్రీ... డాక్టర్... నా కొడుకును బ్రతికించండి... ప్లీజ్.... ఏడుస్తూ 'తల్లి'గా బ్రతిమాలుతున్నారు.

జీవితంలో మొదటిసారిగా తన కన్న కడుపు కోసం కన్నీళ్ళు కారుస్తున్నారు గాయిత్రీదేవిగారు.

గంట గడిచింది.

వారిద్దరినీ కొన్ని యుగాలు గడిచిన అనుభూతి.

వికాస్ మెల్లిగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగుండా కన్నీళ్లతో, ఆందోళనతో మమ్మీ, డాడీలు.

వికాస్ మనసులో మాటల కందని తృప్తి.

మళ్ళీ అలసటా కళ్ళు మూసుకున్నాడు. మూసుకున్న ఆ కళ్ల వెనుక తన గది గోడకు వేలాడు-తున్న రంగు రంగుల క్యాలెండర్....

కానీ

ఆ క్యాలెండర్‌లో తన డాడీ వీపు మీద తను రాజాలా కూచున్నాడు.

మమ్మీ మెడను కావలించుకుని విరిత చిరు-నవ్వులు చిందిస్తోంది.

అలసిన ఆ చిన్నారి ముఖం మీద తరగని ఆనంద రేఖ. □

సీరియల్

శ్రావణి



మాదుగుల కృష్ణకుమారి

48

(గత సంచిక తరువాయి)

ఏమీ తెలియనట్లుగా "రండి, రండి అని సాదరంగా ఆహ్వానిస్తూ, శ్రావణి క్షేమంగా వుందికదా ?" అంది గొంతులో ఆదుర్దా కన్పరుస్తూ.

శ్రావణి లేదన్నట్లుగా తల వూపాడు కైలాష్.

"అయ్యో ! ఎంతపని జరిగింది. ఆరోజు మీరు స్వయంగా ఆవిడని తీసుకువెడితే ఇంత ఘోరం జరిగివుండేది కాదు." అంది ప్రమీల కూడా బాధను నటిస్తూ.

"అవును. నేను దుర్మార్గుడిని. నా భార్య చావుకు కారకుడిని. మాటలతో ఆమె మనసును గాయపర్చిన రాక్షసుడిని. అభిమానంకల ఆడది కాబట్టి, అనుమానితగా ఈ పాడు ప్రపంచంలో బ్రతకలేక జీవితం ముగించుకుంది. నాకు పిల్లలు కావాలన్న బలమయిన కోరికే ఆమె చావుకు కారణం అయ్యింది. నేనే ఆమె చావుకు కారకుణ్ణి"అని నుదుట పిడికిలితో బాదుకుంటూ అన్నాడు శ్రీహరి.

అతనికి అడ్డుపడుతూ "జరిగిందేదో జరిగింది కాసేపు ఆ విషయాలు గుర్తుతెచ్చుకోవటం మానెయ్యి. కాసేపు రిలాక్స్ అవు" అన్నాడు కైలాష్.

"ఎలా మర్చిపొమ్మంటావురా ? నాకు దూరమయిందని బాధపడుతున్నా, ఎక్కడో ఒకచోట క్షేమంగావుందనే శాంతి చెందానిన్నాళ్లు. కానీ ఇప్పుడీలోకంలోనే లేదనుకొంటే ఆ బాధ నాకు శాశ్వతం. బ్రతికున్నంతకాలం నాకీక్షోభ తప్పదు." అన్నాడు.

"అసలు పొరపాటు నాది. శ్రావణి గురించి నేనామాట అనకపోతే మీరు ఆ వూరు వెళ్ళేవాళ్ళు కాదు. ఆ విషయం తెలియటానికి, మీకీ బాధ కలగటానికి నేనే కారణం" అంది ప్రమీల.

"నీ తప్పేముందమ్మా తప్పంతా నాదే. ఇది స్వయంకృతాపరాధం. ఏనాడు కోపమంటే ఎరుగని నేను ఆరోజు కేవలం ఆ మాట వినగానే ఎందుకంత ఆవేశపడ్డానో నాకే ఆశ్చర్యంగా అన్పిస్తుంది. ఆ ఆవేశంలో శ్రావణి ఏంచెప్పిందో కూడా నా చెవులకు విన్పించలేదు. అప్పుడు నా మనసులో, వున్నది ఒట్టి ఆవేశం మాత్రమే."

"మనసుని బాధపర్చే విషయాలు కొన్ని తెలియకపోవటమే మంచిదేమో" అన్నాడు కైలాష్.

"లేదురా ! కొన్ని కొన్ని సందర్భాల్లో బాధను అనుభవించటంలోనే ఒక తృప్తి వుంటుంది. అదే నిజమయింది నాకిప్పుడు. బ్రతికున్నంతకాలం ఈ బాధను అనుభవించటంలోనే ఒక రకమైన మనశ్శాంతి కూడా" అన్నాడు పేలవంగా.

"మీ మాటలు వింటుంటే మీకు మీ భార్య మీద ఎంత ప్రేమో తెలుస్తోంది. కానీ ఆవిడ మాత్రం మీ ప్రేమను అర్థం చేసుకోకుండా అలా చేసిపోయింది. ప్రేమించే హృదయాన్ని అర్థంచేసుకోని శ్రావణి మూర్ఖురాలు. బ్రతికుండి మిమ్మల్ని బాధ పెట్టింది. పోయినాక కూడా ఆ బాధను మరింత పెంచింది. ఆవిడవల్ల మీకు మిగిలింది బాధే అయినప్పుడు, దాన్ని మీరు శాశ్వతంగా మర్చిపోవాలంటే, మీరు మరొక స్త్రీకి స్థానం ఇవ్వటం మంచిదేమో" అంది ప్రమీల.

"ప్రమీలగారు" అరిచాడు శ్రీహరి.

"నో ! నా శ్రావణిని మర్చిపోవటం అంటూ జరగదు. మరొక స్త్రీ ద్వారా ఆ స్థానం భర్తీ చేయటం అంతకన్నా జరగదు. అసలు నా భార్య, ఎక్కడికి వెళ్ళిందని. ఇక్కడే, ఇక్కడే ఈ గుండెల్లోనే పదిలంగా చోటుచేసుకుంది. ఆమెకాదుమూర్ఖురాలు, నేనే ఒక మూర్ఖుడను. మా సంసార జీవితంలో మొలకెత్తిన సమస్యకు పరిష్కారం ఏమిటో క్షణమయినా ఆలోచించక అర్థరహితంగా ప్రవర్తించాను. ఎంతో సంస్కారవంతుడని నా గురించి నాకే నమ్మకం వున్న నేను ఆ క్షణంలో కుసంస్కారిలా ప్రవర్తించాను. ఒక వృద్ధ దంపతుల కడుపుకోతకు కారకుడ్నై అయ్యాను. శ్రావణిని హత్యచేసిన పాపానికి నాకే శిక్ష వేసినా పాపంలేదు. నా భార్యని చంపిన హంతకుడిని" అని భోరున ఏడ్వసాగాడు.

"అయితే నీ భార్యంటే నీకు అంత ప్రేమన్నమాట" అన్నాడు కైలాష్.

"అవును ! మొదటిసారిగా నా ప్రేమాలయంలోకి అడుగుపెట్టిన తొలి దేవత శ్రావణి. భార్యగా ఆమెను ఎంతగానో ప్రేమించాను. ఇంకా ప్రేమిస్తున్నాను. శాశ్వతంగా నా గుండెల్లో గుడికట్టి ప్రేమపూజారిలా ప్రేమపూజ చేస్తూనే వుంటాను" అన్నాడు గద్గదంగా.

ఆ ఒక్కమాటతోనే శ్రీహరి మనసులో శ్రావణి మీది ప్రేమ అర్థమయింది భార్యా భర్తలిరువురికి.

"వెరీ గుడ్! మాకు కావల్సిందదే. భార్యగా ఆమెకే నీ గుండెల్లో ఎప్పుడూ చోటు వుండాలి. నీ ప్రేమను అందుకునే అర్హత ఆమెకు మాత్రమే వుంది. అసలు లోకంలో భర్తలందరూ భార్యలను ఎలా ప్రేమించాలో నీ దగ్గరే తెల్సుకోవాలిరా" అని నవ్వాడు కైలాష్.

"ప్రేమించే సహృదయం ఒక్కటే కాదు మనిషికి కావల్సింది. ఎదుటి మనిషిని అర్థం చేసుకునే సహృదయత కూడా దానికి తోడవాలి. అప్పుడే ఆ ప్రేమకు సార్థకత. ఆ మనిషికి విలువ పెరుగుతుంది. కానీ అందుకు భిన్నంగా ప్రవర్తించిన నిర్భాగ్యుడిని నేను. అందుకే నా ప్రేమను గుప్తంగా దాచుకుని నన్ను విడిచి మరొక లోకానికి పోయిన శ్రావణికి మనసు ద్వారానే అందిస్తున్నాను ప్రేమను" అన్నాడు.

"నువ్వింతగా ప్రేమించే నీ భార్య ఇప్పుడిక్కడ ప్రత్యక్షమయితే ఎలా వుంటుందో" అన్నాడు కైలాష్.

"పరిహాసాలొద్దు కైలాష్. మరొకలోకానికి

జరిగిన కథ—10 శ్రావణి తన పెళ్లికి ముందు జరిగిన సంఘటనలు చెప్తూ తనను తన బావ ఏ విధంగా అల్లరి పెట్టిందీ ప్రమీలతో చెప్పసాగింది. శ్రావణి చెప్పినదంతా విన్న ప్రమీల ఆమె జీవితం నాశనం కావడానికి కారణం ఆమె బావే అని గ్రహిస్తుంది. ఎలాగైనా ఆమె బ్రతుక్కొక దారి చూపాలని నిర్ణయించు కొంటుంది. కైలాష్ తన స్నేహితుడైన శ్రీహరి భార్యే తనింట్లో ఉన్న శ్రావణి అని తెలుసుకొంటాడు. శ్రీహరి భార్య స్మృతులతో అశాంతి పాలవుతాడు. శ్రావణి సమస్యను భార్య ప్రమీలతో కలసి పరిష్కరించాలనుకొంటాడు కైలాష్. శ్రావణికి వైద్యం చేసిన శతభిషావారి దగ్గరకు వెళుతాడు. అక్కడ శేషుని చూస్తాడు. కైలాష్ శేషుతో స్నేహం పెంచుకొంటాడు. తాగుడు మైకంలో తన రహస్యాలన్నీ కైలాష్‌కు చెప్పడం మొదలుపెడతాడు శేషు. శ్రావణి జీవితం నాశనం కావడానికి శేషే కారణం అని తెలుసు కొంటాడు కైలాష్. ప్రమీల, కైలాష్‌లు కలసి శ్రీహరి దగ్గరకు బయలుదేరుతారు. శ్రీహరి, కైలాష్‌లు శ్రావణి ఇంటికి వెళుతారు. శ్రావణి ఇల్లు వదిలి వెళ్లిపోయిందని తెలుసుకొని కృంగిపోయిన శ్రీహరిని తమ ఇంటికి తీసుకువస్తాడు కైలాష్. ఒక్క రోజులో పరిస్థితి అంతా చక్కబడుతుందని నిజం నిరూపిస్తానని శ్రావణితో చెబుతుంది ప్రమీల.

పోయిన నా భార్య ఇక్కడ ప్రత్యక్షమవటానికి ఇది కలా కాదు. కథా కాదు. నేనంత అదృష్ట వంతుడని అసలే కాదు.''

''ఆ సమయం రావటానికి ఎంతోసేపు లేదురా'' అనుకున్నాడు కైలాష్.

49

అప్పటివరకు ఉగ్గపెట్టుకుని వచ్చేఏడుపును ఆపుకుంటున్న శ్రావణి ఇంక ఆగలేకపోయింది. ఒక్కవుదుటన బయటకు రాబోయింది.

''ఆగాగు! ముహూర్తానికి ఇంకా టయిము వుంది. రావల్సినవాళ్ళున్నారు'' అంది ప్రమీల చెయ్యి అడ్డుపెట్టి నవ్వుతూ.

''నన్ను వదులక్కా. ఒక్కసారి ఆయన కాళ్ళమీద పడి తనివితీరా ఏడవనీ. ఇన్నాళ్ళు నా గుండెల్లో గూడుకట్టుకున్న దుఃఖపు పొరలు విడివడనీ'' అంది ఏడుస్తూనే.

''శ్రావణీ! ఇప్పటివరకు చక్కగా నడిచిన నాటకాన్ని క్లైమాక్స్‌లో చెడగొట్టకు. ఇన్ని రోజులు ఓపికపట్టావు. ఈ కొద్ది సేపూ ఆగలేవా.''

''ఎలా వుండగలను? తెలియనంతవరకు ఎన్ని సంవత్సరాలయినా వేచి వుండకలం. కానీ తెలిశాక ఒక్క సెకనుకూడా ఆగే శక్తి మనసుకు వుండదు. నా గురించి ఆయన పడే ఆవేదనా, ఆరాటం చూస్తుంటే నా మనసు నిలవటం లేదు. ఒకే ఒక్కసారి ఆయన కళ్ళముందు కనపడి మీరింతగా ప్రేమించే, ఆరాధించే శ్రావణి ఏ లోకాలకు పోలేదండి, కళంకితగా ఇక్కడే మిగిలివుంది అని ఒక్కమాట చెప్పేస్తాను. అంతకంటే నాకే ఆశా లేదు. ప్లీజ్ ఒక్కసారి వదులక్కా'' అంది దీనంగా.

''అబ్బో! నా నవలలన్నీ ఫెయిర్ రాసి నాకంటే ఘాటుగా డైలాగ్స్ వల్లిస్తున్నావే. ఈ కొద్దిసేపు నా బందీగా వున్నావంటే, ఇక జీవిత కాలమంతా మీ ఆయన కౌగిలిలో శాశ్వతంగా బందీ వయిపోదువుగానీ, ఇప్పుడు మాత్రం నా మాట కాదనకు.''

''పరిహాసాలకిది సమయంకాదు. నేను లేనన్న బాధ ఆయన మనసుని కార్చిచ్చులా దహించేస్తోంది. ''శ్రావణీ,'' అని ఆయన నా పేరు ఉచ్ఛరిస్తుంటే నా శరీర తంత్రులు ఒక్క ఉదుటన లేచి పడుతున్నాయి. ఆ మంటలు ఆయనను దహించకముందే నేనాయన కళ్ళ పడాలి'' అంది ఆవేశంగా.

ఆ పరిస్థితిలో తనేం చెప్పినా వినే పరిస్థితిలో లేదన్పించిన ప్రమీల—

''ఇప్పుడు నువ్వెళ్ళి ఆయన కాళ్ళమీద పడితే, నీ తప్పును మన్నించి నిన్ను ఏలుకుంటా డని నమ్మకం వుంటే వెళ్ళు. నాకే అభ్యంతరం లేదు.''

అంతే! మంత్రం వేసినదానిలా నిలబడి పోయింది శ్రావణి. అంతకు ముందున్న ఆవేశ మంతా మంచుముక్కలా కరిగిపోయింది.

నిజమే తనేదో ఆవేశంలో ఆయనముందుకు వెళ్ళాలని ఆతృతపడుతోంది కానీ, ఆయనంత తేలికగా తన తప్పుని మన్నిస్తారా? నిజంగా తనని అంత ప్రేమించే వ్యక్తే అయితే ఇంటినుంచి పంపాక భార్య బ్రతికుందో చచ్చిందో పట్టించుకున్నారా? ప్రమీలక్క అన్నతరువాత కదా ఆయనకు తను గుర్తు వచ్చింది, తనకోసం వూరు వెళ్ళింది. కేవలం తను బ్రతికుందో, లేదో అన్న అనుమానం రుజువు చేసుకోవటానికి తప్ప తనని తీసుకు వెళ్లటానికి మాత్రంకాదు. అటువంటపుడు ఏ ముఖంతో ఆయన ముందుకి వెడుతుంది. బ్రతికున్నానని చెపుతుంది? ఆయన దృష్టిలో నిందితగా బ్రతికున్న దానికంటే, చనిపోయినదానిగా సానుభూతి పొందటమే కొంత నయం. ఇన్నాళ్ళు ఒకే నిశ్చింత. కానీ ఇప్పుడు కళ్ళబడిన వ్యక్తిని చూస్తే మనసులో ఏదో అలజడి. ఎంత కాదు అనుకున్నా, ఆ కాదులోంచి అవును అనే ఆశ ఏదో మూలనుంచి నసపెడ్తూనేవుంది. త్రిశంకుస్వర్గంలా వుందామె మనసు. ఆ ఆలోచనలతోనే మనసూ, మనిషి కూడా అలిసిపోయింది.

50

ఆ రాత్రంతా ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

రాత్రంతా నిద్రలేక ఆలోచనలతో గడిపిన శ్రావణికి కూర్చున్న చోటు నుండి లేవలేక పోయింది.

గది ఒదిలి బయటకు వెడితే భర్త ఎదురు పడతాడేమో అన్న ఆందోళన. నిన్నటి వరకు కనిపిస్తే బాగుండునని కోరిక. కానీ ఈ రోజు ఎక్కడ కన్పిస్తాడోనని భయం. రెండూ మనసుకి సంబంధించినవే అయినా రెంటికి ఎంత తేడా! మోకాళ్ళమీద తల పెట్టుకుని చూస్తూ కూర్చుంది.



శ్రావణి

ఏవో పరిచయం అయిన గొంతుల్లాగా వినపడుతున్నాయి తన పిచ్చికానీ తనవాళ్ళు ఇక్కడికెందుకు వస్తారు?

ప్రమీల లోపలికి వస్తూనే ''శుభోదయం'' అంది నవ్వుతూ.

ఏడ్వలేక పేలవంగా నవ్వింది తను కూడా.

''ఒంట్లో బాగాలేదా ?'' అంది.

అనాలోచితంగా అవుననేసింది.

''అయితే ఈ కాఫీ త్రాగి హాయిగా పడుకో. నాకు చాలా పనుంది'' అంది హడావిడిగా వెళ్ళిపోతూ.

రోజూ ప్రమీలకన్నా ముందుగా లేచి, తనిలా గదిలో ఖైదీగా కూర్చోవటం ఏమాత్రం నచ్చలేదు శ్రావణికి.

51

''మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి'' అంది ప్రమీల.

''ఏ విషయం గు రి ం చి ?'' అన్నాడు శ్రీహరి.

''మీ భార్య గురించి.''

''ఇంకా చెప్పేందుకు ఏం మిగిలిందని'' అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

''శ్రావణి నిర్దోషి'' భార్యాభర్తలిరువురూ ఒకేసారి అన్నారు.

''మీకెలా తెల్సు ?'' అన్నాడు ప్రశ్నార్థకంగా.

''ఎలా తెలుసో ఈ టేపురికార్డర్ ఆన్ చేస్తాను. విను. అంతా నీకే తెలుస్తుంది'' అని భార్యవైపు చూశాడు కైలాష్.

మరొక అయిదు నిముషాల్లో శ్రావణి తల్లితండ్రులతోపాటు అక్క రాజ్యం కూడా లోపలికి వచ్చింది.

''వీళ్ళు'' అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

అంతా నీకే తెలుస్తుంది అని ప్లే బటన్ నొక్కాడు.

ఉగ్గపెట్టుకున్న శ్రోతలు ఏం వింటామా అని ఆత్రుతగా చూస్తున్నారు. ముందు మాటలు ఎవరు ఎవరితో మాట్లాడు తున్నారో అర్థం కాని శ్రీహరి ఆ గొంతులలో మొదటిది కైలాష్‌దిగా గుర్తించాడు. మరొకటి, మరొకటి ఎక్కడో, ఎప్పుడో విన్నట్లుగా వుంది. ఎవరా అని ఆలోచిస్తున్న అతనికి ఆ గొంతు శ్రావణి బావదని గుర్తుకు వచ్చింది.

తన మిత్రుడికి, అతనికి ఏమిటీ స్నేహం అనుకుంటుండగానే మళ్ళీ ఆ మాటలపై మనసు మళ్ళింది.

శేషు చెపుతున్న మాటలు ఒకొక్కటి వింటున్న శ్రీహరి ముఖంలో క్రమంగా రంగులు మారాయి. విని భరించలేనట్లుగా కళ్ళు మూసుకున్నాడు.

''నేను, శతభిషాచారి కల్సి శ్రావణిని వాడుకున్నాము''ని చెపుతున్న శేషు మాటలు వింటున్న శ్రీహరి రక్తనాళాలు పొంగినట్లయి, ముఖం ఎర్రపడి కైలాష్ ''ఆఫ్ ది టేప్'' అని బిగ్గరగా అరిచాడు.

ఒక నిప్పులాంటి నిజాన్ని తెల్సుకోవాలంటే ఎదురయ్యే వేడిని భరించాలన్నట్లుగా వెన్నుతట్టాడు కైలాష్.

గది కిటికీలోంచి చెవి ఒగ్గి వింటున్న శ్రావణి టేపు పూర్తిగా వినకుండానే నేలమీద కుప్పకూలిపోయింది.

శ్రావణి తల్లిదండ్రుల పరిస్థితి వర్ణనాతీతం.

రాజ్యం అయితే మరీనూ. ఆమె తల సిగ్గుతో వాలిపోయింది.

కోర్టులో న్యాయం జయించాలని సాక్ష్యం చెప్పిన వ్యక్తి నిబ్బరంగా ఊపిరి పీల్చుకున్నట్లుగా టేపు మొత్తం తిరిగి అలసిపోయినదానిలా ఆగిపోయింది.

చలనంలేని వాడిలా శ్రీహరి కళ్ళు కూడా తెరవలేదు.

ఎవ్వరూ నోరు మెదపలేదు. నిశ్శబ్దంగా వుండిపోయారు.

ముందుగా ప్రమీలే అంది. ''విన్నారా శాంతమ్మగారు మీ శ్రావణి జీవితం ఇలా పెడదారి పట్టటానికి కారణం మీ పెద్ద అల్లుడని.''

''ఇంటి అల్లుడుకదా అని నమ్మిన మాకు బాగా చేశాడు. వైద్యం పేరుతో ఇంత ఘాతుకం చేసే శతభిషాచారిని ఏం చేసినా పాపంలేదు. దుర్మార్గులిద్దరూ కలిసి నా కొంప కూల్చారు. ఆ శేషుగాడిట్లా 'జడుపు' పెట్టాడని ఒక్క

పురుషులకు ప్రసూతి శలవు!

పురుషులకు ప్రసూతి శలవు లేదని, లక్సెంబర్గ్‌లోని యూరోపా కోర్టు తీర్పు చెప్పింది. పశ్చిమ జర్మనీలోని ఒక వైద్య బీమా సంస్థ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పశ్చిమ జర్మనీ వారు కొందరు యూరోపా కోర్టుకు విన్నవించుకోవడంతో వివాదం ప్రారంభం అయింది. ప్రసూతి విషయంలో స్త్రీలతో పాటు పురుషులకు కూడా సమాన హక్కులు లభించాలని ఆయన వాదించాడు. కోర్టు వారు తీర్పు విస్తూ, పిల్ల సంరక్షణ కోసమే తల్లికి ప్రసూతి శలవు ఇవ్వడం జరుగుతున్నదని, ఆర్థిక ఇబ్బందుల వలన తల్లి తన ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటూ తిరిగి వెంటనే పనిలోకి పోకుండా నివారించడమే దీని ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పురుషులకు అటువంటి ప్రమాదమేమీ లేదు కనుక ఇది పురుషులకు వర్తించదని కోర్టువారు తీర్పు చెప్పారు.

(గ్లోబల్)

మాట మాతో చెప్పివుంటే అప్పుడే ఆ సంగతి తేల్చేవాళ్ళం. అన్యాయంగా వాళ్ళు చేసిన పాపానికి నువ్వు బలయిపోయావే'' అని ఏడుపు మొదలు పెట్టింది.


''సూచాయగా బయటి సంగతి తెల్సు కానీ స్వంత మరదలిని ఇలా చేస్తారని ఏనాడు అనుకోలేదు. ఏదో వేళాకోళంగా అంటున్నారని అనుకున్నా కానీ మనసులో ఇటువంటి దురుద్దేశం వుందని గ్రహించలేక పొయ్యాను. ఆ యన పశుత్వానికి నా చెల్లెలు బలయిపోయింది. తాళి కట్టిన భర్తయినాసరే చేసిన తప్పు తప్పే. నమ్మకంతో మా వాళ్ళందరిని వంచించారు. ఇలాటి వాడ్ని నా భర్తగా చెప్పుకోవాలన్నా నాకు సిగ్గే.

చూడండమ్మా, మీరెవరోకానీ ఎలా తెల్సుకున్నారో మాకీ సంగతులన్నీ తెలియచేసి మా కళ్ళు తెరిపించారు. తప్పు నా చెల్లెలు చెయ్యకపోయినా, కనీసం ఆ నీచుడికి (నా భర్తని నోటితో అనటానికికూడా అసహ్యంగా వుంది) వాడితో పాటు, మా వూరి వినాశకుడయిన ఆచారికి తగిన ప్రాయశ్చిత్తం జరిగేటట్లుగా చూడండి. నేను కోరుకునేదదే మిమ్మల్ని'' అంది కన్నీటితో చెయ్యెత్తి ప్రమీలకు నమస్కరిస్తూ రాజ్యం.

తడబడుతున్న అడుగులతో నడుస్తూ ఒణుకుతున్న గొంతుతో శ్రీహరి దగ్గరగా వెళ్ళి అతని రెండు చేతులు పట్టుకుని ''చూడు బాబు నేను అశక్తుడ్ని. ఈ పరిస్థితిలో ఆ దుష్టుల్ని ఏం చెయ్యలేను. ఒకనాడు నా కడుపున చెడ పుట్టిందని శ్రావణిని తిట్టాను. కానీ ఈ రోజు నా బిడ్డ మేలిమి బంగారమని తెల్సుకున్నాను. కానీ ఏం ప్రయోజనం, అది ఆలస్యంగా తెల్సుకున్నాను. చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లయింది నా పని. నా కూతుర్ని మంత్రాలతో మాయంచేసిన ఆ చీడపురుగుని, మా కుటుంబానికే, శని అయిన ఆ నీచుడ్ని అల్లుడన్న అర్హత పోగొట్టుకున్న ఆ మోసగాడ్ని ఏం చేస్తావో, ఎలా చేస్తావో నీకే ఒదిలేస్తున్నాను. నాకు తెల్సినంతవరకు నా కూతురు నిప్పు, అది తెల్సి తనకు తానుగా తప్పు చెయ్యలేదు. నీ కిష్టమైతే దాన్ని ఏలుకొమ్మనే అడిగే అవకాశం నాకెటూ లేదు. నా తల్లి శ్రావణి మేమేదో దాచిపెట్టి ఈ పెళ్ళి జరిపించామని మమ్మల్ని అపార్థం చేసుకుని వెళ్ళిపోయింది. మాకీ వయసులో శోకాన్ని మిగిల్చింది'' అని చిన్నపిల్లవాడిలా ఏడుస్తున్న ఆయన్నిచూస్తుంటే అందరి గుండెలు బరువెక్కాయి.

''శ్రావణి తప్పు చెయ్యలేదని తెల్సుకున్నావా ?'' అన్నాడు కైలాష్.

'తెల్సుకుని ఏం ప్రయోజనంరా. కళంకం ఆపాదించిన ఆమెకు క్షమార్పణ కోరుదామంటే ఆమె లేదు. జరిగింది తెలియక ఒకవైపు, నేను అవమానించి వదిలేశానన్న ఆత్మాభిమానం మరొకవైపు. ఈ రెండింటి మధ్యా ఆమె పడి



సూపర్ రిన్
చిమ్ముతూన్న మరింత తెల్లదనం
దీనికి సరిపడే డిటర్జంట్ బిళ్ళ మరొకటి లేదు.

సూపర్ రిన్ తెల్లదనం
మిరుమిట్లు గొల్పుతుంది:
దగ్గరగా వచ్చి చూడండిక.
ఆకర్షణీయమైన, కొత్త ర్యాపర్,
మరి దాంతోబాటే తాజాదనం
చిందే సరికొత్త సువాసన!



హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

LINTAS RIN 74 2315 TL

మనోవేదన తల్చుకుంటే, ఊహామాత్రంగానే భరించలేకుండావుంటే వాస్తవంగా ఆమె ఎంత వ్యథ చెందిందో. కైలాష్, నాకీ విషయం ముందుగా చెప్పివుంటె నా భార్య బ్రతికేదిరా'' అన్నాడు ఆవేశంగా.

''అప్పటికి నాకు మాత్రం ఏం తెల్సు'' అన్నాడు కైలాష్.

''నా శ్రావణి బ్రతుకునిలా మొగ్గలోనే వాడ్చేసిన ఆ దుష్టద్వయాన్ని చంపేవరకు నాకు శాంతిలేదు. వాళ్ళని నా చేతులతో చంపి ఆ రక్తంతో నా భార్యకి తర్పణం విడుస్తాను'' అన్నాడు కోపంతో.

''తొందరపడకు హరీ, వాళ్ళని పోలీసులకి పట్టిద్దాం.''

''వీల్లేదు! వాళ్లని నేనే చంపాలి. వాళ్ళ రక్తం కళ్ళచూస్తేకానీ నాకు నిద్రపట్టదు. చెప్పు ఎక్కడున్నారు వాళ్ళిద్దరూ'' అన్నాడు మరింత ఉద్రేకంతో.

''నువ్వేదో ఆవేశంలో అంటున్నావుకానీ, వాళ్ళని చంపితే నీ భార్య తిరిగి వస్తుందా? నీకన్నా వాళ్ళకి శిక్ష పడాలన్న కోరిక నాకే ఎక్కువగా వుంది. వాళ్ళ విషయం నా కొదిలెయ్యి. వాళ్ళ దుర్మార్గాన్ని బయటపెట్ట టానికి ప్రత్యక్ష సాక్షి ఇది వుండగా మనకేబాధ లేదని'' చిరునవ్వుతో చూశాడు టేపురికార్డర్ వైపు.

52

''చూడు బాబు నువ్వెవరివో, నీ పేరేమిటో కూడా మాకు తెలియదు. మాకు కూడా తెలియని ఇన్ని నిజాలు నీకెలా తెల్సినాయి?'' అన్నారు శ్రావణి తల్లితండ్రులు ఒకేసారిగా.

''అవును కైలాష్ మీకింత లోతుగా ఎలా తెల్సింది'' అన్నాడు శ్రీహరి కూడా ఆసక్తిగా.

''చాలా లేటుగా అడిగావురా'' అన్నాడు నవ్వుతూ కైలాష్.

సిగ్గుగా తల దించుకున్నాడు శ్రీహరి.

చెప్పమన్నట్లుగా ప్రమీల వైపు చూశాడు.

శ్రావణి

''నేను ట్రయిన్‌లో వస్తుంటే శ్రావణి రైల్లోంచి దూకేసింది'' అంది ప్రమీల.

''ఇంతమంది వుండి ఆఖరుకి రైల్లోంచి దూకి ప్రాణం తీసుకున్నావా? దూకేముందయినా అమ్మా నాన్నా గుర్తు రాలేదుటే, ఎంతపని చేశావే. ఒరేయి శేషుగా నమ్మించి ఇలా మా కొంప ముంచుతావా? నువ్వుకూడా నా కూతురి లాగే దిక్కుమాలిన చావుచస్తావురా. మా వుసురు నీకు తగలకపోదు.'' అని నోటికి వచ్చినట్లుగా తిట్టిపోస్తుంది తల్చుకుని తల్చుకుని శాంతమ్మ.

పాలిపోయిన ముఖంతో రాజ్యం ఎంత ఆపాలని ప్రయత్నిస్తున్నా ఆగటంలేదు సరికదా పైపెచ్చు మరింత రెచ్చిపోయి పిచ్చెక్కిన దానిలా తిట్టిపోస్తోంది.

పళ్ళబిగువున దుఃఖాన్ని ఆపుకోవటానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నాడు లక్ష్మయ్య.

సమ్మెట దెబ్బల్లా ఒక్కొక్క మాట వింటుంటే ఇంకా గుండె ఎందుకు ఆగిపోలేదా అన్పిస్తోంది శ్రీహరికి. పచ్చటి శ్రావణి శరీరం రక్తమయమయినట్లుగా ఊహిస్తేనే అతని గుండెలవిసిపోతున్నాయి. కడసారి చూపుకు కూడా నోచుకోని కఠినుడు తను. తన వల్లనే ఆమెకీ దుర్భరమైన మరణం.

''మరి శ్రావణి దూకబోతుంటే ప్రమీల చూస్తూ వూర్కొందా?''

అదే అడిగాడు దుఃఖపు జీరలు పొంగుకు వస్తుంటే.

''రక్షించి వుంటేమాత్రం ఆమెనిప్పుడు మీరు ఏలుకుంటారా, ఏమన్నానా?'' అంది ప్రమీల.

''చూడమ్మా ప్రమీలా! ఇప్పటికే నా మనసు గాయపడి పుండుగా తయారయింది. ఆ గాయాన్ని మరింత పొడవకు. ఇన్ని కష్టాలు ఎదుర్కొన్న నా భార్య బ్రతికివుంటే నాకింత బాధవుండేదికాదు. ఆమెతో గడిపిన రోజులే నాకు ఎదురు స్వప్నాలా మిగిలిపోయాయి'' అన్నాడు భారంగా.

పోటీ

ఒక్క
చెట్లే కాదు
శ్రమజీవి
చేతులూ
'కాయలు'
కాస్తాయి.

— మాధవరపు కృష్ణ

''అయితే శ్రావణి వుంటే మీరామెను ఏలుకోటానికి ఎట్టి అభ్యంతరం చెప్పేవారు కాదన్నమాట'' మళ్ళీ రెట్టించింది ప్రమీల.

''గాయపడిన మనసుని, మరింత గాయ పర్చటం మంచిపని కాదమ్మా. అమ్మాయి ఎటూ పోయింది. అతడి ప్రేమకు గుర్తు మరొకరిని పెళ్ళి చేసుకోకుండా వుండటమే. అంతకన్నా అతని మంచి మనసుకి తార్కాణమే ముంటుంది'' అన్నాడు లక్ష్మయ్య.

''నిజమే బాబాయిగారు, మీరిటువంటి సంస్కారిని, ఉత్తముడిని అల్లుడిగా పొందటం అది మీ అదృష్టం'' అంది.

''పద్దమ్మా అంతంత పెద్ద మాట ప్రయోగించకు. ఇప్పుడు మాత్రం నేనర్హుడిని'' అన్నాడు విచారంగా.


''అందరి మనసులు తెల్సుకున్నాను. ఇక వినండి. ఆ రోజు రాత్రి శ్రావణి కంపార్ట్‌మెంటు లోనే నేనుకూడా ఎక్కటం దైవికంగా జరిగింది. ఒక్క క్షణం ఆలస్యం చేస్తే ఆమె నిజంగా మన కందరికి దూరమయిపోయేది. కానీ ఆమెను రక్షించాను. ఎంతో కష్టంమ్మీద నా ఇంటికి చేర్చాను. ఇప్పటివరకు ఆమెపై మీ అభిప్రాయం తెల్సుకోవాలనే మీ మనసుకి కొంత కష్టం కల్గించాను. నన్ను క్షమించండి'' అని ప్రమీల ఏదో చెపుతుండగానే అదేం విన్పించుకోకుండా


''మా శ్రావణి బ్రతికే వుందా? ఎక్కడుంది? ఒక్కసారి నా బిడ్డను నాకు చూపించమ్మా'' అని ఆనందాశ్రువులను సైతం తుడుచుకోకుండా ప్రమీలను రెండు చేతులతో పట్టుకుని అర్థిస్తున్నట్లుగా అడిగింది శాంతమ్మ దీనంగా.

''శ్రావణి, నిజంగా?''అన్నాడు ఆనందంతో మాట పూడుకుపోయిన శ్రీహరి.

అందరూ శ్రావణివున్న గదిలోకి నెళ్ళారు.

(ఇంకా వుంది)





శక్తి ఆరాధన

పరాశక్తి అంశ

శక్తిపూజ అనాగరికమని, అపరిణిత సంస్కారానికి చిహ్నమని ఇటీవల కొందరు భావిస్తున్నారు. ఈ ఆరాధనలో ఒక భాగంగా జంతుబలి, నరబలి వంటివి కొనసాగడాన్ని ఎంతో మంది వ్యతిరేకిస్తున్నారు. లైంగికపరమైన మానవ బలహీనతలను రెచ్చగొట్టే విధంగా యోనిపూజ, అంగపూజ వంటి తాంత్రిక వ్యవహారాల పట్ల జాతి క్షేమాన్ని ఆశించేవారు విముఖత చూపుతున్నారు క్షుద్రోపాసనను చాలమంది విమర్శిస్తున్నారు. స్పష్టంగా చెప్పాలంటే దేవీపూజ పట్ల ఎక్కువ మందికి సరియైన అవగాహన లేదని చెప్పవలసి వస్తుంది.

పరాశక్తి, పరమాత్మ ఒకటే అని పరమావధూత భావన ఇంకో రకంగా చెప్పాలంటే మాతృ స్వామిక వ్యవస్థకు పరాశక్తి మూలమైతే, పితృస్వామిక వ్యవస్థకు పరమాత్మ మూలమని భావించవచ్చు. వాగ్దేవి దేవీ సూక్తానికి విరాట్ స్వరూపమైతే, పరమ పురుషుడు వేదాలకు జీవం పోస్తున్నాడు. దేవీ సూక్తసారము, చతుర్వేదాల తాత్పర్యము అంతా ఒకటే! "యాదేవి సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా" అని జగద్ధాత్రిని గురించి చెబితే, "సర్వభూతస్థమేకం నారాయణమ్" అని "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని వేద పురుషుని గురించి చెబుతారు. ముముక్షువులు, అవధూతలు అన్నింటా అన్ని వేళలా దివ్యశక్తిని చూడగలరు భౌతికశక్తో, మానసిక శక్తో ఆధ్యాత్మిక శక్తో – ఏదో ఒక శక్తి విశ్వమంతటా ఉందన్న విషయంలో ఎవరికీ ఎట్టి అనుమానము ఉండదు. ఈ మహాశక్తి పనితనాన్ని గుర్తించి ఆరాధించడం సంస్కారమే అవుతుంది కాని అనాగరికం కాదు కదా!

జంతుబలి, నరబలి ప్రస్తావనలు వేదాలలో ఉన్నట్లు స్పష్టంగాలేదు. వైదిక, తాంత్రిక పద్ధతుల సమ్మిళితమైన దేవీ సూక్తంలో ఈ విషయ పరంగా ఏకాభిప్రాయం లేదు కొన్ని రకాల అంటు వ్యాధులను వ్యాపింపజేసే జంతువులను ఈ విధంగా హతం చేయడం శాస్త్రీయమేనని కొందరంటారు. భూతదయను దృష్టిలో పెట్టుకొని చూస్తే ఈభావన సరియైంది కాదనిపిస్తుంది. జంతువులను, అపాయకరమని భావించే పక్షంలో, దూరంగా వెలివేయడం సముచితం కాని, బలిపెట్టడం మాత్రం అసందర్భమే! నరబలి విషయంలో శాస్త్రీయమైన వివరణలేదు ఇది అనాగరిక మూర్ఖత్వానికి ప్రతీక. దీనిని గర్హించవలసిందే కాబట్టి ఒక విషయం విదితమవుతుంది. శక్తి పూజకు ఈ బలులకు ప్రత్యక్షమైన సంబంధమేమీ లేదన్న సంగతి గుర్తించవలసి వస్తుంది. ఆ విధంగా ఆలోచించి బలుల ప్రస్తావన పరిహరిస్తే శక్తి ఆరాధన మన సంస్కృతిని ఉద్దీపింపజేసే సత్సంప్రదాయమే కాని వేరొండుకాదని తెలియవస్తుంది

ఇకపోతే జననేంద్రియారాధన శక్తిపూజ క్రిందకే వస్తుందా అన్నది ఆలోచించవలసిన అంశం. సాధన ద్వారా శాక్త దర్శనం లభ్యం కాగలదని ప్రామాణిక తాంత్రికతత్వం ఉద్బోధిస్తుంది అయితే మర్మాంగాల పూజ విధానం తంత్ర శాస్త్రాలే తెలియజేస్తున్నాయన్న విషయం అస్పష్టం. బలహీనతలకు లొంగిపోయి తాంత్రిక తత్వాన్ని కొన్ని దుష్టశక్తులు పలుచన చేసాయని కొందరు చెబుతారు. ఈ సంగతి సత్యమేననిపిస్తుంది స్వార్థం, స్వప్రయోజనం పరమావధిగల కొన్ని కూటాలు ప్రమాణ తాంత్రిక గ్రంథాలను మలినపరచి, మన సంస్కృతికి కళంకాన్ని తెచ్చే క్షుద్ర ఆరాధనా వైనాలను రంగంలోకి తీసుకొని వచ్చినట్లు సందేహం లేకుండా తెలుస్తుంది ఇటువంటి పరిస్థితిలో శక్తిపూజ న్యూనమని, హేయమని భావించడం సబబేనా అన్నది ఎవరికి వారే తీర్మానించుకోవాలి

క్షుద్ర ఉపాసనను మన పూర్వీకులు మొదటినుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు పూనకాలు పట్టడం, దేవతలు ఒంటిమీదికి రావడంవంటి చేష్టలు అపరిణితికి, పార్శ్వ దృష్టికి కాలమానాలనే అర్థం భగవద్గీతలో కానవస్తుంది అవగాహన లోపించడం వల్లే మహా శక్తిని మరచి, ఇలా క్షుద్రంగా ఉపాసించడం జరుగుతున్నదని గ్రహించవచ్చును ఈ ఆచారాలు మన సంస్కృతిని హీనపరచేవే అని తెలిసినా, తరతరాలుగా నాటుకొనిపోయిన చాందసభావం మనవాళ్లని ఆలోచింప జేయడంలేదు అసలు శక్తిని కూడ ఆరాధించవలసిన అవసరమేమిటని హేతువాదులు నిగ్గదీస్తారు అవసరం ఉందని అవధూత జ్ఞానమున్నవాడు చెప్పడు. మహాశక్తి ఉనికిని గుర్తించిన వాడికి ఆరాధనతో నిమిత్తంలేదు. అనుక్షణం దాని ధ్యాసతోనె మునిగిపోయిన వానికి ఎవరూ ఏమి ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. ఇకపోతే అందరికీ ఆ జ్ఞానం ఉంటుందా అనేది ప్రశ్న. ఎందుకుండదు అనేది చర్చ. వీటిని గురించి ఆలోచిస్తే శక్తి ఆరాధనలోని ఔచిత్యం తెలియవస్తుంది.

అర్థరహితమైన కొన్ని అనాచారాలు, దురాచారాలు సంస్కృతిలో కలిసిపోయి వికృతిని సృష్టిస్తే ఆ తప్పు సంస్కృతిది కాదు సంస్కృతి అంటూ దాన్ని వికృత పరుస్తున్న స్వార్థపరులది. ఈ విషయాన్ని గమనించక ప్రతిదానికీ మన సంస్కృతిని తప్పుబడితే నష్టం మనకే అదే విధంగా మన సంస్కృతే గొప్పదని భ్రమపడితే ఆ తప్పు కూడ మనదే ఇలా ఆలోచిస్తే శక్తి ఆరాధన అనాగరికమని అనిపించదని నా నమ్మకం! □

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

రేపటి కల

విన్నకోట సుశీలాదేవి

సాయంత్రం అయిదు గంటల సమయం! ఆఫీసులు, కాలేజీలు వదలడం వలన రోడ్లన్నీ జనంతో సందడిగా వున్నాయి

పాండురంగ బస్సు స్టాపు దగ్గర నిలబడి వున్నాడు! అతడి దృష్టంతా అక్కడ ఏర్పడిన పెద్ద క్యూ మీద, రాబోయే బస్సు మీద వుంది! బస్సు రాగానే ఇంత 'క్యూ' చెదిరిపోతుంది! తోపులాటలు – గుద్దులాటలు ప్రారంభ మవుతాయి ఆ గొడవలో తన పని పూర్తి చేసుకోవచ్చు' అనుకున్నాడు!

కానీ ఆ ఆలోచన వచ్చిన మరుక్షణమే అతని మనస్సు గజ గజా వణికి పోయింది! నిజంగా తను ఆ పని చెయ్యగలడా? అనుకుంటూ పాండురంగ చిన్నగా నిట్టూర్చాడు.

తను ఇటువంటి స్థితికి దిగజారతాడని కలలో కూడా అనుకోలేదు తను ఎంతో పెద్ద వుద్యోగం చేసి మరెంతో గొప్పవాడవుతాడనుకున్నాడు!

తన రిజల్టు వచ్చిన రోజున – పేపరు పుచ్చుకుని వుత్సాహంగా ఇంట్లోకి పరిగెట్టుకు వచ్చాడు

"అమ్మా! నేను బి. ఎ ఫస్టు క్లాసులో పాసయ్యాను" అని చెప్పాడు గర్వంగా

అమ్మ తనని దగ్గరకు తీసుకుని – "నాకు తెలుసురా రంగడూ! నువ్వు పాసవుతావని ఆ పాండు రంగడు నీ కెప్పుడూ అన్యాయం చెయ్యడు! అంతా ఆ దేవుని దయ!" అంది ఆనందంగా

"అదేమిటమ్మా! కష్టపడి చదివాను! పాసయ్యాను! మధ్యలో ఆ దేవుడేం చేశాడు!"

"అలా అనకురా తండ్రీ! నేను ఆ పాండు రంగడి దర్శించి వచ్చాక నువ్వు పుట్టావురా! అందుకే నీ కా పేరు పెట్టుకున్నాను ఆ పాండు రంగడే నిన్ను గొప్పవాడిని చేస్తాడురా"

అమ్మ పిచ్చి నమ్మకానికి తను నవ్వుకున్నాడు

బి ఎ పాసయ్యానన్న ఆనందం తనకి ఒక్క సంవత్సరం కంటె ఎక్కువ నిలవలేదు ఉద్యోగ ప్రయత్నంలో తగిలిన ఎదురు దెబ్బలు తన గర్వాన్ని అణిచాయి తన ఆనందాన్ని హరించాయి!

రోజులు నిస్సారంగా గడుస్తున్నాయి తన తర్వాతి పిల్లలు ఎదుగుతున్నారు అవసరాలు ఎక్కువవుతున్నాయి నాన్న నాన్న సంపాదన సరిపోవడం లేదు తను పొందబోయే వుద్యోగం మీద ఆయనకి ఆశ ఆ ఆశ ఆకాశంలో చుక్కలా మెరిపిస్తోంది. ఇక తనకు వుద్యోగం దొరకదేమోనన్న దిగులు పర్వత శిఖరంలా పెరిగి పోతోంది!


"దిగులు పడకురా తండ్రీ! ఆ పాండు రంగడే నీకు ఆఫీసరు వుద్యోగం వచ్చేలా చేస్తాడు. అప్పుడిక మన కష్టాలన్నీ తీరతాయిరా!" అంటూ ఓదార్చేది!

తను విషాదంగా నవ్వుకునేవాడు.

"అమ్మా! నీ నమ్మకం ఫలించి నాకు మంచి వుద్యోగం వస్తే నీ కోరికలన్నీ తీరుస్తానమ్మా!" అనుకున్నాడు

అయితే ... తనకు వుద్యోగం రాలేదు! అమ్మ కోరికలు తీరలేదు! కానీ ..అమ్మకు పెద్ద జబ్బు చేసింది! ఇంట్లో బియ్యానికే డబ్బుల్లేకపోతే ఇక మందు లెక్కడనుండి వస్తాయి?

అమ్మ మంచానికి అంటుకుపోయింది! అస్తి పంజరంలా వున్న అమ్మని చూస్తోంటే తనకు దుఃఖం ముంచుకు వచ్చేది ! అమ్మ మంచం వెనకాలనున్న పాండురంగడి పటాన్ని 'సిగా తిట్టేవాడు



"దేవుడూ! నీకు దయ లేదు చలిని, అనారోగ్యాన్ని లెక్క చెయ్యకుండా తెల్లవారు జామునే లేచి అమ్మ చన్నీళ్ళ స్నానం చేసేది గంటలు గంటలు నీకు పూజ చేసేది. నీకు నైవేద్యం పెట్టకుండా అన్నం తినేది కాదు నీ పేరు చెప్పుకుని ఉపవాసాలు వుంది! నువ్వేదో ఉద్ధరిస్తావనే భ్రమలో వుంది. అటువంటి అమ్మకు మంచి బహుమానం ఇచ్చావు. నువ్వు చాలా గొప్పవాడివి."

ఎవరెంత బాధ పడినా – ఏడ్చినా – అమ్మ అనారోగ్యం మాత్రం రోజు రోజుకీ ఎక్కువయిపోతోంది.

ఈ రోజు కూడా తను నిద్ర లేవగానే అమ్మ దగ్గరికి వెళ్ళి మెల్లగా పిలిచాడు. కానీ అమ్మ కళ్ళు తెరవలేదు!

తనకు భయం వేసింది!

"నాన్నా!" అని అరిచాడు!

ఇంట్లో అందరూ పరిగెట్టుకు వచ్చి అమ్మ మంచం చుట్టూ చేరారు. అమ్మ తీరు తనకు భయాన్ని కలిగించింది. తను ప్రక్క వీధిలో వున్న డాక్టరు దగ్గర కెళ్ళి ఆయన కాళ్ళమీద పడి బ్రతిమిమలాడి తీసుకొచ్చాడు.

ఆయన అమ్మని పరీక్షించి మందులు వ్రాసిచ్చాడు "ఈ ఇంజక్షన్లు తక్షణం కొనండి! గంట కొకటి ఇవ్వాలి!"

"ఎంతవు దంటారు" నాన్న మెల్లగా అడిగాడు.

"వంద రూపాయ లుండొచ్చు."

"వందా!" కళ్ళు తేలేశారు నాన్న.

"రాత్రిలోపు కనీసం ఒక్క ఇంజక్షనన్నా ఇవ్వాలి! లేకపోతే ప్రమాదం!" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

ఆ చివరి మాట తన గుండెలో డైనమైటుని పేల్చింది!

రాత్రి లోపు కనీసం ఒక్క ఇంజక్షనయినా ఇవ్వాలి. లేకపోతే ప్రమాదం – అంటే అమ్మ తనకిక దక్కదేమో!" తను నిలువునా వణికి పోయాడు కళ్లల్లో నీళ్ళు తిరిగి చెంపల మీదికి జారాయి

'అమ్మ' ఆ రెండక్షరాలు నింపుకున్న అపురూపమైన మాధుర్యం, అనురాగం తనిక కోల్పోతాడా!

"నాయనా! పాండురంగడూ" అంటూ తన నెవరు పిలుస్తారు?

"దిగులు పడకురా తండ్రీ! నువ్వు గొప్ప వాడి వవుతావు నీకు ఆఫీసరు వుద్యోగం వస్తుంది!" అని ఇక తనని ఎవరు ఓదారుస్తారు?

"నాయనా! అన్నం సరిగ్గా తినడం లేదే!" అంటూ తన వంతు కూడా పెట్టి కడుపు మాడ్చుకునే అమ్మ..

"బాబూ! ఇవి అమ్మి ఆ డబ్బుతో పరీక్ష ఫీజు కట్టరా" అంటూ తన మెడలో పసుపు కొమ్ము కట్టుకున్న అమ్మ .

ఇక కనబడదా అ అమృత హృదయిని ప్రేమ స్వరూపిణి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోతుందా! అలా జరక్కూడదు అమ్మని బ్రతికించుకోవాలి! తన ప్రాణా లిచ్చి అయినా బ్రతికించుకోవాలి"

"నాన్నా! ఎలా!" అనడిగాడు తండ్రిని

"డబ్బు కోసం ప్రయత్నిద్దాం రా!"

ఆ క్షణం నుండీ ఇద్దరూ ప్రయత్నిస్తూనే వున్నారు! కానీ దొరకలేదు సూర్యుడు పశ్చిమాద్రి వేపు వేగంగా వెళ్ళిపోతున్నాడు


డాక్టరు చెపిన విషయం క్షణం క్షణం మనసులో మెదిలి భయపెడుతోంది"

"అమ్మా! నవ మాసాలు మోసి నన్ను కన్నావు ఎన్నో కష్ట నిష్ఠూరాల కోర్చి పెంచి పెద్ద చేశావు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నావు! కానీ అమ్మా! నీకు జబ్బు చేస్తే కనీసం మందిప్పించుకోలేని స్థితిలో వున్నాను నేనేం చెయ్యను!"

మూగగా రోదించింది తన మనసు ఆ తర్వాత తన స్నేహితుల నందరినీ అడిగాడు డబ్బు లేదన్నారు చివరికి తన రక్తాన్నయినా అమ్ముకోడానికి సిద్ధపడ్డాడు! దానికీ పనికి రావన్నారు

ఇక . ఆలోచించి చివరికీ నిర్ణయానికి వచ్చాడు! ఇది తప్ప తన కిక వేరే అవకాశం లేదని తెలుసుకుని ఆపని కోసం బస్సు స్టాపు సరయిన ప్రదేశమనుకుని వచ్చాడు!

కానీ ఇంకా బస్సు రాలేదు!



న్స్యా'పెయగుతోంది

బస్సు వచ్చినా తనా ధైర్యం చెయ్యగలడా! మనసులో ఏదో బెరుకు – భయం కలిగాయి

కానీ అంతలో – మంచంలో పడుకున్న తల్లి కళ్ల ముందు కదలాడింది డాక్టరు చెప్పిన మాటలు చెవిలో గింగురుమున్నాయి బెరుకు – భయం పోయాయి.

ఆ స్థానంలో ధైర్యం పట్టుదల నిలిచాయి ఇప్పుడు అతని దృష్టంతా దూరాన వస్తున్న బస్సుమీదే వుంది!

* * *

బస్సు వచ్చింది

దాన్ని చూడగానే 'క్యూ' చెదిరిపోయింది బలాబలాల ప్రదర్శన మొదలయింది

ఆ సందట్లో – హడావుడిలో పాండురంగ ఆ గుంపులో ప్రవేశించాడు గుండె దడ దడ లాడుతుండగా – శరీరం గజ గజలాడుతుండగా ఒక లాల్చీ జేబులో చెయ్యి పెట్టాడు! చేతి కందిన పర్సుతో బయటికి వచ్చాడు పాండురంగ!

పర్సు జేబులో పెట్టుకోబోతుండగా "ఎవడో దొంగ నా జేబు కొట్టేశాడు!" అన్న కేక విన్పించింది

పాండు రంగకి గుండె ఝల్లుమంది

జేబులో వున్న పర్సుని గట్టిగా పట్టుకుని అక్కడ నుండి బాణంలా పరిగెట్ట సాగాడు

"అడుగో దొంగ! పట్టుకోండి!" వెనక కేకలు విన్పించాయి

పాండ రంగ కార్లని, మనుషుల్ని తప్పించుకుంటూ –సందులు గొందులు దాటుకుంటూ పరిగెడుతున్నాడు చివరికి ఆయాసంతో కాళ్ళల్లో సత్తువ పోగా రోడ్డు ప్రక్క నిలబడి చుట్టూ చూశాడు. అంతా నిర్మానుష్యంగా వుంది

'తను వూరి బయటికి వచ్చేసినట్లున్నాడు.' అనుకున్నాడు పాండు రంగ

తన నెవరూ వెంటాడటం లేదన్న విషయం రూఢి పరుచుకుని ఒక చెట్టు క్రింద కూర్చుని అలసట తీర్చుకోసాగాడు! పది నిముషాలు గడిచాయి

జేబులో వున్న పర్సు తీసి చూశాడు. మూడు సరి కొత్త వంద నోట్లు తళ తళ మెరిశాయి.

రేపటి కల

పాండు రంగ మనస్సు ఆనందంతో నిండిపోయింది. "ఈ డబ్బుతో తన తల్లిని బ్రతికించుకోవచ్చు!" అనుకున్నాడు తృప్తిగా!

నెమ్మదిగా అక్కడనుండి లేచి ఊళ్ళోకి నడక సాగించాడు!

'ఇక్కడ నుండి ఇంటికి చేరేసరికి చాలా సేపు పడుతుంది! టాక్సీ కానీ దొరికితే బాగుణ్ణు!' అనుకుంటూ చుట్టూ చూశాడు.

కానీ రోడ్డు మీద రిక్షా కూడా లేదు. "ఇక నడక తప్పదు!" అనుకుని గబ గబా నడవ సాగాడు!

అలవాటు లేని నడకలో కాళ్ళు వణికిపోతున్నాయి అసలే ఆకలితో కృశించిన శరీరం – ఈ శ్రమకి మరీ నీరసించి పోతోంది! ఆయాసం – దాహం నిలువునా వూపేస్తున్నాయి కానీ ఆ డబ్బులో ఒక్క పైసా కూడా అనవసరంగా ఖర్చు పెట్టడం అతని కిష్టం లేదు. 'ఆ డబ్బులోని ప్రతి పైసా తల్లికే వుపయోగ పడాలి' అనుకుంటూ నడక మాని పరిగెట్టడం మొదలెట్టాడు.

పావు గంట తర్వాత ఒక మెడికల్ షాపు ముందు ఆగాడు. రొప్పుతూ జేబులో నుండి డాక్టరు వ్రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ కాగితం పైకి తీశాడు అది చెమటకు తడిసిపోయి వుంది!

దాన్ని సాపు చేసి కొట్టు యజమాని ముందు పెట్టాడు!

ఆ మందులు తీసిచ్చాడతను. పాండు రంగ పర్సులో నుండి కొత్త వంద రూపాయల నోటు అతనికిచ్చాడు

అతడు పాండు రంగ వేపు చూశాడు మాసిపోయి దుమ్ము కొట్టుకుపోయిన బట్టలతో – శుష్కించి నీరసించిన శరీరంతో పిచ్చుక గూడులా వున్న జుట్టుతో చెమటలు కక్కుతూ బిచ్చగాడిలా వున్న ఇతని దగ్గర సరి కొత్త వంద రూపాయల నోటా? నోటునీ – పాండు రంగనీ మార్చి మార్చి చూశాడు!

'కొంప దీసి ఇది దొంగ నోటు కాదు కదా' అనే అనుమానం అతనిలో తలెత్తి క్షణంలో బలపడింది!

"చిల్లర తెప్పిస్తాను కూర్చో" అని పాండు రంగతో చెప్పాడు ఆ తర్వాత షాపులోని కుర్రాడిని పిలిచి – అతడి చెవిలో ఏదో చెప్పాడు! కుర్రాడు బయటికి పరిగెట్టాడు

పది నిముషాల తర్వాత ఇద్దరు పోలీసులు పాండు రంగ ముందు ప్రత్యక్షమయ్యారు

"నువ్వేనా ఆ వ్యక్తివి" అనడిగారు పాండు రంగని

పాండు రంగ తెల్లబోయాడు! "ఏ వ్యక్తి!" అన్నాడు.

"దొంగ నోటు తీసుకొచ్చింది"

"దొంగ నోటా!" విస్తుపోతూ అన్నాడు పాండ రంగ!

"నువ్వు దొంగ నోటు తెచ్చావని ఇతడు ఫిర్యాదు చేశాడు. నువ్వు చెప్పేదేవన్నా వుంటే స్టేషన్లో చెప్పుకో! పద!"

పాండు రంగ భయంతో వణికి పోయాడు

"అన్నట్లు నీకెలా వచ్చాయంటే ఏం చెప్పాలి?" అనుకుంటూ వాళ్ళ వెంట నడిచాడు.

పోలీస్ స్టేషన్ చేరుకునే సరికి గడియారం ఎనిమిది గంటలు కొట్టింది పాండు రంగ వులిక్కి పడ్డాడు! అప్పుడే ఎనిమి దయింది! వీలైనంత త్వరలో ఇంటికి వెళ్ళి తల్లికి ఇంజక్షనిప్పించాలి! లేకపోతే తను తల్లి లేని అనాథ అవుతాడు' అనుకున్నాడు బాధగా!

కానీ ఎలా వెళ్ళేది?

"ఎస్. ఐ. గారు వచ్చేవరకూ అలాకూర్చో" అంటూ ఒక మూలకి తోశారు పోలీసులు!

దేవుడికోసం తపస్సు చేసే భక్తుడిలా సబ్ ఇన్స్పెక్టర్ కోసం క్షణ మొక యుగంలా గడుపుతూ కూర్చున్నాడు పాండు రంగ!

* * *

రాత్రి పది గంటల సమయం!


పాండ రంగ రోడ్డు మీద చక చకా నడుస్తున్నాడు! పైన చంద్రుడు సంతోషంతో వొంగి వోతున్న మనిషిలా పక పకా నవ్వుతున్నాడు పాండు రంగ చంద్రుడి వైపు చూస్తూ" ఈ మనుషుల్లో ఇంకా జాలి, దయా – కరుణా వున్నాయి. ఇనస్పెక్టరులాటి వ్యక్తులు వుండబట్టే ఈ లోకం ఇంకా ఇలా నిలిచి వుంది" తను చేసిన నేరం ఒప్పుకుని తన తల్లిని గురించి చెప్పాడు. "బాబూ! నా తల్లి కూడా చిన్నప్పుడు ఇలాగే మందు లేక చనిపోయింది! త్వరగా వెళ్ళి నీ తల్లిని రక్షించుకో" అని చెప్పి వదిలాడు.

అతడెంత మంచివాడు!

పాండు రంగ వుత్సాహంతో గబ గబా నడిచాడు అతడు ఇల్లు చేరేసరికి పదిన్న రయింది.

ఇంట్లో ఇంకా లైట్లు వెలుగుతున్నాయి! ఏం జరిగిందో!" అనుకుంటూ మెట్లెక్కి లోపలకు వెళ్ళాడు పాండు రంగ!

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి వినాయకచవితి సాంస్కృతిక ఉత్సవాలలో డాక్టర్ వాసు శిష్యులు ప్రదర్శించిన హిప్నాటిజం వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా వచ్చిన శ్రీ కందర్ప రామచంద్రరావు, శ్రీనివాస మూర్తి, శ్రీ వాకాటి పాండు రంగారావు, శ్రీ పి వేణుగోపాలరెడ్డి, లేడీ హిప్నటిస్టు కుమారి ఉష, హిప్నటిస్టు డాక్టర్ పి ఎస్ రెడ్డిగార్లని చిత్రంలో చూడవచ్చు



హాల్లో తండ్రి – అతని ప్రక్క ఇంకెవరో వ్యక్తి కనిపించారు.

"ఏరా! ఇంత సేపూ ఎక్కడున్నావ్!" తండ్రి అడిగాడు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "అమ్మకి ఎలా వుంది?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఇప్పటికి రెండు ఇంజక్షన్లు ఇప్పించాను!" ఇక ఫర్వాలేదు" అన్నాడాయన.

పాండు రంగ ముఖం వెలిగి పోయింది.

"నిజంగానా!" అన్నాడు ఆనందంగా.

"ఆవున్రా! ఈయన చలపతిరావు అని నా చిన్ననాటి స్నేహితుడు. ప్రొద్దున డబ్బు కోసం ఇతడిని అడిగాను. నా పరిస్థితికి జాలి పడి ఇంట్లో వస్తువు తాకట్టు పెట్టి డబ్బు తీసుకొస్తున్నాట్ట. బస్సు ఎక్కేటప్పుడు ఏ వెధవో కొట్టేశాట్ట!"

గతుక్కుమన్నాడు పాండు రంగ.

"ఎక్కడ కొట్టేశారు?"

చలపతిరావు చెప్పాడు.

అదే బస్సు స్టాపు. ఆ డబ్బు కొట్టిన వెధవ తనే....

"ఎంత డబ్బు వుంది!"

"మూడొందలు."

పాండు రంగ జేబులో నుండి పర్సు తీసి చూపాడు.

"ఇదేనా?"

చలపతిరావు గబుక్కున దాని నందుకుని "అవును! ఇదే. ఇది నీ కెలా వచ్చింది?" అనడిగాడు.

"మీ పర్సు కొట్టేసిన దొంగ వెధవని నేనే!" అంటూ తలొంచుకున్నాడు పాండు రంగ!

తండ్రి విస్తుపోయాడు.

చలపతిరావు ఆశ్చర్యపడలేదు! కోపగించుకోలేదు! జాలిగా చూశాడు.

"పాండు రంగా! బాధపడకు! నిన్ను నేను అర్థం చేసుకోగలను. ఎంతటివాడయినా పరిస్థితులకు బానిసే కదా! ఇంతకీ ఈ కథకి ముగింపు ఎలా జరిగిందో తెలుసా?"

పాండు రంగ "చెప్పండి" అన్నట్టు చూశాడు.

"నేనూ, మీ నాన్నా కంగారు పడుతూ ఆ డాక్టరు దగ్గరికెళ్ళి జరిగిందంతా చెప్పాం! పాపం ఆయన జాలిపడి అతనే ఇంజక్షన్లు కొని మీ అమ్మకు ఇచ్చాడోయ్! చూశావా! ఆ డాక్టరు ఎంత మంచి-వాడో?"

ఆ మాటలకు – పాండు రంగ మనస్సు ఆనందంతో పులకించింది!

"అవును! ఆయన మంచివాడు! అందరూ మానవత్వమున్న మనుషులే! చలపతిరావు – ఇనస్పెక్టరు – డాక్టరు – అందరూ మంచి మనసున్న మనుషులకు మారు పేర్లు!

"ఓ మనిషీ! నువ్వు తలుచుకుంటే ఎడారిలో మల్లెలు పూయించగలవు! కడలిని కావేరిలా మార్చ-గలవు. మరి నువ్వు అప్పు డప్పుడు రాక్షసుడివి ఎందు కవుతావ్! మనిషీ! నువ్వెప్పుడూ ఇలా మనిషిలా వుండిపోకూడదూ!" అనుకున్నాడు పాండు రంగ ఆశగా! □

పిల్లలు వారి మానసిక ప్రవృత్తులు



డాక్టర్ (శ్రీమతి) జయా నాగరాజ
మానసిక వేత్త

"మరేనే. నేనేమో పెద్ద తుపాకీ తీసుకొని మా మామయ్యతో వేట కెళ్ళేను తెలుసా.. అక్కడ అబ్బ... యింత పెద్ద పులి.." అని కళ్ళు చేతులూ తిప్పుతూ తన తోటి పిల్లలకు చెప్పుతున్న నాలుగేళ్ళ చిన్నారి అబద్ధాలాడడం లేదు ఆ వయస్సులో ఏవేవో

పిల్లలు - అబద్ధాలు


వూహించుకోవడం. . అవి నిజమని నమ్మడం నిజానికి వూహకు తేడా తెలియని వయస్సది.. అందుకే అలా చెప్పుతారు. అంతే కాక తన తోటి వారితో ఘనత వుండాలని తనను ఆట పట్టిస్తున్న పిల్లలకు తన మీద గౌరవంరావాలని కూడా యిలాంటి కల్పితాలు చెప్పుతారు పిల్లలు. మరి అబద్ధాలాడడం ఎలా అలవడుతుంది అంటే మళ్ళా మనం పెద్దలనే అనాలి. "ఒరేయి ఆ గురునాథం వస్తే నాన్న లేడనరా." అనో "లేక అయ్యో పిన్నిగారు కాఫీ పొడి యిప్పుడే నిండుకున్నాయ"నో విన్న పిల్లవాడు, తండ్రి వుండి తన చేత లేదనిపించటం, కాఫీ పొడి డబ్బా నిండా వున్నా లేదనడం. 'ఇది ఎందుకిలా జరుగుతుంది?" అని తెలియక అబద్ధాలు చెప్ప-డానికి అలవాటు పడిపోతాడు.మంచి చెడ్డ, నిజా నిజాలు, తెలుసుకోకుండా కొట్టే తల్లి దండ్రుల దెబ్బల బారి నుండి తప్పించుకోడానికై అభూత-కల్పనలుచేసి అబద్ధమాడతారు మరి కొందరు

చిన్న తపు కే పెద్ద శిక్ష వేసే యింట్లోని పిల్లలైతే, తమ తప్పు వప్పుకోరు చెప్పరుకూడా.. క్లాసులో మంచి మార్కులు రాలేదని కొట్టే తండ్రికి మార్కుల కార్డు రాలేదనో.. యివ్వలేదనో... పరీక్షలే పెట్ట-లేదనో ఏదో ఒక బుకాయింపు చెప్పడం అలవాటు చేసుకుంటారు. శిక్షతప్పించుకుంటారు.

పిల్లలకు తోడివారితో ఏదో కలసి చేయాలని, కొనాలని, తినాలని, వుంటుంది ఆ ఖర్చుకై చేతి డబ్బు లియ్యని నాడు పిల్లలు మాస్టర్‌గారు డబ్బు తెమ్మన్నారనో, ఏదో నోటుబుక్కు కొనాలనో అబద్ధం చెప్పుతారు . తమ అవసరాలను గుర్తించని తల్లి దండ్రులను మోసగించాల్సి వస్తుంది

కొంత మంది తమ పిల్లలకు అధికంగా ధనం యిచ్చి ఏనాడో ఒక నాడు దాని గురించి అడుగు-తారు ఏమి చెప్పాలో తెలియక పిల్లలు అసత్య మాడతారు

చాలా కట్టుదిట్టాలు, నిబంధనలు, ఆచారాలు వున్న యిండ్లలో పెరిగిన పిల్లలు తమ తోటి పిల్లలు అనుభవించే కనీసపు స్వేచ్ఛ, ఆనందం లేక అబద్ధాలు చెప్పి వీటిని అనుభవిస్తారు. తెలిసీ తెలియని పిల్లల చేత అబద్ధమాడించే తల్లి దండ్రులను అనాలా, లేక నిజాన్ని నమ్మలేని సంఘాన్ని అనాలా అనిపిస్తుంది, చిన్న చిన్న నోళ్ల నుంచి పెద్ద పెద్ద అబద్ధాలు బయటికి వస్తుంటే. చిన్నతనంలో తెలిసో తెలియకో ప్రారంభమ్మైన అల-వాటు వారితో నే పెరిగి సంఘంలో బ్రతుకుదారికో సూత్రంలా, కోర్టులలో దొంగ సాక్షుల్లా.. యింకా యింకా పెరిగి ఒక అంతులేని జాడ్యంలాగా తయా రవ్వుతుంది... అప్పుడది మారని చెరగని అల-వాటు.: "కాని వారి జాక్షులందు వైవాహికమందు పాణ విత్త మానభంగమందు బొంకవచ్చు...." అని వెనుకటి కెవ్వరో చెప్పారు కాని ఈ సూత్రం గనక అలవరించుకుంటే నోరు విప్పుతే అబద్ధాలే ఆడ-వలసి వస్తుంది మరి చేయకూడని పనులకు రూపురేఖలు దిద్ది దానిని సమర్థించడమే 'అబ్బే మా వాడు అలాంటివాడు కాదండి . వాడు అబద్ధా లాడడం ఏమిటి? నోట్లో వేలెడితే కరవలేని అమాయకుడు" అని చాలా మంది తల్లి దండ్రులు పిల్లల అబద్ధాలను మందలించే బదులు సమర్థి-స్తారు. తల్లి దండ్రుల అండ చూచుకొని వాడిక అసత్యాన్నే వల్లిస్తాడు ఆఖరుకు తల్లి దండ్రుల వద్ద కూడా.."నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా" అంటూ. □



లోగిలి

వాడపల్లి విజయభాస్కర రామారావు



అపరాహ్ణం.

అగ్రహారం వీధి. ఆ చివరి నుంచి ఈ చివరకు రెండుసార్లు తిరిగాడు ఆ ఆసామి.

ఎవరి ఇల్లో వెదుకుతున్నాడు. ఊరంతా మారిపోయింది. ఎవరినడగాలి?

యాజులు గారిల్లు పెద్దవీధిలోనని తెలుసు. కాని ఏనాడో నలభై ఏళ్ల క్రిందట చూసినదాయె. వాళ్లు ఇంకా ఈ ఊళ్లోనే ఉన్నారనే దేముంది? పిల్లలంతా పెద్ద పెద్ద వాళ్లయిపోయి ఉంటారు. వృద్ధాప్యం, ఎవరి దగ్గర ఉన్నారో ఏమో తనకి తెలిసిన బుగతగారు.

—ఉద్వేగం ఆగలేదు. పట్నంలో ఠక్కున రైలు దిగాడు. ఎన్నాళ్లయింది!

తన చిన్నతనంలో ఇంత ఊరేదీ?

పట్నానికీ పాలేనికీ నడకతప్ప మరో గత్యంతరం-లేదు. మూడుకోసులూ నడవాల్సిందే సూది-కావాల్సినా.

అయితేనేం, పంతులుగారింటికెళితే అమ్మ దగ్గర ఆప్యాయత దొరికేది.

"అప్పుడూ! బువ్వ తిందువుగాని, పెందరాడేపని పూర్తి చేసుకునేది" అనేవారు ఆ ఇల్లాలు, మాతల్లి-–మాలక్ష్మి.

"ఏమండీ!... సార్!" అప్పలస్వామి కొంచెం బిడియం అనిపించింది. "బాబూ! చాలా కాలం నాటి మాట! ఈ వీధిలో సోమయాజులుగారని బుగతగారు ఉండేవారు. వారి ఇల్లు గుర్తుపట్టలేక పోతున్నా... అగ్రహారంవీధి ఇదే కదూ!"

"అగ్రహారం వీధి ఇదే . కానయితే సోమయాజలు గారని నే వినలేదే. సుమారు ఎంత వయసుంటుంది?... ఆయన ఎందులోపనిచేస్తున్నారు?"

"పనా? ఆయనకి పనేమిటి? పేద్ద బుగత... పాలెంలో భూములు సగం వారివే ఇక వయసంటారా? ఏ ఎనభయ్యో ఉంటాయేమో! ఇళ్లన్నీ మారిపోయాయి. వీధిలో చాలా డాబాలూ, మేడలూ లేచిపోయాయి. ఏ ఇల్లు వారిదో తెలియడంలేదు

నేను చూసిన ఊరేనా అనిపిస్తుంది. వారిని ఓ మారు చూసి పోవాలని వచ్చాను "

"పేరేమిటన్నారు?"

"సోమయాజులుగారు "

"నాకు తెలిసి ఆ పేరుగల వాళ్లెవర్నూ ఇక్కడలేరు అసలు అంత పెద్దాయన ఈ వీధిలోనే ఉన్నట్టు-లేదు.. అటు ఆ నాలుగో డాబా ఇల్లు . ముందు కొబ్బరి చెట్టుందే అక్కడ భోగట్టా చెయ్యండి! కుక్కలుంటాయి సుమండీ! జాగ్రత్త! ఇంతకీ ఏ ఊరు నుంచి వస్తున్నారు?"

"ఢిల్లీ నుంచి "

"ఓహ్! ఉద్యోగమా?"

"రాజ్యసభ సెక్రటేరియట్ పని చేసే వాడిని. రిటైరై పోయాను "

"క్షమించండి! నాకు పని ఉంది డాబా ముందు అడగండి. "

—అప్పలస్వామికి గుండెల్లో ఏదో గుబులు ఢిల్లీ-లో నే మనుషులు పరుగులు పెడుతున్నారనుకుంటే ఈ పట్నంలో నూ అంతేనన్నమాట

అసలు తన వెర్రిగాని ఏ నాటి మనిషో ఆయన ఇంకా ఇక్కడే ఉంటారా? పిల్లలందరూ ఎదిగి ఏవి ఊళ్ళు వెళ్లి పోయారో. "

డాబా ఇంటి ముందు ఆగాడు ఆయన.

"ఏమండీ! సోమయాజులుగారని ఓ పెద్దాయన.. "

"అల్లదిగో.. పెంకుటిల్లు . పెణక జారిపోతోందే అదే.. ఏమైనా బాకీ "

"ఛ..ఛ . అదేం కాదండీ.."

అప్పలస్వామికి కొంచెం బాధనిపించింది. బుగతగారి గురించి ఎందుకిలా అన్నాడాయన.! ఏదో కుర్రతనం అని సరిపెట్టుకున్నాడు.

పెంకుటింటి ముందు తారాట్లాడుతున్నాడు వీధి తలుపులు వేసి ఉన్నాయి ఇల్లు ఏ కారణంచేతనో చిన్నదయినట్టుంది. భూమిలోకి దిగిపోయి-నట్టుంది. చూరుబల్ల పోయింది పెణక కుంగి-పోయింది.ఎప్పుడు పడిపోతుందోనన్న భయం కలిగిస్తోంది

అరుగు మీదకొచ్చాడు

తలుపు తెరచుకుంది. ఇద్దరు బ్రాహ్మలు బయటకువచ్చి రొంటిలో ఉబ్బులు దోపుకుంటూ వెళ్లిపోయారు.

—కొంపతీసి సోమయాజులుగారు చనిపోలేదు-కదా!

ఛ. ఛీ! ఎందుకింత చెడ్డ ఆలోచన వచ్చింది. ఆయనను చూడాలనే ఆతృతతో నేకదూ తను ఇంత హటాత్తుగా అక్కడ దిగింది!

తలుపు దగ్గర పిలవడానికి ధైర్యం చాలలేదు తలుపు మళ్లీ తెరచుకుంది.

లోపల నుంచి ఓ ముసలావిడ ఎంగిలాకులు తెస్తూ అరుగు మీద మనిషిని చూసి తలుపువారకు వెళ్లిపోయింది.

లోగిలి

"ఉహ్మ్!" మరి ఉండబట్టలేక పోయాడతను. ఆమె విస్తరాకులు వీధిలో గిరవాటేసి -గిరుక్కున తిరిగి లోపలకు వెళ్లింది

"ఎవరు కావాలి బాబూ!"

"పాలెం రైతు వీరాస్వామి కొడుకు-" అప్పల-స్వామిని ..సోమయాజులు గారిల్లు.. ?"

"ఇదే లోపలకు రండి "

ఆవిడ లోపలకెళ్లి వసారా గోడ వెనుక నుంచి చెప్పింది.

"వీరాస్వామంటే పాలెంలో ఒకప్పుడు మా రైతు కదూ.. అవే నాటి రోజులు... ఉండు.. జ్ఞాపకం వస్తోంది. పెంటమ్మ అప్పుడు. ఇంత ఉండే-వాడు అప్పుడు ."

"అవునమ్మా ఆ అప్పుడిని నేనే. పెంటమ్మ మా చినచెల్లి.. బాబుగారు "

తెలుస్తూనే ఉన్నా వివరాలు కోసం— తన ఆశ్చ తర్పణానికి నాందిగా, సానుభూతి చూపడానికి ముందుమాటగా— అడిగాడు

"కాలం చేసి ఆరేళ్లయింది ఈ రోజు వారి ఆబ్దికం ...పెద్దబ్బాయ్!"

— రామస్వామికంటే చిన్నతను ఒకాయన గావంచా కట్టుకుని వచ్చాడు.

"క్షమించండి! అబ్బకు ఏదా అంతా ఒడిలో-ఉన్నారు నాకు తెలియక ."

"ఏం ఫరవాలేదు నాన్న మీకు బాగా తెలుసా!"

"తెలుసా?! ఎంత మాట బాబూ! అప్పటికి మీరు పుట్టలేదసలు నేనింతవాడిని కావడానికి కారణం ఆ అయ్యచలవ. మన అమ్మగారి ఆశీర్వచనం .. వారు పోయారని కూడా నే నెన్నడూ వినలేదు. నేను ఇటువచ్చి నలభై ఏళ్ళుదాటి పోయిందేమో . దేశం రాగానే ముందు తమ ఇంటికే రావాలనిపించింది రైలు దిగాను. . ఆయితేనేం వారిని చూసే అదృష్టం నాకు లేదు .. తమకి భోజనానికి వేళ నాకు సెలవు ఇప్పిస్తే సాయంకాలం తీరికగావచ్చి దర్శనం చేస్తా..."

"ఫరవాలేదు.. నాన్నగారికి మేం ఏం చెయ్యలేక పోయాం చాలా రోజుల వరకూ వారికి సంతు లేదని బెంగ. మేం పుట్టుకొచ్చాక ప్రయోజకులం కాలేదని ఆరాటం. నాకుచదువు అబ్బలేదు... నాన్నగారే లారీలో పెట్టేశారు... ఇప్పుడు డ్రైవరుగా ఉన్నా. "

గావంచా కట్టుకున్నా ఆయనలో విచారంలేదు. "బాబూ కాలం మారింది... అమ్మగారిని ఇలా చూస్తా ననుకోలేదు తల్లిలేని బిడ్డనని నన్ను చాలా ఆప్యాయంగా చూసేవారు. మీరే చూశారుగా. అప్పుడని నన్నింకా జ్ఞాపకం ఉంచుకున్నారు. బాబూ, తమ తోబుట్టువులు . "అప్పలస్వామికి వివరాలు వినాలని ఆశ. "అప్పుడూ ఋణా సంబంధం ఉంది కాబట్టే బాబు ఆబ్దికం నాడువచ్చావ్ . భోక్తలు-వెళ్లారు. నువ్వూ కాళ్ళు కడుక్కో . "

రామస్వామికి కాదనాలని లేదు. కాని వెళ్లడానికి మనసు రావడంలేదు వారి పంక్తిన భోజనం . తన చిన్ననాడు ఆ ఆలోచనకి అవకాశమేలేదు వారు పంక్తిలో భోజనం పెడతారా? పెడితే ఈ పట్నాంతో ..ఎలా?

"ఎందుకులెండమ్మగారూ. నే వెళతా !"

"ఎంత మాట! నా బిడ్డలాంటి వాడివి ఆయనకు నువ్వంటే ఎంత అభిమానమో ఆయన నాటి అభిమానమే నేటి మా ఊపిరి . చితికి పోయాం భూములు పోయాయి మా అంతస్థు పడిపోయింది పూర్వపు గౌరవం మాకు లేదు . కాయకష్టం చెయ్యడం రాక ఇతరుల శ్రమతో బ్రతుకే అందరితో-పాటు మాకూ ఈ స్థితి వచ్చింది . ముందు భోజ-నానికిలే. తరువాత తీరికగా మాట్లాడుకుందాం.. లక్ష్మీ మరో విస్తరి వెయ్! . పాత కాలం చనువుతో 'నువ్' అనేస్తున్నాను ఏమనుకోకు నాయనా . "

రామస్వామి గోడవారికి కూచున్నాడు. పంక్తిలో బుగతగాబ్బాయి, మనవడూ, మనమరాలూ ఉన్నారు. వడ్డిస్తూ ఆవిడ మాటాడుతూనే ఉంది.

"ఆదరించడానికి ఈ నాడు మా దగ్గర అయివేజు లేదు... కాని పాత కాలం మనుషులం మీ నాన్న ఉండగా మాకు భూమి తగాదాల్లేవు. పంట ఇంటికొచ్చేది. రాజాల్లాగా బ్రతికాం కాని ఇప్పుడు కాలం మారిపోయింది."

"... మీ పంక్తిన.... ఆ రోజుల్లో ఎన్ని గుండె-లుండాలి! మీ ఆదారం వేరనుకోండి!"

"అలా కాదు బాబూ! మారుతున్న కాలంతో మనమూ మారాలి. రైతైనా, బగతైనా పంక్తిలో ఉండాలన్నదే ఈ నాటి మార్పు. నువ్ నా పెద్ద కొడుకువనుకుంటున్నా... ఈ రోజు వచ్చావ్! వివరు పిలిచారని?అదే ఋణానుబంధం . ఆయన ప్రసాదం తినాలని ఆయన ఆశీర్వచనం పొందాలని ఆ భగవంతుడి నిర్ణయమన్నమాట .. నూలు పచ్చడి వేయించుకో..లక్ష్మీ గారెలు వడ్డించు. ."

రామస్వామికి బెరుకు పోయింది. హాయిగా భోజనం చేస్తూ అడిగాడు.

"అమ్మా తమకి.. . ఆడ పిల్లలు...?"

"వీడికంటే పెద్దది.. మొన్ననే పోయింది... ఇద్దరి పిల్లల తల్లి . వాళ్ల పిల్లలు పెద్దవాళ్లయినా మేం పెట్టు పోతలు పొయ్యడం లేదని ఈసడింపు .అది పోయిందని చెప్పడం కంటె ఘోరమైన విషయం . నూతిలో దూకి పోయింది. భర్త ఇంకొకర్ని తీసు-కొచ్చి ఇంట్లో పెడితే ఏం చేస్తుంది. ఆ స్థితికి దిగజారిపోయాం. మమ్మల్ని ఇప్పుడు ఎందుకు గౌరవించాలి? . అందుకేగౌరవించరేమో!"

కూతురు పోయిందన్న విషయంకంటే వాళ్ళు దిగజారిపోయిన విషయం ఆవిడకు వేదన కలిగిస్తు-న్నట్టు రామస్వామి అర్థం చేసుకో గలిగాడు. ఉన్నతుల పరనం సామాన్యుల పతనంకంటె వెయ్యి-రెట్లు బాధను కలిగిస్తుందని తను ఎక్కడో చదివాడు. ఎలాంటి కుటుంబాలు ఎలా దిగజారి పోయాయి !

భోజనా లయ్యాక బయట వసారాలో కూచున్నాక అడిగాడు. "అమ్మా బాబుగారి చలవ మీ ఆశీర్వచనం.. మీ రన్నట్టు ఆ బంధమే నన్ను ఇవాళ నేననుకోకుండానే లాక్కొచ్చింది మీ ఋణం ఎలా తీర్చుకుంటానో "

"అంత మాటనకు బాబు చిన్న వయసు నుంచీ చదువుకుంటున్న పిల్లలందరి ఎడలా ఆపేక్ష చూపేవారు. శ్రమ ఒకరిది. సుఖం ఒకరిది కాకూడదనే అనే వారు. చితికి పోయినా అందుకే మేం కాయకష్టం మీదే బ్రతుకుతున్నాం లారీ డ్రయివరయితేనేం ఒకర్ని యాచించకుండా బ్రతక గలుగుతున్నాం భగవదేచ్ఛ!"

"బాబూ. మీ అబ్బాయి, అమ్మాయి. చదువుకుంటున్నారా?"

"పెద్దాడు టెన్త్ ఫెయిల్ అయ్యాడు కష్టంమీద మా తాత ముత్తాతల్లాగే వాడికీ తెలియదు నాకూ ఆ వయసులో తెలిసేది కాదు, గారంవల్ల ఏదో సినిమాహాలో పనిచేస్తున్నాడు "

"అమ్మా తమరు భోజనం చెయ్యలేదు వెళ్లండమ్మా!" అప్పలస్వామి అన్నాడు మీరు భోజనంచేసి రండి, నేనూ బాబూ మాటాడుతూ ఉంటాం.

ఆవిడ లోపలకు వెళ్లింది

"బాబూ! నా కంటే మీరు చిన్నవాళ్లు నేను మీ ఇంట్లో తిరిగే రోజుల్లో మీరు పుట్టనేలేదు . మీ నాన్నగారు నాకు చేసిన ఉపకారం మనిషిగా నేను మరచిపోలేను అమ్మగారూ పెద్దవారయి పోయారు - మీతో చెప్పలేం . ఆ రోజులూ ఆ అభిమానాలూ వేరు. మా అన్న దమ్ములు చూడండి నా దగ్గరకురారు. నే వెళ్లినా నన్నెవరో అన్నట్టు విరుసుగా చూస్తారు ఆస్తి అడుగుతానని భయం. నేను ఢిల్లీ మనిషిని . నేను వాళ్ల మధ్య ఉండలేనని వాళ్ల వాదన నాకు కావల్సింది ఆస్తి కాదు తో బుట్టువుల ఆప్యాయత అది నాకు లేదు ఆస్తి అక్కరలేదని చెప్పడానికే వెళుతున్నా "

రామస్వామి గొంతులో ఆవేశం.

"ఏం చేస్తాం బాబూ! డబ్బు రోజులొచ్చాయి . మా చిన్నాన్నలూ నన్ను పలకరించరు డబ్బుతో పాటు మేం కులమూ పోగొట్టుకున్నామనే వారి భావన "ఒక విధంగా అది నిజమేనేమో! నాకున్న ఒక్క కూతురి పెళ్లి చేస్తే ఈ పెంకుటింట్లోంచి పాకలోకి పోవాల్సిందే. భూములూ ఆస్తులూ పోయాయి చదువు అబ్బలేదు స్వశక్తి మీద ఆధార పడడం నేర్చుకుంటున్నానే కాని బంధువులతో చిన్న చూపు తట్టుకోలేక పోతున్నా అబద్ధాలూ అన్యాయాలూ వీటికి పాల్పడ నక్కరలేకుండా జీవితం ఈ మాత్రంగా గడపగలిగితే అంతే చాలు "

-"నీ కెంతమంది పిల్లలు బాబూ!"

ఆవిడ భోజనం ముగించి బయటకొచ్చి అడిగింది

"పెద్దది ఢిల్లీలోనే పని చేస్తోంది ఒక పంజాబీ అబ్బాయిని పెళ్లి చేసుకుంది నేను కాదనలేదు మన మాటలూ, మన మనసులూ వాళ్లకి అర్థంకావు. వాళ్లని అర్థం చేసుకోవటమే మనం చెయ్యాల్సిన పనేమో! అబ్బాయి ఇంజనీరుగా ఉన్నాడు తెలుగు పిల్లను చేసుకుంటే బాగుంటుందని ఆలోచన వాడేం చేస్తాడో! నాకు భార్యలేదు రిటైరైపోయాను నాకు విచారాలు లేవు లేకుండా చేసుకుంటున్నాను "

"సంతోషం బాబూ! ఆశీర్వచనం.!

"అమ్మగారూ, నాదొక చిన్న కోరిక "

చెప్పు నాయనా!"

"మీకు నేను చాలా చాలా ఋణపడి ఉన్నాను నాకు విద్యా భిక్ష పెట్టింది మీరు బుగతగారయితే కనమరుగయిపోయారు కాని భగవంతుడిదయవలన మిమ్మల్నయినా చూడగలిగాను అసలు సంగతి మీదగ్గర దాచడమెందుకు కాని మా అయ్యనా చిన్నతనంలో నే నాకొక మాట చెప్పాడు

ఒరి నాయనా, అప్పుడూ! బుగతల్లోనూ, భూకామందుల్లోనూ కూడా శానా మంచోళ్లున్నారు మన బుగత మడిసికాడు దేవుడు ఇలాసింటోడు కోటి కొకడే ఉంటాడు మీ యక్క పెద్ద మడిసయితే ఆ రోజు సేత కానిలేదు సెయ్యాఒల్సినవి సెయిక తప్పదు దేవుడిలా గొచ్చినాడు ఆయాలెందుకో! కళ్లలంకాడి నుంచి కబురు. లగెత్తుకెల్లినా! ఆరి కేలా తెలిసిందో రొంటి నుంచి బొత్తిడి నోట్లిచ్చినాడు. పోని అది సరేననుకో మీ అన్ననడుగు బొట్టి పెల్లి కర్సులికి రెండు వేలవుతాయన్నారు. రెండువేలేటి? నేనెక్కడ? పూట బంత్తిం పుల్లెలకూ ఇది గందా మన బతుకులు. నువ్వేటి కాలేజేటి? నీకు ఎంత కరుసవుతుంది ఎలాగిస్తున్నాడో ఆ దేవుడి కెరుక! నా సెరమం సెప్పులు కుట్టించినా నీ ఋణం తీర్చుకోలేను. బుగతా! అంటే అదేటిడవా! నీ బిడ్డేటి నా బిడ్డేటి. ఆడ సదూకుంటన్నాడు అంతే! నా బిడ్డయితే సదూకుంటానంటే సదూ సెప్పించ ననేస్తానేట్రా ఆ యమ్మ బుగతే అనుకుంటే అంతకంటే 'అన్నపూర్ణమ్మ ఈరాసామీ, నీ కష్టం మేం తింటూనే ఉన్నాం పిల్లోడు సదూకో! అనేది పెంటమ్మ నీ బొట్టి కాయ ఈరాసామీ నా. బొట్టే అయితే పెళ్లి చేసుకోమా! అన్నది అంతే బుగత లెక్కెట్టి రెండేలు ఇచ్చేసినాడు. అలపింటి మడిసి ఋణం నేను తీరుసుకోలేన్రా నీకు బగమంతుడిచ్చినపుడు నువ్ ఆ ఋణం తీర్చుకోరా! ఆళ్ల దీవెన బగమంతుడు దీవెన్రా నాకయినా నీకయినా నీ సంతుకయినా ఆల్ల దీవెనలే బగమంతుడి దీవెనలు ఆల్ల ఋణం తీర్చుకో..

....అమ్మా, ఇవీ మా నాన్ననాకు చాలాసార్లు చెప్పిన మాటలు ..


"నీ అభిమానం కాని చేసేవాళ్లం మనంకాదు బాబూ! ఆ భగవంతుడి దయ నీ మీద ఉంది నీ చదువుకి ఎవరో సాయం చేయాలి మా చేత చేయించాడనుకో అది నీ పుణ్యం మా గొప్ప కాదు.."

"అలా కాదమ్మా, అభిమానానికి విలువకట్టడం నా ఉద్దేశం కాదు... ఆ మహానుభావుడికి నా అశృత తర్పణంతో పాటు ఈ లోగిలికి నేను ఋణపడి ఉన్న దానిలో లవలేశం నేను తీర్చడం నా విధి. కాదనకండి. ఇందులో వడ్డీ లేదు. అసలూ కాదు. లెక్క లేని ఆదరానికి స్వర్గాన్న ఉన్న ఆయన చల్లని చూపుకీ మీ ఆశీర్వచనానికీ వెల ఎవరు కట్టగలరు..... ఈ సొమ్ముంచండి... నా పిల్లకి మీరెవరో నేను రోజూ చెబుతూనే వచ్చాను.. వాళ్లనూ ఆశీర్వదించండి.!"

జేబులోనుంచి డబ్బు తీసి ఆవిడ కాళ్ల దగ్గరుంచి వసారా గోడకి ఉన్న పెద్ద ఫోటోకి చేతులు జోడించి కళ్లు మూసుకున్నాడు రామస్వామి. □

"టీనేజ్" కంప్లీట్ షాంపూ మార్కెట్‌లో విడుదలైన సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తున్న మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ టి శ్రీనివాస్, శ్రీ సి. నరసింహారావు, శ్రీ లంకా గోవిందరాజులు, డాక్టర్ కె శ్రీనివాసరావు, కుమారి సంయుక్తలను చిత్రంలో చూడవచ్చు




మిరుమిట్లు గొలిపే ఆప్కో
చేనేతలు - ఈ దీపావళికి
సరికొత్త జ్యోతులు
ఆప్కో
చేనేతలు
కళలు కాంతులు కలబోసి
నేసిన చేనేత కళాకారుల
సృష్టి ఆప్కో చేనేతలు!
దీపావళి ఆనందోత్సా-
హాలను ప్రతిబింబించే
ఆప్కో చేనేతల అందాలను
అనుభవించండి!
* నారాయణ పేట
* కొత్తకోట * వేంకటగిరి
* ధర్మవరం * గద్వాల
* పోచంపల్లి చీరలు
దీపావళికి మీకు ఆప్కో
యిచ్చే సారెలు!
20%
రిబేటు
16·10·84 నుండి
23·10·84
వరకు
APSHWCSL
దీ ఆంధ్రప్రదేశ్
స్టేట్ హేండ్లూం వీవర్సు
కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
హైదరాబాద్-500 029
kiron/apco/84dl



శోభన్‌బాబు, అనూరాధ, "భార్యామణి"

సినిమా

"స్వాతి"లో సరస్వతి

ఆస్పత్రి నుండి అలసి వచ్చింది సరస్వతి (శారద)

"ఏమిటమ్మా, బాగా అలసిపోయావు? సీరియస్ కేసా?" అడిగింది స్వాతి (సుహాసిని).

"అవును, స్వాతీ! అబార్షన్. గర్భం బాగా పెరగనిచ్చి, ఏవో నాటు వైద్యాలు చేశారు. ప్రాణం మీదకు వచ్చేసరికి- ఆస్పత్రికి మోసుకొచ్చారు. పాపం.... పెళ్ళి కాని పిల్ల," అంది సరస్వతి.

"అంటే.... ఇప్పుడావిడకు పెళ్ళవుతుంది కదమ్మా?"

"నిక్షేపంగా అవుతుంది."

"తన పెళ్ళి కోసం కడుపులోని బిడ్డను చంపేసిందా ఆ తల్లి?"

"తప్పదు, స్వాతీ! తల్లి గౌరవంగా బ్రతకాలంటే బిడ్డ చావాలి మరి."

స్వాతి నిర్ఘాంతపోయింది. "అలా బిడ్డలను చంపుకునే తల్లులుంటారా?"

"ఎందుకుండరు? నెలకు పది పదిహేను కేసులను నేనే చేస్తాను."

"స్వాతి"లో సుహాసిని, శారద





ఊర్వశి "రుస్తుం"

"అమ్మా!" అంతవరకు అతి కష్టం మీద ఆపుకున్న దుఃఖమంతా ఒక్కసారిగా పెల్లుబికింది స్వాతికి. "అమ్మా! నన్ను కన్నందుకో, పెంచినందుకో కాదమ్మా, నన్ను చంపనందుకు నీకు ఋణపడి ఉన్నానమ్మా, కడుపులో నేను పడగానే సులువుగా వదిలించుకోగల ఈ భారాన్ని మోసి, కని, పెంచి పెద్దచేసి, నీ బ్రతుకు నాకు జన్మనివ్వడం కోసం ధారపోసినందుకు నేను

ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం తీర్చుకోలేనమ్మా .... పెళ్ళిపెళ్ళని నన్ను దూరంచేసే ప్రయత్నం చెయ్యకమ్మా. చచ్చే దాకా నన్ను నీ పాదాల దగ్గరే ఉండి, నీ సేవలు చేసుకోనీయమ్మా." అంటూ తల్లిని వాటేసుకుంది.

బిడ్డను ఓదార్చింది సరస్వతి.


దర్శక నిర్మాత టి. క్రాంతికుమార్ చిత్రం "స్వాతి" త్వరలో విడుదలవుతుంది.

రేలంగి దర్శకత్వంలో నవత కృష్ణంరాజు చిత్రం "సంసారం ఓ సంగీతం"

"సంగీతంలో అప శృతులులా సంసారంలో అపార్థాలు ఏర్పడితే సరి చేసుకోవాలనే మూడు జంటల కథ ఈ మా పదవ చిత్రం" అన్నారు ఎన్. కృష్ణంరాజు. ఈయన నిర్మించే పై చిత్రానికి సెప్టెంబర్ 3న తొలి గీతం ధ్వని ముద్రితమైంది. చంద్రమోహన్, విజయశాంతి, శరత్ బాబు, రాజేష్, పూర్ణిమ, నిర్మలతో పాటు ఓ ప్రముఖ నటి కూడా పాల్గొంటుందని డైరెక్టర్ నరసింహారావు రేలంగి లియ జేశారు. నవత యూనిట్ సమకూర్చిన కథకు త్యానంద్ సంభాషణల కర్త. వుహాశేంది స్వర ల్పనలో సి. నారాయణరెడ్డి, వేటూరి గీతాలు శారు. బి. కోటేశ్వరరావు ఛాయ, కళాధర్ శిల్పం, వ సుబ్రహమన్యం నృత్యాలు, కృష్ణ చైతన్య – డి. ాజేష్ సహకార దర్శకత్వం, గౌతమ్ రాజు కూర్పు, టి. ఢ. సంతానం ప్రొడక్షన్‌తో నిర్మాణ సారథ్యం హించే ఎన్. అచ్యుత రామరాజు "అక్టోబర 9 నుంచి వంబర్ చివరికి షూటింగ్ పూర్తవుతుంది. కొన్ని ాటలు ఊటీలో పిక్చరైజ్ చేస్తాం" అన్నారు.

ప్రసాద్ ఇంటర్ నేషనల్ ఫిలిమ్స్ "అసాధ్యుడు" మొదటి షెడ్యూల్ పూర్తి

ఆగస్ట్ 29 నుండి సెప్టెంబర్ 15 వరకు ఫస్ట్ షెడ్యూల్ ముగించాం. అక్టోబర్ 15 నుంచి 25 వరకు మద్రాసులో జరిగే తదుపరి షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయి పోతుంది" అన్నారు వి. నాగయ్య. ఈయన సమర్పణలో ఎం. ఎస్. కోటారెడ్డి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే ప్రసాద్ ఇంటర్ నేషనల్ ఫిలిమ్స్ వారి "అసాధ్యుడు" చిత్రంలో ఎరప్, బాలాజి, అరుణ, పద్మ, శిల్ప, శకుంతల, సుమతి, నీరజ, అనూరాధ, రాళ్ళపల్లి, హేమ సుందర్, వేలు, వీరభద్రరావు, ప్రతాప్ రాజు, కె. కె. శర్మ, ఎం. క్రాంతి, జంపని భాస్కరరావు నటిస్తున్నారు. కాశీ విశ్వనాథ్ సంభాషణలు, శంకర్, గణేష్ సంగీతం, ఓ. ప్రభాకర్ ఛాయ, టి. రమేష్ కూర్పు, నటరాజ్ సుబ్బారావు శిల్పం, తరుణ్ నృత్యాలు, ఎస్. శాంతి బాబు ప్రొడక్షన్, డాక్టర్ ఎస్. రాధాకృష్ణ నిర్మాణ సారథ్యంలో శ్రీమతి వి. నాగయ్య నిర్మాత.



'దొంగలు బాబోయ్ దొంగలు'లో కృష్ణ



"రౌడీ"లో కృష్ణంరాజు, సత్యనారాయణ

డైరెక్టర్ వేజెళ్ల చిత్రాలు


సినిమా

'ఆడదంటే అలుసు' ప్రాతిపదికగా కె ప్రకాష్‌రెడ్డి నిర్మించిన సురేఖా ఎంటర్ ప్రైసెస్' అపనిందలు ఆడవాళ్లకేనా' చిత్రం అక్టోబర్‌లో విడుదలవు-తుంది శారద, రంగనాద్, గుమ్మడి గొల్లపూడి మారుతీరావు, చలం పి ఎల్ నారాయణ, విద్యా-సాగర్, చిట్టిబాబు, ముచ్చెర్ల అరుణ రమాప్రబ జయమాలిని డబ్బింగ్ జానకితో పాటు వేజెళ్ల తనయుడు మురళీకృష్ణ ఓ ముఖ్య భూమికను ధరించాడు

రాజకీయాల సంక్షోభం మధ్య నలిగిపోయే సామాన్యుడికి కొత్త ఊపిరి ఇచ్చే త్రిజయా పిక్చర్స్ 'ఓటుకి విలువివ్వండి' చిత్రం తొలి షెడ్యూల్ సెప్టెంబర్ నుంచి 20 వరకు విశాఖపట్నం పరిసరాలలో జరిగింది శరత్‌బాబు, రంగనాథ్, రాజేంద్రప్రసాద్ సుధాకర్, వంకాయల, భీమేశ్వరరావు, రావి కొండల రావు, థమ్, రాజ్యలక్ష్మి, రమాప్రభ, రాజేశ్వరి, త్రివేణి జయమాలిని, ఒక విశిష్టమైన పాత్రలో చలం నటిస్తున్నారు ప్రముఖ రాజకీయవేత్త, మాజీ మంత్రి శ్యామలరావు నటుడుగా పరిచయం గావింప బడే ఆ చిత్రానికి డి వి నరసరాజు సంభాషణలకర్త విశాఖపట్నానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎం ప్రభాకరరెడ్డి ఈ చిత్ర నిర్మాత

నైజాం ఏరియాకు చెందిన బి మరిడేశ్వరరావు నిర్మించే మరిడేశ్వరరావు ప్రొడక్షన్స్ చిత్రానికి సెప్టెం-బర్ 1 న సంగీతంలో డిప్లొమా పొందిన సంగీత దర్శకుడు చక్రవర్తి పుత్రుడు శ్రీనివాస చక్రవర్తి తొలి సారిగా గానం చేసిన గీతం ధ్వని ముద్రితమైంది జయసుధ మురళీ కృష్ణ, చలం, వేలు శ్రీలక్ష్మి వగైరా తారాగణం

టి వి సుబ్బారావు నిర్మించే "ఈ హత్య నేరం కాదు" లో రంగనాథ్ ప్రధాన పాత్రధారి నవనాది నిర్మాణ సారది ఇవిగాక టి వి ఎస్ ప్రొడక్షన్స్, రమణ చిత్ర లక్ష్మి జ్యోతి ఫిలిమ్స్ వగైరా చిత్రాలకు వేజెళ్ళ దర్శకత్వం నెఱప నున్నారు. □



మహీజా ఫిలింస్
MAHEEJAA FILMS
న్యాయవాదిగా న్యాయాన్ని కాపాడి
చట్టాన్ని రక్షించడం తప్పంటారా!!
మానవుడే మహనీయుడు
LAKSHMI PUBS.
నిర్మాత: సి.హెచ్. ప్రకాశరావు
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కోడిరామకృష్ణ

సీరియల్

ఒకే అమ్మకథ

అన్నపూర్ణ

(గత సంచిక తరువాయి)

"నమస్కారమండీ ! నా పేరు రాజారావు. పద్మ మా పిన్ని కూతురు. నేను సౌత్ ఇండియా టూర్‌లో ఉండటంవలన మ్యారేజి ఫంక్షనుకు హాజరు కాలేకపోయాను." అంటూ ఎవరో అడిగినట్లు అన్నీ చెప్పుకొచ్చాడు రాజారావు సుందరరామయ్య ముందు. ఇంట్లో అడుగు పెట్టగానే ముందుగదిలో ఆయనే కనిపించాడు మరి.

" అలాగా ! కూర్చోండి. " అన్నాడు సుందరరామయ్య మర్యాదగా.

వినయంగా వదిగి కూర్చున్నాడు రాజారావు ఒక సోఫాలో.

"రాజా అన్నయ్యా ! నువ్వేనా వచ్చింది ! గదిలోకి నీ మాటలు వినిపించాయ్. పెద్దమ్మ, పెద్దనాన్న అంతా బాగున్నారా ? " అడిగింది పద్మ వచ్చి.

"బాగానేఉన్నారు. నీ పెళ్ళికి రాలేకపోయినందుకు అమ్మ ఎంతో బాధపడింది. నిన్ను మరీ మరీ అడిగానని చెప్పమంది. మీ ఆయనగారు లేరా ? " అని రాజారావు అంటూండగానే బయటి నుంచీ వచ్చాడు మధు. అప్పటికే అతడి భృకుటి ముడివడింది.

"బాగున్నావా మధూ ! పద్మ మా పిన్ని కూతురు-- నాకు చెల్లెలు. చూసిపోదామని వచ్చాను." మధు అడక్కముందే చెప్పేశాడు రాజారావు వివరాలు.

రాజారావును చూస్తుంటే పిచ్చి ఆవేశం కలుగుతోంది మధుకు. కానీ, నోరు జారటం సభ్యతగా ఉండదు. పద్మ అపార్థం చేసుకొనే అవకాశం ఉందని తనని తాను సంభాళించుకొని చరచర లోపలికి వెళ్ళాడు అతడు.

భర్త ప్రవర్తనకు విస్తుబోయి అతడు వెళ్ళినదిక్కే గుడ్లప్పగించి చూస్తూండి పోయింది పద్మ.

రాజారావును గురించి అంతగా తెలియని సుందరరామయ్య మాత్రం అతడితో ఏదో లోకాభిరామాయణం మాట్లాడటం మొదలు పెట్టాడు.

'పరవాలేదులే— అన్నయ్యతో మామగారైనా మనసువిప్పి మాట్లాడుతున్నారు' కొంత తృప్తి ఫీలౌతూ, తన తరపు బంధువులపట్ల అంత అలసత్వం దేనికో, భర్త ఆంతర్యం ఏమిటో తెలుసుకోవటానికి మధు ఉన్న గదిలోకి వెళ్ళింది పద్మ.

"నా పెళ్ళికి మా పెద్దమ్మ, పెద్దనాన్న రానేలేదు. ఏదో ఇన్నిరోజులకు అన్నయ్య ప్రత్యేకించి నన్ను చూసి వెళ్ళటానికి వచ్చాడు. చదువుకున్నవారు, సభ్యత సంస్కారం తెలిసినవారు-- మన ఇంటికి వచ్చిన కొత్త వ్యక్తిని మాట మాత్రమైనా పలుకరించకుండా నచ్చేయటం-- దీన్ని మీ నిఘంటువులో ఏమంటారు ? " అనడిగింది రోషంగా.

"ఎవరు ఎవరో, ఎవరు ఎటువంటివారో, ఎవర్ని ఏ విధంగా గౌరవించాలో నాకు తెలుసు పద్మా ! రాజారావు, నేను చదువుకొంది ఒక కాలేజీలోనే. అతడు ఎలాంటి వ్యక్తో నీకంటే నాకే ఎక్కువ తెలుసు. ఏదో ప్రేమ ఉప్పొంగి నిన్ను చూడాలని వచ్చాడు. చూశాడు, ఇకవచ్చిన దారినే వెళ్ళమను." అన్నాడు మధు అసహనంగా.

"అన్నయ్య కూటికి గతిలేక మన ఇంటికే రాలేదండీ... మనకంటే ఎక్కువ ఆస్తిపాస్తులే ఉన్నాయ్ వాళ్ళకు. ఆప్తబంధువుగా, నన్ను నా కాపురాన్ని చూసి వెళ్ళటానికి వచ్చాడు అతడు. అటువంటి అన్నయ్యను 'వచ్చినపని ఐపోయింది. ఇక వెళ్ళిపో' అని నేను అనాలా ? నిజంగా మీరొక పరమ మూర్ఖులండీ" అని గిరుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

[illegible]



ఆ మాటలు అన్నాక మరొక్కక్షణం తన ముందు నిలబడ్డా పద్మను ఏం చేసేవాడో తెలియదు. అంత కోపం వచ్చింది మధుకు.


ముందుగదిలో రాజారావు, సుందరరామయ్య కబుర్లాడుతూనే ఉన్నారు ఇంకా. వాళ్లేం మాట్లాడుకొనేదీ వినాలన్న కుతూహలంతో పద్మ తిరిగి అక్కడికే వచ్చి మొత్త దగ్గర నిలబడింది.

"... నిజంగా గోవిందయ్యగారంటే మా ఊళ్ళో ఎంత గౌరవమండీ! ఆయన్ని దైవ సమానులుగా భావించి పూజించేవారు అంతా. అలాంటి వ్యక్తి ఎంతో మందికి గుండె నిబ్బరాన్ని నూరిపోసి చివరికి ఏమో నీలివార్తలు నమ్మి, తనే మనోనిబ్బరాన్ని కోల్పోయి ఎటో వెళ్ళిపోయారంటే నాకే బాధగా ఉందండీ. మీ ఆవిడ అమృతగారు కూడా ఎంతో ఉత్తమురాలు. మీ మధు మాత్రం? అతడి మంచితనం అందరికీ తెలిసిందే. అలాంటి యోగ్యులైన వాళ్లమీద తల్లీకొడుకుల లాంటి వాళ్లమీద అభాండాలు వేసిందీలోకం! పోనీ లోకానికి కళ్లులేవు. నిజానిజాలతో దానికి పనిలేదు. నిందలు మోపి వ్యక్తులను హింస పెట్టటమే దాని డ్యూటీ అనుకోండి. మరి ఎంతో జ్ఞాని ఐయుండీ గోవిందయ్యగారు..."

— రాజారావు వెనుకటి ఆ విషయాలన్నీ త్రవ్వుకొనిరావటం మొదలు పెట్టటంతో సుందరరామయ్య అతడి మాటలు పూర్తికాక ముందే లేచి, "ఏమీ అనుకోకండి. నాకు కొంచెం పని ఉంది." అంటూ బయటికి వెళ్ళాడు.

"అన్నయ్యా! ఇప్పటివరకూ నువ్వు మాట్లాడింది...?" రాజారావుకు దగ్గరగావెళ్లి సన్నగా అడిగింది పద్మ.

"నిజమే పద్మా! నిన్న మొన్నటివరకు మీ ఆయన మధు, అమృత పట్నంలో ఒకే ఇంట్లో ఉన్నారు. చదువుకున్నారు. లోగుట్టు పెరుమాళ్ళకెరుక. మొత్తానికి వాళ్లిద్దరి మీదా



ఇటీవల హైదరాబాదులో జరిగిన శ్రీ బి. ఏ. రెడ్డి చిత్రకళా ప్రదర్శన ప్రారంభోత్సవ సందర్భంగా ప్రసంగిస్తున్న గోల్కొండ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ డా. టి. ప్రభాకర్. వేదికపైన ఉన్న శ్రీయుతులు బి. ఏ. రెడ్డి, విద్యాశాఖాధికారి శ్రీనివాస అయ్యంగార్, ఆం.ప్ర. లలితకళా అకాడెమీ అధ్యక్షులు పి. టి. రెడ్డిగార్లనీ చిత్రంలో చూడవచ్చు.

నింద పడింది. అది మాసిపోవటానికే తొందర పడి మధుకు పెళ్ళి చేసేశాడు వాళ్ళ నాన్న. అంతా నీ పాలబడింది చివరికి.'' అంటూ తనూ స్వరం తగ్గించి చెప్పాడు రాజారావు.

''ఇంత గ్రంధం నడిచిందన్నమాట ! మా అత్త అదే అమృత దాని ప్రవర్తన నాకూ నచ్చలేదు. నేను మూడు నిద్రలకు వచ్చినప్పుడు ఎవడో ఆనంద్‌ట వాడి ప్రక్కన కూర్చొని ... రామ రామ ! అన్నీ నా నోటితో చెప్పలేను. అప్పుడే మా ఇద్దరికీ చిటపట ఐంది. ఎంత సేపూ మావారు ఆవిడగారి పక్షమే మాట్లాడ తారు. నిజంగాకూడా ఏదో 'ఇది' ఉండకపోతే వాళ్ళలో ఒకళ్ళంటే ఒకళ్ళకు ఎందుకు అంత చేటు అభిమానం ఉంటుంది ? మరో సంగతి అన్నయ్యా ! ఆ అమృతది పెద్ద ఫార్సు ! రోజూ ప్రొద్దుట దేవుడి ముందు కళ్ళు మూసుకొని కూర్చొంటుంది. ఎవరెంత పిలిచినా పలకదు. ఆ సమయంలో ఆమెను ఎవరూ డిస్టర్బ్ చేయ కూడదని మావారు చెబుతారు ! రాత్రిళ్ళు దేవాలయానికి వెళ్ళి గంటల తరబడీ కూర్చొని వస్తూంటుంది. అదేమని ఎవరూ అడగరు. మొత్తానికి ఇలాంటి ఇంటికి కోడలినయ్యానేమో? అనే బాధపడుతున్నాను ఈ మధ్య.''

''అలాంటి బాధ నీకు వద్దు పద్మా. ఈ ఇల్లు మంచిదే. మీ ఆయనా యోగ్యుడే. కాకపోతే అమృత ఈ ఇంట్లో ఉన్నంత వరకు నీకు మనశ్శాంతి ఉండదు. అంతే''

''అలా అని అమృతను ఏమిటి చెయ్యటం?''

''అన్నీ సావధానంగా ఆలోచించు. సందర్భాన్నిబట్టి నడుచుకో. తప్పితే తొందరపడి మీ ఆయనకు, మామగారికి కోపం తెప్పించకు.''

''సరే అన్నయ్యా నువ్వుమాత్రం నా గురించి కొద్దిరోజులు ఇక్కడే ఉండిపో.''

ఒక అమ్మ కథ

''వాతావరణాన్నిబట్టి నాకు ఇక్కడ ఉండాలని లేదు పద్మా. ఐనా ప్రాధేయపడి అడుగుతున్నావు కాబట్టి కొద్దిరోజులవరకు ఉంటాను.''

''సరే అన్నయ్యా. అన్నట్లు మాటల మధ్యపడి నీకు కాఫీ ఇవ్వటమే మరిచిపోయాను. ఉండు'' అంటూ లోపలికి వెళ్ళింది పద్మ.

ఈలోగా మధు వచ్చాడు అక్కడికి ... రాజారావు తలవంచుకొని జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

మొత్తానికి పద్మ మాట కోసమని కొద్దిరోజులు అక్కడే మకాంవేయటానికి నిశ్చయించుకున్నాడు రాజారావు.

21

అర్ధరాత్రి. అప్పుడు టైమ్ ఎంతైందో తెలియదు. అధాటుగా మెలకువ వచ్చింది సుందరరామయ్యకు.

లేచికూర్చొనిచూస్తే అమృత కనిపించలేదు ప్రక్కనే ఉన్న మంచం మీద ... 'దేవాలయానికి వెళ్ళిఉంటుందిలే' అని సరిపెట్టుకొని, దాహం అనిపించి ''అమ్మా, కాసిని మంచినీళ్ళు ఇస్తావా ?'' అని అడిగాడు తల్లిని.

కొడుకు పిలుపుకు లేచికూర్చొంది నాంచారమ్మ. ఆవిడ మరో మంచం మీద పడుకొనిఉంది.

''అమృత గుడి నుంచి ఇంకారాలేదా ? ... అర్ధరాత్రి అపరాత్రి ఇలా దేవాలయాలు పట్టుకు తిరగటం నాకేం అంతుబట్టటంలేదురా అబ్బాయ్, కోడలి సంగతి'' నిద్రమత్తుతో తన సహజ ధోరణికొద్దీ అనేసి మంచినీళ్ళు తెచ్చి కొడుక్కు ఇచ్చింది.

మధు, పద్మ ఇంటి వెనుక పడుకున్నారు. వాళ్ళకు ఇక్కడి మాటలు వినిపించవ్. చిన్న పాలేరు రోజులానే గొడ్లకొష్టంలో పడుకున్నాడు

మంచినీళ్ళుత్రాగి మౌనంగా కూర్చుండి పోయాడు సుందరరామయ్య. మరేమీ వ్యాఖ్యానించకుండానే ఖాళీగ్లాసు తీసుకొనివెళ్ళి పడుకుండి పోయింది నాంచారమ్మ.

తాపీగా ఓ చుట్ట ముక్క వెలిగించిన సుందరరామయ్య దృష్టి అనుకోకుండా కొద్ది దూరంలో వాల్చి ఉన్న మరో మంచం మీద పడింది. తీరాచూస్తే అది ఖాళీ ! 'ఎక్కడికి వెళ్ళాడు ఈ రాజారావు ? అమృత కూడా లేదు. ఒకవేళ...' ఏమిటో ఆలోచనవచ్చి చటుక్కున లేచి అలా దేవాలయంవైపు దారితీశాడు. తీరా అక్కడికి వెళ్ళేసరికి మాటలు వినిపిస్తున్నయ్.

''రాజా ! నామీద నీకు అంత కక్ష ఎందుకు? నీకు నేను ఏంద్రోహం చేశానని ? నాకు, మధుబాబుకు అక్రమ సంబంధం అంటగట్టి మన ఊళ్ళో ప్రచారం చేశావ్. దాంతో నా తండ్రి నాకు కాకుండాపోయాడు. చివరికి మధుబాబుకు ఏక్సిడెంట్ జరిగిందని అబద్ధంచెప్పి నన్ను చెరచాలని చూశావ్. సమయానికి టేక్సీడ్రైవర్ భగవంతుడిలా అడ్డుపడకపోతే అన్నంతపనీ చేసేవాడివి. ఇప్పుడేమో ఈ ఊరు వచ్చి పద్మ మనసులో విషబీజాలు నాటి మా ఇంట్లో కలతలు రేపాలని చూస్తున్నావ్ ... నిజంగా రాజా, నువ్వు చేసిన పాడు పనులకు నేను కాబట్టి సహించి ఊరుకున్నాను. అదే మరొకళ్ళైతే ఏం చేసేవాళ్ళో? వెళ్ళు. ఇక్కడ నుంచీ తక్షణం వెళ్ళు. అదీ తెల్లవారకముందే జరగాలి... లేకపోతే ఇంతకాలం ఎవరికీ చెప్ప కుండా దాచిన విషయం ఆనాడు నన్ను టేక్సీలో తీసుకువెళ్ళింది నువ్వేనని మా మధుబాబుకు చెప్పేస్తాను. ఈసారి అతడు నిన్ను ఏం చేసినా నేను అడ్డురాను...''ఆవేశంగా అంటున్న అమృత మాటలు వినిపించి దేవాలయం గేటు దగ్గిరే ఆగి పోయాడు సుందరరామయ్య.

''నిజమే అమృతా ! నీమీద నాకెందుకో కసి — అదీ చెప్పలేని కసి ! ఆ కసితీరాలంటే నువ్వు నా దారికిరా... ఆ రోజు ప్లాన్ ఆ డ్రైవర్ వెధవవల్ల పాడైపోయింది... ఐనా నీ చేతి గాజులు పగులకొట్టాను. నీ బొట్టు చెరిపాను. జాకెట్ చింపాను... అప్పుడు నీ వాలకంచూసి పరాభవం పొందకుండా క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చేవంటే ఎవరూ నమ్మరు. నీవన్నీ అబద్ధాలనీ నువ్వొక చెడిపోయిన ఆడదానివనీ అందరికీ చెప్పేస్తాను. అలా జరుగకుండా ఉండాలంటే నువ్వు దారికి రావాలి. ఏమంటావ్?'' కరుడుకట్టిన హృదయంతో అడుగుతున్నాడు రాజారావు.

''నన్ను బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తున్నావా ?''

''నీకోసం ఏం చేయటానికైనా నేను సిద్ధమే.''

'అమృత విషయంలో అన్ని అనర్థాలకూ కారకుడు ఈ రాజారావేనన్న మాట ! అంతచేసీ ఎంత నటింపుగా మాట్లాడుతున్నాడు ? మొత్తానికి అమృత చెప్పింది నిజమే. ఆనాడు ఎలాంటి పరాభవం పొందకుండా క్షేమంగానే ఇంటికి తిరిగి వచ్చిందన్నమాట ! ఇప్పుడు ఆమెను తన దారికి రావాలంటున్నాడు రాజారావు. అలా జరక్కపోతే ఏమో చేస్తానని చెదిరిస్తున్నాడు అమృతను... వీడొక తుచ్ఛుడు. ఇలాంటి వాణ్ణి బ్రతకనిస్తే భూదేవికే భారం...' ఇలా ఆలోచిస్తున్న సుందరరామయ్యకు పట్టరాని కోపం వచ్చింది.

ఆ వెర్రి ఆవేశంలో, ''ఒరేయ్,రాజారావు!'' పెద్దగా అరుస్తూ వెళ్ళి చేతికర్ర పైకి ఎత్తాడు విసురుగా.

అంతే ! కాసేపటివరకు ఆ ఎత్తిన చెయ్యి ఎత్తినట్లే ఉండిపోయింది. తర్వాత చేతిలోని కర్ర జారి క్రిందపడటం, ఆ వెంట ఆయన కూడా నేలకు ఒరగటం జరిగిపోయింది క్షణాల మీద.

అంతా అయోమయంగా ఉంది అమృతకు. సుందరరామయ్య అలా బిళ్ళ బీటుగా క్రింద పడి పోవటం చూసిన ఆమెకు కొంతసేపు కాళ్ళు చేతులు ఆడలేదు. తర్వాత వెళ్ళి అతడి తలను ఒళ్ళో పెట్టుకొని, ''ఏవండీ, ఏమైందీ ?'' అని అడిగింది. కానీ సమాధానం చెప్పే స్థితిలో లేడు సుందరరామయ్య. గొప్ప బాధ ననుభవిస్తున్నట్లు శూలికలు తిరిగిపోతున్నాడు.

ఇక ఏమాత్రం జాగుచేసి లాభంలేదని, ''మధుబాబూ...'' అని అరుచుకొంటూ ఇంటికి వెళ్ళి ''మీ నాన్నగారు పడిపోయారు'' అని చెప్పింది. మధు, పద్మ, నాంచారమ్మ అందరూ హడావిడిగా, ఆందోళనగా దేవాలయం దగ్గిరికి వచ్చారు.

మరు నిమిషంలో చుట్టు ప్రక్కల జనం కూడా ప్రోగయ్యారు. అందరూ కలిసి సుందర రామయ్యగార్ని ఇంటికి చేర్చారు.

స్థానికంగా ఉండే ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌ను తీసుకువచ్చారు. అతడు సుందర రామయ్య నాడిని పరీక్షించి పెదవి విరిచాడు. ఐనా మానవ ప్రయత్నం చేయాలికద? ఏవో ఇంజక్షన్‌లు, మందులు ఇచ్చాడు. అలా ఒక గంట గడిచింది. తర్వాత,

''మాయదారి గుండెపోటు, బంగారంలాంటి మనిషి సుందరామయ్యగార్ని పొట్టన పెట్టుకొంది''— అక్కడి అందరినోటా ఇదేమాట వినిపించింది అప్పుడు.

22

అమృత ప్రయాణం చేస్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రయిన్ వెలుగు తోరణంలా ముందుకు దూసుకుపోతోంది. అది విజయవాడ మీదుగా హైద్రాబాద్ వెళ్తుంది. ఎందుకైనా మంచిదని రైలు గమ్యస్థానం వరకు టిక్కెట్ తీసుకుంది ఆమె.

కంపార్టుమెంట్‌లో తోడుగా అంతమంది ప్రయాణికులు ఉన్నా ఒంటరితనాన్నే అనుభవిస్తూ— కిటికీలోంచీ బయటి శూన్యంలోకి చూస్తోంది. రాత్రి సమయం అవటంమూలాన అంతా చిమ్మచీకటి. ఏమీ కనిపించకపోయినా అటే వెర్రిగా చూస్తున్న అమృతను— ఎదురు బెంచీమీద కూర్చున్న ఒక యువకుడు గమనించాడు. ప్రస్తుత ఆమె మనస్థితిని కొంతలో కొంత అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లున్నయ్ అతడి చూపులు.

'నిజంగా తనేమిటి, తన జీవితం ఏమిటి?' మొదటిసారిగా తనను గురించిన ఆలోచన కలిగింది అమృతకు. ఇంతవరకు తనకు ఎదురైన పరిస్థితులు, జరిగిన సంఘటనలు అన్నీ సినిమా రీలులా తిరిగి కాసేపు బాధపెట్టాయి ఆమెను.

చివరికి తను అందర్నీ వదులుకొని, గమ్యం ఎరుగకుండా ఇంటినుంచీ బయలుదేరి రావలసి వచ్చింది—అమృత కళ్ళు ఒక్కసారిగా చెమర్చాయి. మనసు కొద్దిగా వెనక్కు మళ్ళింది.

* * *

సాంప్రదాయాలకు, సాంఘిక కట్టుబాట్లకు మానవ సహజీవనానికి ప్రతీకలు మన పల్లెటూళ్ళు. అక్కడ నీతి ఉంది, న్యాయం ఉంది. అవినీతి అన్యాయాలను సహించి ఊరుకోదు గ్రామ సమాజం. ఈ సమాజానికి పర్యాయ పదమే లోకం. దీనికి చాలా సందర్భాలలో దృష్టి పనిచెయ్యదు. చెవులే ముఖ్యంగా భావిస్తుంది. దానికి వినిపించేదే నిజం. ఆ నిజాన్నే తననోటితో ఎలుగెత్తి చాటుతుంది. అమృత విషయంలో జరిగింది అంతే.

సుందరరామయ్య కన్ను మూసిన కొన్ని గంటల వ్యవధితోనే ఆ ఊళ్ళో ఒక పుకారు లేచింది. ఆయన రెండవ భార్య అమృత, తమ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన కుర్రాడితో పవిత్రమైన దేవాలయంలో తప్పుడు పని చేయ బోయింది. అది కళ్ళారా చూశాకే గుండె ఆగి చనిపోయాడు సుందరరామయ్యగారు ! ఈ పుకారును లేవదీసింది ఎవరోకాదు. వాళ్ళ ఇంటి చిన్న పాలేరు పానకాలే.

'ఇదంతా నిజమేనట్రా ?' అని వాణ్ణి ఎవరైనా నిలదీసి అడిగితే, 'పచ్చి నిజం బాబూ ! నా రెండు కళ్ళతో చూచాను ! ఒంట్లో బాగా వేడిచేసి రాత్రి నిద్రపట్టలేదు... ఒక రాత్రివేళ చూద్దునుగద — అమృతమ్మగారు లేచి గుడి వైపు వెళ్ళింది. ఆ వెనకే ఇంటికి వచ్చిన చుట్టపు కుర్రాడు రాజారావు లేచి వెళ్ళాడు. వాళ్ళిద్దరు వెళ్ళిన కాసేపటికి అయ్యగారు లేచి కూర్చున్నారు. ఏమిటో అనుమానం అనిపించింది గామలు. చేతి కర్ర పుచ్చుకొని ఆయనా వెళ్ళారు దేవాలయానికి. అంతే ! గుండెపోటు వచ్చి అక్కడే పడిపోయారు అయ్యగారు. ఎంత పాడు పని జరక్కపోతే ఆయన అర్ధంతరంగా అలా ఐపోతారు ?' అంటూ వాడు తనకు తెలిసిన యదార్థాన్ని నొక్కి వక్కాణించి చెబుతున్నాడు. ఇంటి పాలేరు అంత ఇదిగా చెబుతుంటే ఎవరు మాత్రం నమ్మక ఏం చేస్తారు ? దీనిమీద రకరకాల వ్యాఖ్యానాలు.

ఒక అమ్మ కథ

'మొదట్నుంచీ ఊళ్ళో అంత మంచిని సంపాదించుకున్న సుందరరామయ్యగారికి చావుదలకు లావు దుఃఖంలా— రెండోపెళ్ళి చేసుకోవాలని ఎందుకు బుద్ధిపుట్టిందో ?'

'పైకి అట్లా కనిపిస్తుందిగాని ఆ అమ్మాయీ పెద్ద రంగుల రాణే... .పడుచు పెళ్ళాం పెట్టే పోరు భరించలేకే సుందర రామయ్యగారు సాంప్రదాయాన్ని కాదని చదువుల కోసంమని ఆవిడగార్ని పట్నం పంపి ఉంటారు. బయటికి పొక్కనీయలేదుగాని పట్నంలోనూ పెద్ద భాగోతమే నడిపిందట ఈ అమ్మ.'

'ఔనట... ఈ అమ్మ ప్రవర్తన నచ్చకే కన్నతండ్రి అసహ్యించుకొని ఎటో వెళ్లి పోయాడట ఉన్నఊరొదిలిపెట్టి.'

'పాపం, ఈవిడ మూలంగా బంగారం లాంటి సుందరరామయ్యగారూ పోయారు, ఆ ఇంటి పరువూ పోయింది !'

'ఈమెకూ ఆ చుట్టాలబ్బాయికీ ఎంత కాలంగా సంబంధం ఉందో ?'

'వయసులో పిటపిటలాడిపోతోంది. ఆ ఒక్క అబ్బాయే నికరం అని ఏముంది ?'

అలాంటి వ్యాఖ్యానాలు ఆ ఊళ్ళో నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నయ్. ప్రత్యక్షంగానో అవి మధు వింటునే ఉన్నాడు. అమృతకూ తెలుస్తూనే ఉన్నయ్. లోకం ఇంత కాలానికి యదార్థాన్ని గుర్తించి మాట్లాడుతోందని సంబరపడుతోంది పద్మ. 'ఆడది అలుసిస్తే ఏ మగాడైనా ఏం చేస్తాడు ?' అని తన అన్న రాజా నిర్వాకాన్ని సమర్ధించుకొంటోంది ఆమె. ముసిలావిడ నాంచారమ్మ 'ఈ ఇంటికి ఇదేం చేటు కాలం వచ్చిందిరా భగవంతుడా' అని ఒకటే గగ్గోలుపెడుతోంది. కాకపోతే అందరిలా తొందరపడి కోడల్ని నిందించలేకపోతోంది. అలా అని సమర్ధించి మాట్లాడనూలేకపోతోంది.

సుందరరామయ్యగారు పోయిననాడు ఎక్కడ ఉన్నాడో రాజారావు తెల్లవారి మరి కనిపించలేదు ఊళ్ళో ఎవరికీను.

భర్తపోయిన మూడవనాడే అమృత మెట్రిక్ పరీక్షాఫలితాలు తెలిశాయి. ఫస్ట్ క్లాసులో ప్యాసైంది. అందుకు సంభంధించిన ఆనందం ఏమాత్రం మిగలలేదు ఆమెకు. తండ్రిపోయి అంత విచారంలో ఉన్నా మధుకు మాత్రం అంతర్గతంగా కొంత తృప్తి అనిపించింది. ఐతే అమృతను అభినందించలేకపోయాడు బహిరంగంగా.

మరోముఖ్యవిషయం అందరు స్త్రీలలా సనాతనకాలం నుంచీ ఆనవాయితీగా వస్తున్న ఆచారం భర్తపోయాక పసుపు కుంకుమలు తీసి వేయటానికి నిరాకరించింది అమృత !

'కట్టుకున్న భర్త పోయారు కాబట్టి ఆయన కట్టిన తాళిబొట్టును తీసివేయటానికి నాకు ఎలాంటి అభ్యంతరంలేదు. ఐతే ఈ పసుపు, కుంకుమ, గాజులు వీట్నీ భగవంతుడు ఆడదానికి వరంగా ప్రసాదించినవి. అటువంటప్పుడు ఇది ఎందుకు తీసివేయాలి నేను ?' అని నిలదీసి అడిగింది పెద్దలను.

ఆమె ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు సూటిగా. కానీ చాలామంది ముక్కు మీద వేలువేసుకొని, 'ఇదెక్కడి ఆడది, ఇదెక్కడి చోద్యం !' అన్నారు. కొంతమంది, 'అలంకారాలుపోతే రంకు సాగదేమోనని భయపడుతోంది గామలు !' అని వ్యాఖ్యానించారు.

'స్త్రీ జాతిలో ఇదొక పెద్ద తిరుగుబాటు. ఆమె వాదన సహేతుకమే !' నాగరికులైన కొందరు యువతులు అమృత చర్యను అభినందించారు.

'పిన్నీ ! నీ వాదనను నేను కాదనను. నాన్నగారికీ, నీకూ మధ్య ఉన్నది కేవలం మూడు ముళ్ల బంధమేనని నాకూతెలుసు. కానీ, ఇది లోకం. నిజానిజాలతో దానికి పని లేదని నీకూ తెలుసు. మనసులో లేకపోయినా కేవలం ఆచారం కోసం, అందరినోళ్లూ మూయించటంకోసం నువ్వు సంప్రదాయాన్ని పాటించక తప్పదు. ప్రస్తుతానికి ఇది తాత్కాలిక పరిష్కారం' అంటూ మధు ప్రాధేయపడ్డాడు.

ఇటీవల రాజమండ్రిలో ప్రశాంతి ఎడ్యుకేషనల్ అండ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ (కోరుకొండ) వారి ఆధ్వర్యంలో 'భామా కలాపం' నృత్య ప్రదర్శన ఇచ్చిన కుమారి పి.హెచ్. విజయలక్ష్మి.



అసలే దిగులుతో కృంగిపోతున్న అతడికి కొంత ఊరట కలిగించటంకోసం తల వగ్గింది అమృత.

* * *

అమృత అదివరకటిలా ఆ ఊళ్లో మనశ్శాంతిగా ఉండలేకపోతోంది. అడుగడుగునా ఆంక్షలు, ఆక్షేపణలు !

'నువ్వు అర్ధరాత్రి అపరాత్రి దేవాలయానికి వెళ్ళటానికి వీలులేదమ్మాయ్' అని నిక్కచ్చిగా చెప్పేసింది నాంచారమ్మ. పోనీ దైవమందిరం ముందు కొంతసేపు ఏకాగ్రతగా ఇంట్లోనైనా కూర్చుందామంటే 'చెప్పేవి శ్రీరంగనీతులు,చేసేవి వెధవపనులు ... ఇంతమంది 'ఛీ' అన్నాక బతికేకంటే చావటం మేలు ఎందులోనైనాపడి. నాకే ఇటువంటి పరిస్థితి ఏర్పడితే తప్పకుండా ఆదేపని చేసేదాన్ని' అంటూ పద్మ ఒకటే ఎత్తిపొడుపు మాటలు. మధు పరిస్థితి చూద్దామంటే మరీ దారుణంగా ఉంది. అతడు ఇంటి పట్టున క్షణం కూడా ఉండటంలేదు. ఉన్నంత సేపైనా పరధ్యానంగా ఉంటాడు. అవసరమైన దానికీ కానిదానికీ చిరుబురులాడుతూంటాడు. సరిగా తిండి కూడా తినటం లేదు. మనవణ్ణి గురించి నాంచారమ్మ కన్నీరు పెట్టుకోని రోజు లేదు. 'ఇక్కడి అందరి మనస్తత్వాలు మారిపోవటానికి కారకురాలుతానే. తను ఇక్కణ్ణుంచీ ఎక్కడైనా వెళ్ళిపోతేనేగాని ఈ ఇల్లు, ఇంట్లోని మనుషులూ బాగుపడరు.' అన్న నిర్ణయానికి త్వరగానే వచ్చేసింది అమృత.

''మధుబాబూ ! నన్ను గురించి నువ్వు బాధ పడనంటే నా మాట ఒకటి చెబుతాను' అంది ఓ రోజు మధు ఒంటరిగా ఉండటం చూసి.

'చెప్పు పిన్నీ. ఇందులో బాధ పడేది ఏముంది ?' అన్నాడు మధు పొడిపొడిగా.

నాకు ఇక్కడ మనశ్శాంతి దొరకటంలేదు. అందుకే కొంతకాలంపాటు ఎక్కడైనా వెళ్ళిపోవాలని అనుకుంటున్నాను. చెప్పపెట్టకుండా వెళ్తే నువ్వు మరీ దిగాలుపడిపోతావని చెబుతున్నాను.'

పిన్ని కొంత కాలంపాటు అలా చేస్తేనే బాగుంటుందని అనిపించిన మధు,

'సరే పిన్నీ. నువ్వు ఎటో వెళ్ళటం దేనికి? తెలివిగలవాడు ఆనంద్. వాడు ఊహించి ముందే చెప్పాడు నీకు, 'ఏ కష్టం కలిగినా నన్ను మరిచిపోకు పిన్నీ' అని. ఆనంద్ మాటే నిజమైంది. నువ్వు వాడి దగ్గరకు వెళ్ళు పిన్నీ. అక్కడ ఉంటుంటే నీకు అవసరమైన డబ్బు పంపిస్తుంటాను. కొంతకాలం గడిస్తే పరిస్థితులు అవే కుదుట పడతయ్. తిరిగి ఇక్కడికే వచ్చేద్దుగాని' అంటూ తన ఆమోదం తెలిపాడు.

(ఇంకా ఉంది)


ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
Prem
REFRESHING SOAP
PREM
గులాబి మరియు ఆకుపచ్చ
రంగులలో లభించును
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads M-1783

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎ. డి. – గంజాం

అక్కయ్యా ఆడది కోరుకనే వరాలు రెండే రెండు. అవి ఏమిటి?

★ అవి ఆ ఆడదాన్ని పట్టే కదా వుంటాయి. అందరాడవాళ్ళూ ఒక్కలాగే కోరుకోరు!

ఎస్. వి. ఆర్. – గోదావరిఖని

నాకు పెళ్ళయి నాలుగేళ్ళయింది. నేను చేసుకున్న భార్యలో లోపాలు : చూడటానికి అందంగా వున్నా వంట రాదు. డ్యూటీ టైము అయిపోతున్నా నన్ను లేపదు..... ముగ్గులు అసలే రావు.... ఎప్పుడూ పుట్టింటి ధ్యాసే.

★ మీరు అదృష్టవంతులు. వంట రాని అందమైన భార్య– ఏం పెట్టినా అమృతంలా తినాలి! ఇక ముగ్గులంటారా? ఏ గీత గీస్తే ముగ్గు కాదు?! యివో దోషాలా? (నాకిప్పటికీ వంట రాదు – పెళ్ళయి ముప్పయ్యేళ్ళవుతోంది! ఎప్పుడూ ముగ్గెట్టిన పాపాన పోలేదు... ఏం మేం సర్దుకుపోవటంలే!!)

ఎస్. ఎమ్. – మద్రాసు

ఆడపిల్లలు చిన్నప్పటి నుంచి బొట్టు పెట్టుకుంటారు. భర్త పోతే బొట్టు తీయిస్తారు. తెల్ల బట్టలు కట్టిస్తారు.... మరీ....

★ ఈ రోజుల్లో యిలాంటి దారుణాలు జరగడం లేదనుకుంటాను. అసలే భర్త పోయి కుమిలి పోతున్న స్త్రీ మీద ఇటువంటి దరిద్రపు ఆచారాలని జరిపించడం క్షమించరానిది. మనిషిని కష్టంలో ఓదార్చాలిగాని ఆచారం పేర హింసించకూడదు.....

బి. కె. ఆర్. ఆర్. – ఏలూరు


విజయనిర్మలగారి మీద మీ అభిప్రాయం ఏమిటి?

★ మంచి మనిషి. నిగర్వి.

వి. ఎస్. ఆర్. ఆర్. – బొబ్బిలి

స్త్రీకి స్వేచ్ఛ లేదని మగాడిపైబడి ఏడ్చే కంటే ప్రతి స్త్రీ తనే స్వేచ్ఛాయుతంగా వ్యవహరించవచ్చు కదా? ఎవరు వద్దన్నారు?

★ ఎవరూ వద్దనరు – కాని 'ఏం కందిపప్పు పచ్చడి చేయమంటే కొబ్బరి కాయ చేశావని తన్నే మొగుళ్ళున్నప్పుడు –' ఏం వండనండీ! అని అడక్కుండా ఏ భార్యైనా స్వతంత్రించి – వ్యవహరిస్తుందా?! అందరూ యిలా లేరు కనుకనే యీ మాత్రమైనా స్త్రీ మనిషిలాగా వుంటుంది. లేకపోతే పరిస్థితి ఎలా వుండేదో – వూహించండి. మగాళ్ళమీద పడి హక్కులకోసం ఏడవడం శుద్ధ దండగ. మనిషికి వ్యక్తిగతంగా – పౌరుషం వుండాలి. అది లేకనే ఆడవాళ్ళు భంగపడేది. అది లేకుండా చేయాలనే మగవాళ్ళు తాపత్రయ పడేది?



డి జె. ఆర్. – హైదరాబాదు

ఒకసారి ఆకర్షణకు లొంగిపోతే యిక అది మనని వీడించదుకదా, కె. రా. గారూ?

★ పొరపాటు నాయనా, ప్రలోభం అన్నది – కొత్త వాడిగా ప్రవేశించి అతిథిగా ఊగిసలాడి – చివరకు యజమాని అయి మనని లోబరచుకుంటుంది.

టి. ఎమ్ – మారంపల్లి

ఈ మధ్య పల్లకిలో పదబంధాన్ని నిర్వహిస్తున్న వీరేంద్రనాథ్‌పై విమర్శిస్తూ ఉత్తరం వ్రాశారు. తోటి రచయిత ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందుతుంటే చూసి ఓర్వలేదు. ఇలాంటి యీర్ష్య స్త్రీలలో ప్రత్యేకంగా కనబడుతుంది. ఎంచేత?

★ మీ హ్రస్వ దృష్టి – కారణం. అయినా ఆంధ్రలో కె. రామలక్ష్మి ఒక్కతేనా?! తూ. గో. జి నిండా వాళ్ళే వుంటారు!... నే నెప్పుడూ పద బంధాల జోలికి పోను – అవి తెలివైన వాళ్ళ కోసం అని నా నమ్మకం!!

శ్రీనివాస్ – భువనేశ్వర్

ఆదర్శాలని ఆశయాలని చేతకాని తనంగా జమ కట్టే మన సమాజంలో మనిషి ఆదర్శాలకి గుర్తింపు ఎక్కడ?

★ ఆదర్శాలని, ఆశయాలని ఆచరించే వాళ్ళు – వాటిని జీవితంలో ఓ భాగంగా చేసుకుంటారే గాని కోడిలా చూరెక్కి కూయరు. ఇలా కూసే వాళ్ళు ఎక్కువ అయి – వీటి విలువ గుర్తించడం మానేయడం జరుగుతుందేమో అనిపిస్తుంది నాకు. □

మగమనసు

కాకాని కమల

సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది.

సూర్యుడు పూర్తిగా పశ్చిమాద్రికి కృంగి పొయ్యాడు

క్రమంగా సంజె చీకట్లు అల్లుకుంటున్నాయి

దీపాలు వెలిగించే వేళ....

దక్షిణ దిశగా చల్లని గాలి తిరిగింది.

పసి బిడ్డని గుండెకి హత్తుకున్నట్లు సుష్మ చేతిలో పుస్తకాలు పట్టుకుని రోడ్డు వారగా నడుస్తూ "ట్యూషన్" కి బయలు దేరింది.

ఆమె ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయి, ఈ సంవత్సరమే బి కామ్. లో జాయిన్ అయ్యింది.

నిజానికి ఆ అమ్మాయికి కామర్సు బాగా "డ్రై" సబ్జెక్టు.

అయినా సరే భయపడకుండా పట్టుదలగా అందులో జాయిన్ అయ్యింది.

ఎమ్. కాం. చేసి ఆ తరువాత ఎమ్. బి ఎ కూడా పూర్తి చేసి అందరూ ఆడవాళ్ళే నిర్వహించే విధంగా ఏదైనా ఒక చిన్న బిజినెస్ "ఫర్మ్" స్థాపించాలని ఆమె ఆశయం.

డా. రవీంద్ర, అనూరాధ దంపతులకి రత్నాల్లా ఇద్దరే పిల్లలు

పెద్ద కొడుకు రమేష్ విశాఖలో మెడిసన్ ఆఖరి సంవత్సరంలో వున్నాడు.

తరువాత సుష్మ.

"ఆడపిల్ల కదా?" అని కూతుర్ని ఏ విషయంలోనూ చిన్న చూపు చూడలేదు.

సుష్మ ఆశయ సాధనలో శాయ శక్తులా ప్రోత్సాహాన్ని అందించాడు తండ్రి.

ఒక్కర్తే కూతురు కావటంలో తల్లికి తండ్రికి ఆ అమ్మాయి అంటే ఎంతో అపురూపం

సుష్మకి కామర్సు బాగా "డ్రై" సబ్జెక్టు కావటంతో కాలేజీలో చేరినప్పట్నుంచి కూతురికి ట్యూషన్ చెప్పించాలని చూస్తున్నాడు రవీంద్ర

అయితే తెల్సివున్న ఇద్దరు ముగ్గురు లెక్చరర్స్ ఇళ్ళు చాలా దూరంగా వుండటంతో సాయంత్రాలు ఆడపిల్లని అంత దూరం ఎలా పంపించటమా అని తర్జన భర్జన పడుతున్నాడు. పైగా వాళ్ళ రూల్సు దృష్ట్యా ట్యూషన్లు చెప్పకూడదట!

కేవలం ట్యూషన్‌లే కాక ఎప్పుడైనా ఇంటికి వచ్చి తెలియనివి అడిగితే చెప్తామని, అంతేగాని ఫీజు తీసుకుని ప్రైవేటుగా చెప్పటం మాత్రం కుదర్దని ఆ లెక్చరర్సు రవీంద్రకి తమ నిస్సహాయతని తెలిపారు.

కాని సుష్మ రోజూ ఓ గంట ట్యూషన్ చెప్పించుకోవాలన్న అభిప్రాయంతో వుంది.

కూతురికి చదువు చెప్పటానికి ఒక మంచి ట్యూటర్ కోసం గాలిస్తున్నాడు రవీంద్ర.

సరిగ్గా అలాంటి సమయంలో ఆపద్బాంధవుడిలా శ్యాం కుమార్ ఒక రోజు డా. రవీంద్ర ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు


అతను ఎమ్ కామ్ స్థానికంగా వున్న ఒక కమర్షియల్ బ్యాంకులో కొత్తగా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్‌లో మొదటి సారిగా ఉద్యోగానికి వచ్చాడు

శ్యాం చిన్నాన్న డా. విశ్వం, రవీంద్ర మంచి ఫ్రెండ్సు. కల్సి చదువుకున్నారు

అందుకే విశ్వం ఉత్తరం రాసి శ్యాంకి ఇచ్చి రవీంద్రని కల్సుకోమని మరీ మరీ చెప్పి పంపించాడు .

"కొత్త ప్రదేశాల్లో కాస్త తెల్సున్న వాళ్ళు ఎవరైనా వుండటం మంచిదికదా?" అన్న అభిప్రాయంతో

శ్యాం కుమార్ వస్తూనే ఒక హొటల్‌లో దిగి బ్యాంకులో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి ఆ మర్నాడు



బై లక్ . అదే వీధిలో సందు చివర వున్న ఆకు పచ్చ మేడలో పైన రెండు గదుల చిన్న వాటా ఖాళీగా వుండటం, ఆ ఇంటి వాళ్ళు రవీంద్రకి బాగా తెల్సి వుండటంచేత, శ్యాం కుమార్ ఆ పోర్షన్ ఖాయం చేసుకుని ఆ మర్నాడే హొటల్ గది ఖాళీ చేసి అందులో వచ్చి చేరటం అంతా రెప్పపాటులో యాదృచ్ఛికంగా జరిగిపోయింది.

శ్యాం కుమార్ ఎమ్. కామ్ అని తెలియగానే రవీంద్ర మాటల సందర్భంలో కూతురు గురించి చెప్పినపుడు . అతను ఎంతో సహృదయంగా –

"వేరే ట్యూషన్ ఎందుకు? సుష్మ నాకు చెల్లెలు లాంటిది. మీకు ఏ విధమైన అభ్యంతరం లేకపోతే రోజూ ఈవెనింగ్స్ పంపండి నాకు తోచిన విధంగా ఆ సబ్జెక్ట్సు గురించి ఎక్స్ప్లెయిన్ చేస్తాను." అన్నాడు

శ్యాం కుమార్ వున్నతమైన చదువు, సంస్కారం వున్నవాడు గౌరవనీయమైన ఉద్యోగంలో వున్నాడు. బాహ్యంగా కూడా ఎంతో నమ్రతగా.... మంచి వాడులా వున్నతమైన వ్యక్తిత్వంతో అనిపిస్తాడు.

అందుకే మరో ఆలోచన లేకుండా సుష్మని పిలిచి రోజూ సాయంత్రం కాస్సేపు అతనివద్దకి వెళ్ళి తెలియనివి చెప్పించుకోమని అప్పటి కప్పుడే కూతురికి చెప్పేశాడు.

అప్పట్నుంచి సుష్మ కాలేజినుంచి రాగానే స్నానం చేసి ఫ్రెష్ అయి కాస్సేపు రెస్ట్ తీసుకుని సందు చివర మేడ మీద భాగంలో వుండే అతని ఇంటికి ట్యూషన్కి వెళ్ళటం ప్రారంభించింది.



సాయంత్రం డా. రవీంద్ర ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు

కుశల ప్రశ్నలు అయిన తరువాత తనకి వుండ-టానికి ఎక్కడైనా ఒక చిన్న పోర్షన్ వుంటే చెప్పమని కోరాడు

అప్పటికి అతను కూడా బ్యాంకు నుంచి వచ్చేస్తాడు

ఉదయం పూట ఇద్దరికి కుదరదు.

వచ్చిన కొద్ది రోజుల్లోనే శ్యాం కుమార్ వాళ్ళింట్లో ఒకడిగా కల్సిపోయ్యాడు

ప్రతీ ఆదివారం రవీంద్ర ఇంట్లోనే డిన్నర్ చేసేవాడు కొడుకు దూరంగా వుండటంతో అతనిలో కొడుకుని చూసుకుని తృప్తి పడేది అనూరాధ

దానికి తగినట్లే శ్యాం సుష్మని సిస్టర్ అని పిలిచేవాడు కాని సుష్మ, గౌరవంగా అతన్ని "మాష్టారూ" అనేది కాలేజీలో చేరిన దగ్గర్నుంచి "నేను ఎమ్ కామ్ చెయ్యగలనా?' అని ఎంతగానో భయపడింది సుష్మ

కాని గత నాల్గు నెల్లనుంచి శ్యాం దగ్గర ట్యూషన్ మొదలయ్యాక ఆమేలో భవిష్యత్తుపై ఆశలు చిగిరించాయి

ఎమ్ కామ్. చెయ్యగలనన్న విశ్వాసం బలపడింది

అతను ఆ వూళ్ళో వున్నంత కాలం అతని దగ్గర ట్యూషన్ మానకూడదని నిర్ణయించుకుంది

శ్యాం కుమార్‌కి మంచి టీచింగ్ పవర్ వుంది. అతను లెక్చరర్ అయితే బాగా షైన్ అయివుండేవాడన్న వున్నతమైన అభిప్రాయం ఆమెలో బలపడింది.

సుష్మకి చదువు తప్పించి వేరే యాక్టివిటీస్ లేవు.

సుష్మ రెండు జళ్ళతో సన్నగా కాస్త పొడవుగా అర విరిసిన మల్లె మొగ్గలా నాజూగ్గా వుంటుంది.

ఆ అమ్మాయిని చూస్తే "ఇంత సుకుమారంగా వుంది కదా? ఈ పిల్ల ఏం కష్టపడగలదా?" అనిపిస్తుంది

కాని ఆమెలో పట్టుదల చూస్తే ఎలాంటి వాళ్ళూ ఆశ్చర్యపోక మానరు.

అందుకే తండ్రి తరచూ "సుష్మా! నిన్ను ఫారిన్ పంపిస్తాను తల్లీ! నువ్వు అక్కడే ఎమ్ బి ఎ. పూర్తి చేద్దువు గాని" అంటు వుంటాడు ఆప్యాయంగా

అందరూ లేడీ స్టాఫ్‌తో అప్పుడే తను ఒక చిన్న బిజినెస్ ఫర్మ్ నడుపుతున్నట్లు అపు డపుడూ తియ్యని కలలు వస్తూ వుంటాయి సుష్మకి.

చిన్నగా నవ్వుకుంటూ ఆలోచన్లమధ్య శ్యాం కుమార్ ఇంటి ముందుకి వచ్చేసింది సుష్మ

ఆ రోజు కాలేజిలో స్టూడెంట్సు మీటింగ్ వుండటంతో రోజూ కంటె అర గంట ఆలస్యం అయింది.

"మాస్టారు ఏమంటారో ఏమిటో?" అనుకొంటూ హడావుడిగా మేడ మెట్లు ఎక్కి అతని గది ముందుకి వచ్చి హుషారుగా కర్టెన్ తొలగించుకు గదిలోకి అడుగు పెట్టబోయిన సుష్మ గభాల్న ఆగిపోయింది.

లోపల గదుల్లోంచి ఎవరివో గొడవగా మగవాళ్ళ కంఠాలు... నవ్వులు... మాటలు... ఆ మాటల మధ్య "సుష్మ" అంటూ తన పేరు వినిపించటంతో హతాశురాలు అయ్యింది సుష్మ

ముందుకి పడబోతున్న అడుగుని అతి కష్టంతో వెనక్కి తీసుకుని గడప దగ్గరే ఆగిపోయింది. ..

"ఏంటి గురూ! ఇంకా రాలేదు నీ లవ్వరు మాక్కూడా ఆ డాషింగ్ గర్ల్‌ని పరిచయం చేస్తానన్నావు కదా అని ఎంతో ఆశ పడి వచ్చాం "

శ్యాం చిన్నగా నవ్వాడు

"బహుశా రాదేమో . అప్పుడప్పుడూ మానేస్తు వుంటుంది "

"మన విశ్వనాధన్ చెప్పాడు పిల్ల జాంపండులా వుంటుందిట. కదా?"

మళ్ళీ చిన్నగా నవ్వులు.

"ఏంటి గురూ! మొఖం అలా పెట్టావ్ ఇంకా లైన్లోకి లాగలేదా?" జాలిపడ్డాడు శంకర్రావు

శ్యాం కాలర్ సవరించుకుని వ్యంగ్యంగా నవ్వాడు.

"నేను లాగేదేమిటి? అదే నన్నే లాగుతుంటే?"

"వ్వాట్స్ .. "

"ఎస్. లేకపోతే వయసొచ్చిన పిల్ల తనకిగాతను నాగదికి రావటం ఏమిటి? ఆ రెండుజళ్ల . షోకులు .. ట్రిమ్మ్గ మున్తాబు – ఇదంతా చదువు మీద శ్రద్ధ అంటే నేను చచ్చినా ఒప్పుకోను. కట్నం లేకుండా, నన్ను పెళ్లి చేసుకోవాలని చూస్తోంది"

అంతే! గడప అవతల వున్న సుష్మకి తలంత గిర్రున తిరిగినట్లు అయింది

మనసుకి శరాఘాతం తగిలినట్లు బాధతో విలవిల్లాడి పోయింది

ఇంకా లోపల్నుంచి ఏవో మాటలు జోరుగా వినిపిస్తూనే వున్నాయి

కాని అవేమి వినిపించటం లేదా సుష్మకి అప్పటికే ఆమె మెదడు స్థంభించిపోయింది గుండె వేగంగా కొట్టుకుంటుంటే భయ భ్రాంత అయి

ధర్మపథం

– బులుసు వేంకట రమణయ్య



అనవసరపు జోక్యం

ఇతరుల విషయంలో జోక్యం కలిగించుకుంటే. దానివల్ల అనర్థమే కలుగుతుంది. మనం మంచిని కోరియే – ఇతరులకు ఉపకారం చేయదలచియే జోక్యం కలుగజేసికోవడం జరిగినా ఎదటి వాళ్లకు మనపై అది కోపాన్ని కలిగిస్తుంది. ఆ కోపంవల్ల మనకు అపకారమూ జరుగుతుంది. మన సంకల్పమూ నిష్ప్రయోజనమౌతుంది. తండ్రి ఆదేశాన్ననుసరించి లంకా రాజ్యాన్ని పాలిస్తున్న కుబేరుడు ఒకనాడు తండ్రిని దర్శించడంకోసం పుష్పక విమానంపై అతి వైభవంతో వచ్చాడు. అప్పుడు. కుబేరుని సవతి తల్లి కైకసి, అతన్ని చూసి, అసూయపడి, అతనికంటె గొప్పగా వుండాలని కుమారుడు రావణుని ప్రోత్సహించింది. బ్రహ్మవరం వల్ల అపార శక్తి సంపన్నుడైన రావణుడు దిగ్విజయం సాగిస్తూ. తన మంత్రుల ప్రోత్సాహం వల్ల కుబేరుని లంకను స్వాధీనం చేసుకోదలచి "లంకను అప్పగించవలెనని, లేకపోతే బలప్రయోగంవల్ల దానిని స్వాధీనం చేసుకోవలసి వస్తుందనీ, కుబేరుడికి రాయబారం పంపాడు. తమ్మునితో కలహం ఎందుకని, కుబేరుడు లంకను వదలివేసి, తన తండ్రి వద్దకు పోయి, తానెక్కడ నివసించవలసినదీ, చెప్పవలసినదని అడిగాడు.కైలాసానికి వెళ్లవలెననీ, మహేశ్వరుని ఆదరం, మైత్రీ లభిస్తుందనీ చెప్పగా, కుబేరుడక్కడకి వెళ్లి శివుని ఆశ్రయానుగ్రహాలను పొంది సుఖంగా అన్నాడు.

రావణుడు లంక నేలుతూ, లోకకంటకుడై, మానవులతోపాటు దేవతలను కూడా హింసిస్తూ వుండగా, కుబేరుడు ఊరక ఉండక, జోక్యం కలుగజేసుకుని, రావణునికి హితాన్ని ఉపదేస్తూ "ఇతరులను హింసించడం ధర్మంకా"దని రాయబారం పంపాడు. సహజక్రూరుడైన రావణుడు, తనకు ఇతరులు ఉపదేశించడమా? – అని కోపించి, ఆ రాయబారిని చంపి, కుబేరుని అలకా నగరం పైకి దాడి వెడతాడు. కుబేరుడు ఓడిపోయి పారిపోయాడు. రావణుడు, విలువవైన వాటితో సహా పుష్పక విమానాన్ని తీసుకుని లంకకు వెళ్లిపోయాడు. అనవసరపు జోక్యంవల్ల కుబేరుడు పుష్పక విమానాన్ని పోగొట్టుకోవలసి వచ్చింది. □

"కెవ్వున" కేక వెయ్యబోయి బలవంతాన గుండెల్లోనే అదుముకుంది.

గదిలోంచి వినిపిస్తున్న వీళ్ల వెకిలి నవ్వులు ..... అసభ్యకరమైన మాటలు గుండెని విష బాణాల్లా గుచ్చుకోసాగాయ్.

తలంత గిర్రున తిరుగుతున్నట్టు, కాళ్ల కింద భూమి జారిపోయి తను పాతాళంలోకి కృంగిపోతున్నట్టు .... అనిపించింది.

కళ్లనుంచి ధారా పాతంగా కన్నీరు జారిపోతుంటే తూలి పడకుండా గోడని ఆసరా చేసుకుని నిలద్రొక్కుకుంది.

"..... ...."

".... సిస్టర్ .... అని పిలుస్తు తన గురించి ఫ్రెండ్సుతో ఇంత అసహ్యంగా ప్రచారం చేస్తున్నాడా?

అతడు తనకి పాటాలు చెప్పే గురువుగారు కదా? అని తను ఎంత భక్తితో ఎంతనమ్రతగా వుంటుంది? .....

.... అలాంటి తన గురించి ఇంత అసభ్యంగా ఎలా మాట్లాడగలుగుతున్నాడు? మేకతోలు కప్పుకున్న పులిలా ఇదా అతని నిజస్వరూపం?

ఛీ...........

"పైగా తను ట్యూషన్ పేరుతో అతన్ని వల్లో వెయ్యటానికి వస్తుందా? కట్నం లేకుండా పెళ్లి చేసుకోవాలని చూస్తుందా? ఛీ .....వాట్ రబ్బిష్ టాకింగ్....

ఒక్కసారి వెల్లువలా సుష్మలో ఆవేశం పొంగింది.

మొఖం అంత చెక్కు తీసిన కందగడ్డలా ఎర్రగా అయ్యింది.

అంతే!

తామసంగా ఎడం కాలి హైహిల్ షూ లాగి మరో ఆలోచన లేకుండా దూకుడుగా గదిలోకి అడుగు పెట్టింది.

టేబిల్ చుట్టూ కూర్చుని సిగరెట్లు కాలుస్తున్న ఆ ఆరుగురూ పురమని పిడుగులా మండి పడుతూ తమ వద్దకి వచ్చిన ఆ .... అమ్మాయిని చూసి బిత్తరపొయ్యారు.

సుష్మ చెప్పు పట్టుకున్న చేతిని దూకుడుగా శ్యాం మీదకి చాచి ....

"ఏరా? నేను ట్యూషన్ పేరుతో నిన్ను వలవన్నటానికి నీ గదికి వస్తున్నానా?"

నన్నా సిస్టర్ .... సిస్టర్ అని పిలుస్తావు కదా? నీ చెల్లెలు గురించి ఇలాంటి కారు కూతలు కూస్తావా? ఇదేనా నీ సంస్కారం?

కట్నం లేకుండా నిన్ను పెళ్లి చేసుకోవాలని నా ప్లానా? ....

యూ బ్రూట్ .... నీకు తెలియదేమో. మా నాన్న నీలాంటి పది మందిని కొనగల్లురా? నీ కంటే అందం చదువు, ఐశ్వర్యం, వున్న మా బావతో నాకు ఎంగేజుమెంటు ఏనాడో జరిగింది ....

. ..మీకూ నాలాంటి చెల్లెళ్లు వుండే వుంటారు. మీకూ నాలాంటి ఆడపిల్లలు పుడతార్రా యూ స్కౌండ్రల్స్ కాస్త వివేకం – సంస్కారం నేర్చుకోండి ...."

తామసంగా చేతిలో చెప్పు నేలమీద కొట్టి కాలికి తగిలించుకుని గిర్రున వెనక్కి తిరిగి పరుగులాంటి నడకతో వీధిలోకి వచ్చేసింది.


అంతవరకూ ఆ బల్లచుట్టూ విలాసంగా కూర్చున్న ఆ ఆరుగురు పురుష పుంగవులు మొగాలు నల్లగా మాడిపొయ్యాయి.

* * *

అంతే!

ఆ మర్నాడు ఉదయాన్నే ఆ మేడమీది వాటా ముందు "టులెట్" బోర్డు పెట్టాడు ఆ ఇంటి యజమాని. □

తాజ్‌మహల్ షాజహాన్ కట్టడం కాదా?



ఆంధ్ర సచిత్ర వార పత్రిక 25.5.84 సంచికలో తాజ్ మహల్ సౌందర్యం మాటున అనే శీర్షిక క్రింద డా శ్రీ గుమ్మనూరు రమేష్ బాబు ఆర్కియో మెట్రీ విజ్ఞానంవల్ల ముస్లిమ్ కట్టడమై ఉండడానికి వీలు లేదని స్పష్టంగా తెలుస్తుందని, మరియు డాక్టర్ ఇవాన్స్ విలియమ్స్ పరీక్షలవల్ల తాజ్ మహల్ షాజహాన్ మాత్రం కట్టించి యుండలేదని స్పష్టంగా తెలుస్తుందని, శాస్త్ర జ్ఞానంపై నమ్మకమున్న వారెవరూ తాజ్ మహల్ 17 వ శతాబ్దంలో కట్టబడిందంటే విశ్వశించలేరని వ్రాశారు. శాస్త్ర జ్ఞానం మానవుని నిరంతర అన్వేషణా పరిశోధనల ఫలితంగా కలియుగంలో కనీ వినీ ఎరుగని నూతన విషయాలను కనుగొని గ్రహాలమీద పరిశోధనలు జరుపుచున్నారు దానిని మానవాళి అంతా చూస్తున్నదే ఒప్పుకొంటున్నదే కానీ ప్రపంచంలో ఏ దేశ సంస్కృతిగాని, ఔన్నత్యంగాని, సాహిత్యంగాని లేక ఒక శాస్త్రవేత్తను, ఒక మత ప్రవక్తను, మతాన్ని ఒక చక్రవర్తిని, ఒక జాతి పరిణామం, ఒక స్వాతంత్ర్య పోరాటం మొదలైన వాటిని గూర్చి తెలిసికొనవలెనంటే సమ కాలీన చరిత్రకారులు, సాహితీవేత్తలు, ఆయా కాలాల్లో ఆయా పరిస్థితులను చూచిన ఇతర దేశ చరిత్రకారులు వ్రాసిన గ్రంథాలు, నాటి కాలాన శిలా శాసనములు, నాణెములు మొదలైనవి ఆధారాలు. తాజ్ మహల్‌ను కట్టించినది షాజహాన్ చక్రవర్తేనని కొన్ని వందల వేల గ్రంథాలు శిలా శాసనములు వేనోళ్ళ చాటుచుండగా తాజ్ మహల్‌ను షాజహాన్ కట్టించాడని కొందరు అభిప్రాయ పడతారు. ఈ అభిప్రాయానికి సాక్ష్యాధారాలు లేవనే చెప్పవలసి వుంది అనుట చాలా శోచనీయం.

ముంతాజ్ మరణం తరువాత దేహాన్ని 6 మాసముల వరకు చెడిపోకుండా గాజు పెట్టెలో భద్రపరిచి తరువాత ఆమె కోరికపై శాశ్వితంగా నిలచిపోయే కట్టడాన్ని కట్టుటకు యమునా నది ఒడ్డున ఆగ్రాయందలి అడవి నరికించి 42 హెక్టార్స్ ఏరియాలో కట్టించాడు షాజహాన్. దానికి మూడు వైపులనున్న తోట విశాలం మరియొక 250 ఎకరాలు వైశాల్యం గలది. సమాధి యొక్క నమూనాలను హిందూ దేశ మందలి నిపుణులే కాక పర్షియా, అరెబియా, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్ నుండి పిలువబడినారు. వారిలో మహమ్మద్ ఉస్తాద్ ఈసా ఆఫిందా అనే చిత్రకారుడు తయారు చేసిన మోడల్‌ని షాజహాను మెచ్చుకొని కొన్ని వేల బంగారు నాణెములను బహూకరించాడు పర్షియన్ చిత్రకారునికి. మహల్ నిర్మాత ప్లాన్ అంతటిని ముఖ్యంగా ఇస్మాయిల్ ఖాన్ పర్యవేక్షణలో కట్టడం జరిగింది. శ్రీ రమేష్ బాబుగారు ఇచ్చుట శ్రీశ్రీ గారి మాటలను ఉదహరించారు. తాజ్ వహల్ సౌందర్యం కన్నా ముందు ఆ తాజ్‌మహల్‌కు రాళ్ళెత్తిన కూలీల శ్రమ సౌందర్యాన్ని చూడడం నేర్చుకోవాలని శ్రీశ్రీ గారు చెప్పినట్లు వ్రాశారు. "కాళిదాసు కవిత్వం కొంత నా పైత్యం కొంత" ని ఓ కవిగారు అన్నట్లుగా వీరు శ్రీశ్రీ గారు చెప్పినది పూర్తిగా మార్చి వేశారు. శ్రీశ్రీ గారి మహాప్రస్థాన కావ్యంలో దేశ చరిత్రలు అనే శీర్షిక క్రింద ఖంస్టాంజాలో శ్రీశ్రీ ఇలా అన్నారు. "నైలు నదీ నాగరి కతలో –

సామాన్యుని జీవన మెట్టిది: తాజమహల్ నిర్మాణానికి – రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు" అని. కాని దాని స్వరూపాన్నే మార్చివేశారు ఐనా శ్రమతో సౌందర్యాన్ని చూడడ మేమిటో వారికే తెలియాలి. ఆవిధంగానే తాజమహల్ స్వరూపాన్నే మార్చి దానిని మసీదు అంటున్నారు. అది సమాధి కాని మసీదు కాదు. మసీదుకు స్థంబాలుంటాయా తాజ్‌కు నాలుగు వైపులా స్థంభాలున్నవి అంటారు. మసీదుకు స్థంభా లుంటవి. జుమ్మా మసీదు (ఢిల్లీ) లోను స్థంభాలు చూడవచ్చు. మసీదుకు రెండు స్థంభాలు మాత్రమే వుంటవి. తాజ్ సమాధి గనుక నాలుగు స్థంభాలున్నవి. టాజ్ కోటలాంటి కట్టడం అంటారు. అది కోట కాదు. కోటలు ఆగ్రాలోను, ఢిల్లీలో ఎర్రకోట, ఫతేపూరు, సిక్రీలోను వున్నవి. వాటిని చూచినట్లయిన చక్కగా బాధ పడగలరు. కోటలో మంత్రి, సామంతులకు సైన్యాధిపతులకు సిబ్బందికి భవనాలు రాజ దర్బారు. రాణి వాస భవనాలు ఎన్నో కట్టడాలు. అశ్వ, గజ శాలలు ఎన్నో వుంటవి. అలాంటివి మచ్చుకైనా టాజ్‌లో కనుపించవు. టాజ్‌లో కొన్ని వందల అతిథి గృహాలున్నవన్నారు టాజ్ విస్తీర్ణం 204 గజాలు పొడవు: 150 గజాలు వెడల్పు. అందులో 128 గదులు మాత్రమే కలవు. అవి అతిథి గృహాలు కావు. సమాధులలో అతిథి గృహాలు కట్టరు. రాజ భవనాలలో తప్ప. అవి షాజహాను కుటుంబీకులకు కట్టించబడిన సమాధులు మాత్రమే. అదే విధమైన సమాధి గదులు ఢిల్లీలో క్రీ. శ. 156౮ లో కట్టించిన హుమయూన్ సమాధియందు చుట్టూ కట్టబడి యున్నవి. టాజ్ చుట్టూ కందకం వుందన్నారు. టాజ్‌కు ఉత్తరం వైపున గోడకు అనుకొని యమునానది ప్రవహిస్తుంది. మూడ వైపుల తోటలు మాత్రమే గలవు కందకం లేదు.

స్థంభాలు ముస్లిమ్‌లకు వారి మత చిహ్నాలలో ఒకటి కనుక వాటిని మసీదునందు కోట కట్టడాలపైన కట్టుచుందురు. దానికి ఉదాహరణ సికందర్‌లో గల అక్బర్ సమాధికి గల ముఖ్య ద్వారానికి నాలుగు స్థంభాలు కట్టారు. ప్రక్కనే ఇచ్చిన ఫోటోలో చూడవచ్చు. కాలుష్యంవల్ల తాజ్‌మహల్‌లో అందం చెడనున్నదని లేనిపోని సరిక్రొత్త సందేహాలు సృషించడం ఎందుకనేది అసలే అర్థం కాదు అంటారు. అది సందేహంకాదు. తాజ్ గోడలలో బైట వైపున లోపల గూడా మన ఇటుకరాయి చౌడుబారినపుడు ఒకలాంటి పొడి రాలుతుంది. అలాంటిదే అక్కడక్కడ తాజ్‌పై మన మామూలు కంటికే కనుపిస్తుంది. చేతితో గీరిన పొడి రాలుతుంది. మొన్న ఏప్రిల్ 84 న నేను 9 వ సారి తాజ్‌ను దర్శించినపుడు పరిశీలించిన విషయం అనుభవ పూర్వకంగా వ్రాస్తున్నాను.

ఆర్కియో మెట్రి పద్ధతి ప్రకారమే 1279 నుండి 1439 కాలంలో కట్టబడినదని అనుకొన్నప్పుడు ఆ కట్టడం చరిత్ర ప్రసిద్ధి నందవలసింది గదా? ఇలాంటి సుందర కట్టడం హిందూ దేశ చరిత్రలో 13 లేక 14 వ శతాబ్దాలలో వున్నట్లు ఏ చరిత్రకారుడు వ్రాసి వుండలేదు. తాజ్ పూర్తి కావస్తున్న రోజులలో తావెర్ నియర్ అనే ఇంగ్లీషు యాత్రికుడు 1653 లో హిందూ దేశాన్ని సందర్శించినపుడు "ది హిస్టరీ ఆఫ తాజ్‌మహల్" అనే గ్రంథాన్ని వ్రాశాడు. అందులో తాజ్ చరిత్రను విపులీకరిం-

చాడు. అలాగే జేమ్స్ పెర్ గూసన్ హిందూ శిల్పంమీద, తాజ్‌మీద ఒక గ్రంథాన్ని వ్రాశాడు. ఫ్రెంచి యాత్రికుడు బెరనీర్, జె. టార్ బోయిస్ పీలర్, బ్రిటీష్ పార్లమెంటునుండి వచ్చిన శామ్యూల్ స్మిత్, "మ్యెల్ఫ వర్క్స్" అనే గ్రంథంలోను, ఓస్కార్ బ్రౌసింగ్, జి. డబ్ల్యు. ఫారెస్ట్, బయార్డ్ టైలర్, బిషప్ ఫ్రెంచ్, లార్డు రాబర్ట్స్, ప్రిన్స్ ఆఫ వేల్స్ ఆల్‌బెర్ట్ ఎడ్వర్డ్ మొదలైన కొన్ని వందల మంది 17 వ శతాబ్దంలో హిందూ దేశానికి వచ్చినప్పుడు తాజ్‌ను గూర్చి దాని సౌందర్యాన్ని గూర్చి వ్రాశారు.

తాజ్‌మహల్ హిందూ రాజుల కట్టడాన్ని మార్చినారు అంటారు. ఇది కేవలం సమాధి కొరకు నాలుగ వైపుల ఎటునుండి చూచిన నేరుగా ఆవలి వైపున వున్నది కనుపించే విధంగా ప్లాన్ చేసి కట్టబడిన కట్టడం. తాజ్ కట్టడానికి నాలుగు వైపుల గల ద్వారములపైన ఖురానులోని 36 వ అధ్యాయంలోని అన్ని వాక్యాలు దక్షిణ వైపు నుండి ప్రారంభించి పడమర ద్వారంతో ముగించారు. మహల్ మధ్య భాగంలో ఖురానులోని చివరి అధ్యాయం 112 చెక్కబడివుంది. మహల్ లోపలి మధ్య భాగంలో భూగర్భంలో ముంతాజ్ దేహాన్ని ఖననంచేసి అచటనే కట్టిన సమాధిపైన వారి దేవునికి గల 99 పేర్లను సమాధిపై చక్కబడి వున్నవి. సమాధికి మూడు వైపుల ఖురాను నందలి 39 నుండి 53 వ అధ్యాయం వరకు చెక్కబడి వున్నవి. తల వైపున "ఇక్కడే అర్జుమన్ద్ భాను బేగం ముంతాజ్ అని పిలువబడే (రాజ భవనానికే కిరీటం వంటి) ఆమె నిద్రించి యున్నదని వ్రాయబడి యున్నది. ఆమె 1040 హిజరీలో మరణించి యున్నది. ముఖ ద్వారం నుండి ఖురాన్ 1 నుండి 112 అధ్యాయాలన్నీ తాజ్ కట్టడాలపై వ్రాయబడి యున్నవి.

తాజ్‌మహల్ 22 సం. కాలాన్ని తెలిపే సూచనగా ముఖ ద్వారానికి పైన పదకొండు చొప్పున రెండు భాగాలు 22 గోపురాలు కట్టబడినవి. ఆ 22 దాని కాలాన్ని తెలియజేయుచున్నవని ప్రక్కనే శిలా శాసనం వ్రాయబడి వుంది. హిందూ ఆలయ శిల్ప శాస్త్రానికి అనుగుణంగా తాజ్ కట్టబడి వుంది అన్నారు. వాస్తవమే. బి. యల్. ధామా హిందూ శిల్ప శాస్త్రవేత్త తాజ్ పర్షియా మరియు హిందూ శిల్ప శాస్త్రానికి ప్రతీకని దాని ఆత్మ మాత్రం హిందూ సాంప్రదాయమని చెప్పియున్నాడు. అతను వ్రాసిన "ది తాజ్" అనే పుస్తకంలో. షాజహాన్ చక్రవర్తి తాతగారైన అక్బర్ హిందూ మతాలను శిల్ప శాస్త్రాలను ఆచరించి పోషించాడు. అక్బర్ కట్టిన ఫతేపూర్ సికిరీ కోటలో హిందూ భార్యల భవనాలు హిందూ శిల్ప, వాస్తు శాస్త్ర ప్రకారమే కట్టబడియున్నవి. జహంగీర్ తల్లి రాజా బెహరీమాల్ ఆఫ అంబర్ రాజకుమార్తె. అలానే షాజహాన్ తల్లి మార్వారా మహారాజా ఉదయ్‌సింగ్ కుమార్తె. పేరు గణేష, సూర్య, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పూజించుచు హోమాలు జరిపించుచుండెడివారు. అందువల్ల పలచ ప్రసాద అని పిలువబడే శిల్ప శాస్త్రాన్ని తాజ్ నాలుగు మూల స్థంభాలపై పొందుపర్చుట జరిగింది. తాజ్ యొక్క వెడల్పు, దాని ఎత్తుతో సమానంగా నిర్మించడమైనది. తాజ్ గర్భ హాలును వాస్తు పురుష మండలమనే భాగం వాస్తు శాస్త్రం నుండి కట్టబడినది. తాజ్ కేవలం ముంతాజ్ కొరకే ఉద్దేశించి కట్టబడినందున ముంతాజ్ సమాధిని మహల్ మధ్య భాగంలో అమర్చబడినది. షాజహాన్‌కు మరియొక మహల్ యమునకు ఉత్తర భాగాన నల్ల రాతితో కట్టించవలెనని అతనిని అందే సమాధి చేయవలెనని తను వ్రాసుకొన్న పత్రంలో యున్నది. యమునకు ఒక వంతెన తాజ్ నుండి రెండవ భవనానికి గూడ కట్టవలెనని ప్లాన్ చేసినాడు. తాజ్ ప్రారంభించిన రెండు సం. కే. షాజహాన్ జబ్బు పడినందున తన నలుగురు కుమారులకు రాజ్య విభాగం చేయడం. వారిలో కలహాలు రావడం ఔరంగజేబు వారిని జయించి చంపివేయడం షాజహానును చెరసాల యందు ఢిల్లీలో వుంచుట జరిగింది. 23 డిసెంబరు 1666 లో షాజహాన్ మరణించగా అతనిని గూడా ముంతాజ్ ప్రక్కనే సమాధి చెయుట జరిగింది.


షాజహాన్ ఒక్క తాజ్‌నే గాక ఎన్నో గొప్ప కట్టడాలను కట్టించాడు. అక్బర్ చక్రవర్తి ఎఱ్ఱ రాతితో కట్టిస్తే, షాజహాన్ తెల్ల రాయినే అన్ని కట్టడాలకు వాడినాడు. అక్బర్ కట్టిన ఆగ్రా కోటలో ఖాష మహల్‌ను, సమన్ బుర్జు, జాస్మిన్ టవర్‌ను ముంతాజ్ కొరకు కట్టించాడు. మరియు దివాన్ ఇయామ్ ను 60 స్థంభాలతో ఒక హాలును ప్రజల కొరకు కట్టించాడు. పెరల్ మస్కు (మోడీ మసీదు) 3 లక్షల ఖర్చుతో 7 సం. కాలంలో 1648 లో కట్టించాడు. అదే విధంగా ఢిల్లీ కోటలో కొన్ని కట్టడాలు జామా మసీదు మొదలైనవి. ఆకాశాన్నంటే భవనాన్ని రాజా జైసింగ్ నుండి కొన్నీ వేల ఎకరాలకు కొన్నట్లు అందులో ముంతాజ్‌ను ఖననం చేసినట్లు వ్రాస్తున్నారు. బాబరు – భాబరు నామాను, అక్బర్ అయిక్ – ఇ – అక్బరిని, జహంగీర్ – జహంగీర్ నామాను, షాజహాన్ – బాద్ షహానామా ఉనే గ్రంథాలను వారి చరిత్రలను తెలుపుటకు పర్షియన్ పండితులచే వ్రాయించారు. కాని అక్బర్ ఉత్తర హిందూ స్థానాన్ని మధ్య ఇండియా వరకు పాలించిన తరువాత జహంగీర్ రాజ్యమేలినాడు. ఆ పిదప షాజహాన్ చక్రవర్తి ఐనాడు. తాతల దగ్గర నుండి వస్తున్న రాజధాని నగరంలో మరొక భవనాన్ని కొనే ప్రసక్తి మొగల్ చరిత్రలో నే లేదు. చౌహాన్ రాజ పుత్ర రాజులు ఢిల్లీలో మొగల్ చక్రవర్తులకు ముందు కట్టిన కోట 1505 లో భూకంపమందు శిధిలమైనందున అదే స్థలమందు ప్రస్తుతమున్న ఎఱ్ఱ కోటను అక్బర్ చక్రవర్తి 1565 నుండి 1573 వరకు 35 లక్షల వ్యయంతో 8 సం. కట్టించాడు. తాజ్ మహల్ మరొకరి కట్టడ మనుటకు ఎలాంటి ఆధారాలు లేవనుటలో సందేహం లేదు.

— కె. భిక్షాలు

మహిళా బాడీ గార్డులు!

మహిళలకు కూడా బాడీగార్డు ఉద్యోగాలు ఇవ్వవచ్చునా లేదా అనేది చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. మహిళలకి పోలీసు శాఖలో ప్రవేశం కల్పించి పోలీసులుగా నియమిస్తున్నప్పుడు బా డీ గా ర్డు లు గా నియమించడంలో తప్పు లేదని నిర్ణయించారు. ఫలితంగా పశ్చిమ జర్మనీ రాజధాని బాన్ నగరంలోని "బాడీగార్డు స్కూలు"లో మహిళలకు కూడా ప్రవేశార్హత కల్పించారు. ఈ స్కూలులో మహిళలకు కూడా పురుషులలాగా ఆయుధ శిక్షణ, కరాటే, మనస్తత్వ శాస్త్రము నేర్పుతారు. వి. ఐ. పి. ల భార్యల సంరక్షణకు మహిళా బాడీ గార్డులను నియమించడం మరింత సహజంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే వీరు పురుషులకు కూడా బాడీ గార్డులుగా నియమించబడుతూనే ఉన్నారు. సమావేశాలలో, బజారు ఎస్కార్టుగా, వీరు వి. ఐ. పీ లని అనుసరిస్తున్నారు.

(గ్లోబల్)



సీరియల్

దాగుడుమూతలు

కప్పగంతుల మల్లికార్జునరావు

(గత సంచిక తరువాయి)

రెడ్ సిగ్నల్ వెలగటంతో టేక్సీ ఆగింది.

అరుంధతి టైమ్ చూసుకొంది.

'ఎంత త్వరగా చేరుదామనుకొన్నా అయ్యే ఆలస్యం ఎలాగూ అయిపోయిందండీ. ఆ ప్రీవ్యూ లోచన చూచి వుండదు కదా ? చూస్తే అది భరించలేదండీ. ఎలా యిప్పుడు ? దానికేమన్నా అవుతే ?'

'యిలా నువ్వు అనవసరంగా ఆదుర్దాపడి టెన్షన్ పెంచుకుంటే ఏంలాభం అరూ ? ఏంజరగదు. నేను చెప్తున్నాగా ? ప్రీవ్యూ సాయంకాలం కావచ్చు లేకపోతే మీ స్నేహితురాలికి ప్రీవ్యూ థియేటర్‌లోకి ప్రవేశం చిక్కివుండకపోవచ్చు. చిక్కినా ఆ సినిమాలో నువ్వు భయపడుతున్నట్లు ఆ దృశ్యం అలాగే వుండి వుండకపోవచ్చు. ఉన్నా ఆమెకేం జరిగివుండకపోవచ్చు.'

'ఆ మీకేం ? మీరలాగే చెప్తారు. కానీ ...'

'యిలా నువ్వనటం యిది ఎన్నోసారో తెల్సా అరూ ? ఎందుకలా టెన్షన్ పెంచుకోటం ? నువ్వసలే వొంటరిదానివి కాదు. వొట్టిదానివి కాదు. బాబు, నేను నీమీద ఆధారపడి వున్నాం. యిలా ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకొంటే మేం ఏమయిపోవాలి చెప్పు ?'

జరిగిన కథ—10 : సులోచన స్నేహితురాలు అరుంధతి తన భర్త కాంతారావుతో చెప్పి, గోపీచంద్‌కు సన్మానం చేయిస్తుంది. సుప్రసిద్ధ సినీ దర్శకుడు శ్రీమన్నారాయణ నుంచి అర్జంటుగా రమ్మని కబురందుకున్న గోపీచంద్ సులోచనను వాల్తేరు బండెక్కించి తను మద్రాసు బండెక్కుతాడు. గోపీచంద్ నవల ఆధారంగా డైలాగులు కూడ అతనే రాసిన సినిమా సక్సెస్ అవుతుంది. భర్త నుంచి ఏ కబురూలేక బాధపడుతుంది సులోచన— గోపీచంద్ పూర్తి సినిమా వ్యామోహంలో పడిపోతాడు. సులోచన ఉత్తరం చదివిన గోపీచంద్ సులోచనను, తన తల్లితండ్రులను మద్రాసు తీసుకురావాలని నిశ్చయించుకొన్నట్లుగా సులోచన బాబాయి రామారావుకి చెప్తాడు. గోపీచంద్ దగ్గర నుంచి సులోచనకు ఉత్తరం వస్తుంది. "నేత్తురుకూడు" సినిమా కథా రచయితగా గోపీచంద్‌కు ప్రభుత్వ బహుమతి వస్తుంది. గోపీచంద్ సాహిత్యాభిమానులు ఏర్పాటు చేసిన సభలో తను ప్రస్తుతం దర్శకత్వం వహించి తీస్తున్న సినిమాలో ముఖ్య పాత్రను వేసే వ్యక్తిగా మూగ వెంకప్పబాబుని సభవారికి పరిచయం చేస్తాడు గోపీచంద్. వెంకప్పబాబుని రమేశ్ ఇంట్లో దిగవిడుస్తాడు గోపీచంద్. తమ పెళ్లి రోజున గోపీచంద్ సులోచనను ఆమె 'తప్పు కథ'ను చెప్పుమని అడుగుతాడు. అందుకామె నిరాకరిస్తుంది. గోపీచంద్ తను దర్శకత్వం వహించిన సినిమా ప్రివ్యూకు భార్యను తీసుకెళ్లను ఇష్టపడడు. ఆహ్వానం లేకుండానే ఆ సినిమా ప్రివ్యూకు వెళుతుంది సులోచన.

'మీకు తెలీదండీ. సులోచన జీవితం యిలా కావటానికి కారణం నేనేకదూ ? అదెలాంటి పిల్లో మీకు తెలియదు. అతి సున్నితం సుకుమారం. నన్ను సాధించపోయిన రాక్షసుడి కోరల్లో అది చిక్కుకొంది. నావల్లే అది వో పురుషుడి ఇష్టానికి బలయిపోయిందండీ. అప్పటికైనా బుద్ధివచ్చి వూరుకొన్నానా ? ఏమేమోచెప్పి దాని యిష్టానికి వ్యతిరేకంగా ఆ రహస్యాన్ని రహస్యంగానే వుంచాను. అది భయపడ్తూనే వుంది. ఆ రహస్యం ఎప్పటికైనా బయటపడ్తుందని, నేనే దానిమాట వినలేదు. పెళ్లిలోనే బయట పడింది. ఆ తర్వాత దాని అదృష్టం బాగుండి అంతా చక్కబడిందనుకోండి. కానీ ఆ తర్వాత వూరుకొన్నామా మనం ? అవతారమని చెప్పి దాని మనసులో వో భావనకు అంకురార్పణ చేసేం. అంతటితో వూరుకోక నేను ఫూలిష్‌గా అతని మాటలు నమ్మి లోచన మర్చిపోయిన ఆ దృశ్యాన్ని మొత్తాన్ని ఆమె భర్తకు చెప్పేను. దాన్ని అతను తెరకెక్కించి వుంటాడు. అది చూచి భరించలేదండీ లోచన. దాని నాశనానికి నేనే కారకురాలిని. అయ్యో.'

'అరూ ఆ దోషభావనే నీకు శత్రువు అవుతుంది. ప్లీజ్. ఏంజరిగినా నీదేంబాధ్యత లేదు. ఆ దృశ్యాన్ని భర్తకు తనే చెప్పబోలేదూ ?'

'ఏమన్నారూ ? దోషభావన కదూ ?'

ప్రొసీడ్ సిగ్నల్ వెలగటంతో టేక్సీ కదిలింది.

'డ్రైవర్, త్వరగాపోనియ్.' కాంతారావు హెచ్చరించాడు.

'ఏమండీ. మీరేమిటన్నారు ? దోషభావన అని కదూ ? నాకిప్పుడు గోపీచంద్ మనస్తత్వం సంపూర్ణంగా అర్థమయిందండీ యస్. అతను ఆ దృశ్యాన్ని సినిమాలో యథాతథంగా చిత్రీకరించాడు. సులోచన ద్వారా కాకుండా నా ద్వారా ఆ విషయాన్ని తెల్సుకొన్నాడు. ఆమె యిష్టానికి వ్యతిరేకంగా, ఆమె అందుకు యిష్టపడదని తెల్సి, ఆ దృశ్యాన్ని సినిమాలో పెట్టేడు. ఆ దోషభావనతోనే, సులోచనకు తన మొహం చూపించలేకపోతున్నాడు. యస్. గిల్టీ కాంషస్.'

'యస్. కరెక్ట్. యిప్పుడు గోపీచంద్ మానసిక వ్యాధిని కుదిరించటానికి మందులకి కొరత లేదుగా ? రోగం డయాగ్నయిజ్ అయ్యాక క్యూర్ చేయటం ఏం కష్టంలేదుగా ?'

'లేదు. కానీ యీలోగా ఏ అనర్థం జరిగిపోతుందో ఏమో !'

'ఏం జరగదు. పాజిటివ్‌గా ఆలోచించు. నెగటివ్‌గా ఆలోచించి లాభం ఏమిటి ? నువ్వింకా ధైర్య స్థైర్యాలున్న దానివనుకొన్నానే !'

టేక్సీ ఆగింది. పరుగెత్తుకొంటూ వో కుర్రాడు కారు దగ్గరికి వచ్చాడు. 'వదినా' అంటూ.

అతను కృష్ణమూర్తి. సులోచన యింట్లో కన్పించక, ఎక్కడికి పోయిందో తెలియక, కంగారు పడుతున్నారు వాళ్లు. రమాదేవి అన్నలో ఎక్కడికో వెళుతున్నానని చెప్పి వెళ్ళింది. మరి సులోచన ఎక్కడికి వెళ్లినట్లు ?

'మీ వదిన ఎవరు బాబూ ? సులోచనేనా ? నీ పేరు కృష్ణమూర్తి కదూ ?'

'అవునండీ. కానీ మీరు...'

'అదంతా తర్వాత. మీ అన్నయ్య, రమాదేవికూడా యింట్లో లేరు కదా ? మీ వదినకూడా ప్రీవ్యూ థియేటర్‌కే వెళ్లివుండాలి. ఎక్కడో తెల్సా ?'

'అసలివాళ ప్రీవ్యూ వున్నట్లే తెలియదండీ. మొన్ననెప్పుడో అయిపోయిందిగా ?'

'అదెక్కడ జరిగిందో తెల్సా ?'

'ఊ. యివాళ పేపర్లో 'రివ్యూ'లు వచ్చాయిగా' ?

'అయితే మనం ఆ థియేటర్‌కు వెళ్లాలి అర్జంటుగా. ఎక్కు టేక్సీ.'

'ఒక్క క్షణం. అమ్మా నాన్నతో చెప్పొస్తాను. మీ పేరు చెప్పండి.'

'అరుంధతి. సులోచన స్నేహితురాలిని.'

'ఓ ! మీరా!' అంటూ అతను లోపలికెళ్లి అంతలోనే పరుగెత్తు కొనివచ్చి కారెక్కుతూ 'పదండి వెళ్దాం' అన్నాడు.

* * *

సులోచనను థియేటర్‌లో కుర్చీ వేయించి కూర్చోబెట్టి వచ్చి తన స్థానంలో కూర్చున్నాడు నాయుడు.

ఆమె అన్న మాటలే గుర్తొస్తున్నాయి అతనికి.

ఆట ! దాగుడుమూత ఆట ఆడుతున్నారుట !

అవును. జీవితమే ఆట !

దాంపత్య జీవితం దాగుడుమూత ఆట అవుతే —

సినిమా జీవితం బ్రాకెట్ ఆట ! మక్తా ఆట !

హఠాత్తుగా నాయుడుకేదో స్ఫురించింది.

అవును. గోపీచంద్‌గారు సినిమాలో చూపించిందే అలాంటి ఆటలు !

నాయుడు డబ్బింగ్ స్టేజ్‌నుంచి యిప్పటివరకు అందులో దృశ్యాలు చాలాసార్లు చూచాడు. అవును. ఆ సినిమాలో ఆటలు. ఆ ఆటలవెనుకగల ఆనందం... వైఫల్యాలు... విచారం... వో! ఎంత గొప్పగా పేనేడు ! ఎంతటి అందమైన సృష్టి ? ఎంత సహజంగా వున్నాయి దృశ్యాలు ?

అతను లేచాడు. కాళ్లు థియేటర్‌వైపు లాక్కెళ్లాయి.

ఆ సీన్. ఆ సీన్ వచ్చే సమయం ఆసన్నమయింది.

అతను లోపలికెళ్లేసరికి యింకా అతను అనుకొన్న దృశ్యం రాలేదు. తన కుర్చీలో కూర్చున్నాడు.

'ఆ దృశ్యం అన్ని సినిమాలలో వుండే రేప్ దృశ్యాన్నే ఎంత అందంగా, సున్నితంగా, సుకుమారంగా, భావగర్భితంగా తీసేడు !

ఆ రేప్ సీన్ అంత పట్టుగా వుండకపోతే సినిమాకు బలంలేదు.

ఆ సీన్‌కోసం డైరెక్టర్ ఎంత ఆలోచించాడో తనకి తెల్సు.

ఆఖరికి ఎక్కడికో వెళ్లివచ్చాడు ఔట్‌డోర్ మధ్యలో.

ఆ తర్వాత ఆ సీన్ వచ్చింది.


స్క్రీన్‌మీద ఆ రేప్ దృశ్యమే ! అతని మనసునూ ఆ దృశ్యమే ! వున్నట్లుండి సులోచన అన్న మాటలు గుర్తుకొచ్చాయి !

ఆట ! దాగుడుమూతలాట !

భార్యను ప్రీవ్యూకు పిల్చుకురాని డైరెక్టర్ ! పిలవొద్దని ఆర్డరిచ్చిన డైరెక్టర్ !

భర్త దర్శకత్వం వహించిన సినిమాకు ఆహ్వానంలేకుండా వచ్చిన





న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మచిలీపట్నం శాఖకి ప్రారంభోత్సవం చేస్తున్న సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజరు శ్రీ ఎన్. బలరామన్. డివిజనల్ మేనేజరు శ్రీ వి. వెంకటరామన్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజరు శ్రీ ఎం. నరసింహారావుగార్లని కూడా చిత్రంలో చూడవచ్చు.

దాగుడు మూతలు

భార్య ! భర్తకు తెలీకుండా వెనకసీట్లలో కూర్చొని సినిమాను చూచే భార్య !

యీ ఆటకు అర్థం ఏమిటో ?

అతనికి భయం వేసింది. సిక్స్త్‌సెన్స్ ఏదో ఘోరం జరుగబోతోందని హెచ్చరించింది.

'ఓ ! బ్యూటిఫుల్ ! గొప్ప దృశ్యం !'

ప్రేక్షకుల్లో ఎవరో పెద్దగానే అన్నాడు ఆ దృశ్యాన్ని చూస్తూ. నాయుడు లేచి డైరెక్టర్ దగ్గరికి వెళ్లేడు.

'చాలా గొప్పగా తీసేరండీ. చాలా సహజంగా వున్నాయి సీన్స్. వన్ డే యూ విల్ బికమ్ సత్యజిత్ రే — ఐసే యు.'

పక్కన కూర్చున్న వో సినిమా ప్రముఖుడు గోపీచంద్‌ను పొగుడుతున్నాడు.

'సర్. డైరెక్టర్‌గారూ క్షమించండి. వొక్కమారిలా వస్తారా?'

గోపీచంద్ ప్రొడ్యూసర్ వెంట బయటికి నడిచాడు.

'సర్. సినిమా ఆరంభమయ్యాక మీ శ్రీమతిగారొచ్చారు. మీతో చెప్పటం మంచిదనిపించి.'

'ఏమిటీ ! సులోచన వచ్చిందా ? ఆ దృశ్యాన్ని చూచిందా ?'

వొక్కసారిగా అరిచాడు గోపీచంద్. అతని మొహం కళావిహీనమయింది. భయం... బాధ... దోషభావన...

'అన్నయ్యా— అరుంధతిగారొచ్చారు— వదినకోసం.'

తమ్ముడిని, అరుంధతిని, ఆమెపక్క కాంతారావుగారిని చూడగానే అతని మొహం మరింత పాలిపోయింది. అరుంధతి చేతిలోని బిడ్డను భర్త చేతికందించింది.

'సులోచన నాకు రాసిన ఉత్తరం యిదిగోనండీ. యిది చదివి పరిగెత్తుకొచ్చాను. ఆమె ఎక్కడ ? కులాసాగా వుందికదా ? ఆ దృశ్యాన్ని చూచిందా ఆమె! చూచి...'

చూచి ???

గోపీచంద్ కళ్ల లోపలి పొరల్లో ఏవో దృశ్యాలు ! మనసులో అగ్నిపర్వతాలు !

'నో. అలా జరగటానికి వీల్లేదు.' అతని మొహాన్ని రెండు చేతుల్లో వప్పుకొన్నాడు. కుర్చీలో కూలబడుతూ.

'అలా జరగటానికి వీల్లేదని అరుస్తూ కుర్చీలో కూలబడితే ఏం లాభం సార్ ? జరగబోయేదాన్ని ఆపుచేసే పురుష ప్రయత్నం చేయాలిగా ? లేవండిసార్. యిప్పుడు మీ స్థానం యిక్కడకాదు. సులోచన సన్నిధిలో. ఆమె ఎక్కడుందో చూడండి ముందు. ఏక్షన్...' కాంతారావు అన్నాడు.

'ప్రొడ్యూసర్‌గారూ— సులోచన ఎక్కడ ?'

'రండిసర్. చూపిస్తాను.'

'నేను ఆమెకు మొహం చూపించలేనండీ అరుంధతిగారూ. నేను దోషినే. మీకే నా మొహాన్ని చూపలేకపోతున్నాను. మీరు వెళ్లి ఆమెను చూడకూడదూ ?'

'నో. అలా కుదరదు. మీరు వుండాలి. అరుంధతి కూడా మీవెంట వస్తుంది— కావాలంటే. లేవండి. ఏక్షన్...'

'పోనీ, పిక్చర్ ఆపుచేయించమంటారా డైరెక్టరుగారూ.'

'ఎందుకండీ ? పదిమందీ యీ దృశ్యాలనీ చూడటానికా ? వద్దు. వాళ్లకు ఆమెను చూపండి.'

ప్రొడ్యూసర్ గోపీచంద్‌ను, అరుంధతిని' వెంట బెట్టుకొని థియేటర్‌లో బేక్ సీట్స్ వైపు నడుస్తున్నాడు.

వారు ప్రవేశద్వారం వద్ద కెళ్లేసరికి—

వారి ప్రయత్నం లేకుండానే తలుపు తెర్చుకొంది.

సులోచన బయటి కొచ్చింది.

అప్పుడే గోరీలోనుంచి లేచి బయటికొచ్చినట్లుందామె.

ఆమె కనురెప్పలు మూత పడటంలేదు. కళ్లు తెర్చుకొని షేరుగా ఎదురుగ్గా దేన్నో చూస్తున్నట్లుంది ! వెర్రి చూపు !

ఆమె, పక్కనే వున్నవాళ్లని, గుర్తించలేదు. అసలు చూచిందో లేదో ?

శవం నడుస్తున్నట్లు పదడుగులు నడిచింది.

కుప్పకూలిపోయింది.

'లోచనా' అరుంధతి ఆమెను పొదివిపట్టుకొంది.

* * *

'శుభం'

తెరమీద ఆ రెండక్షరాలు పడ్డాయి.

జనం సీట్లలోనుంచి లేవలేనట్లు లేచారు.

'దర్శకుడుగారేరీ... గోపీచంద్‌గారేరీ ?'

ఏరీ ? ఏరీ ?

'వారేదో పర్సనల్ పనుండి మధ్యలో వెళ్లారండీ. మిమ్మల్నందరినీ క్షమించమని చెప్పమన్నారు' నాయుడు అన్నాడు.

ప్రేక్షకుల్లో ప్రొడూసర్లు వున్నారు.

వో ప్రొడ్యూసర్ మాటల్ని వాళ్లా నమ్మేది ?

'నా భారీ పిక్చర్‌కు డైరెక్టర్ గోపీచంద్‌గారే. ఈ క్షణంలో కాంట్రాక్టుమీద సంతకాలు జరిగిపోవాలి. ఆయనెక్కడున్నారో పట్టుకోండి' వో భారీ ప్రొడ్యూసర్ శపథం చేసినట్లు అని అనుచరులకు ఆజ్ఞలు జారీచేసేడు.

క్షణంలో వాళ్లు కూపీ లాగేరు.

గోపీచంద్ ఆ బిల్డింగ్‌లోనే వున్నాడు. ఎక్కడికీ వెళ్లలేదు.

అయితే ఎక్కడ దాక్కొన్నట్లు ?

పైగా అత్యద్భుతమైన విజయాన్ని సాధించి గర్వంగా నిలబడాల్సిన సమయంలో దాక్కోవాల్సిన అవసరం ఏమిటి ?

అన్నీ ప్రశ్నలే ! సమాధానాలిచ్చే దెవరు ?

అయినా ప్రేక్షకులు చాలామంది, ఆ రహస్యం ఏదో తెల్సుకొనే దాకా కదలటం ఇష్టం లేనట్లు అక్కడే నిల్చిపోయారు !

* * *

'రచయిత, పేరును కాంక్షించటం తప్పుకాదు గోపీచంద్‌గారూ. కీర్తికాంక్ష మానవులందరికీ సహజమే కానీ పేరుకోసం అమ్ముడు పోయే రచయిత విలువ కాగితపు రూపాయిలకున్న విలువ లాంటిది. నిజ విలువ కాగితపు రూపాయిల్లో వుండదు. అది శాశ్వత రూపంలో మరెక్కడో వుంటుంది. మరి కాగితపు రూపాయల విలువకు ద్రవ్యోల్బణాలు, ఆర్థిక మాంద్యాలు తప్పవు కదా ?

కీర్తికాంక్ష మీకున్న వొకే వొక బలహీలనత,


ఆ కాంక్షతోనే వో రోజు రచనను అమ్ముకొన్నారు. యివాళ మీ భార్య జీవితంలోని వో దృశ్యాన్నే తెరకెక్కించారు.

ఉత్తమ సాహిత్య సృష్టికి, కళాసృష్టికి, జీవిత అధ్యయనం అవసరమే. కళా రూపాలకు ప్రేరణ జీవితమే. కానీ ఉత్తమ సాహిత్యం కన్నా మనిషి జీవితం విలువైందండీ.

సాహిత్యంలో వాస్తవికత పేరిట నిజ జీవితాల్ని బజారుపాలు చేస్తే ఎలా ?

భార్య జీవితాన్ని తెరకెక్కించటం మీ సృజనాత్మక శక్తికీ. నిజాయితీకీ నిదర్శనంకాదు. మితిమీరిన కీర్తి వ్యామోహానికి నిదర్శనం, తాగుడు, జూదం, పరస్త్రీ వ్యామోహం, వేట, పరుషవాక్కు, పరనింద, పర ధనాపహరణాలతోపాటు వ్యసనాల లిస్టులో పెద్దలు కీర్తి వ్యామోహాన్ని ఎందుకు చేర్చలేదో నాకు తెలీదు. అయితే 'ఇగో' — అహం యీ వ్యసనానికి ఆలంబనం. మీలో అజ్ఞాతంగా 'సూపర్ ఇగో' వుంది. విశ్వామిత్రుడిలాంటి మహా తాపసికి దాన్ని జయించటం సాధ్యంకాలేదు.

రాజస్థాన్‌లోని జైసల్‌మీర్‌లో 'తెలుగు సాంస్కృతిక సంఘం' సభ్యులు ఆగస్టు 30 న వినాయక చవితి పర్వదినాన్ని జరుపుకుంటున్న దృశ్యం.



దాగుడుమూతలు

ఇక మీరెంత ? మానవమాత్రులు. కానీ మీకు మీరు నమ్మిన ఆదర్శాల పట్ల కించిత్తు గౌరవంవున్నా, మీ భార్యపట్ల యీషన్మాత్రం ప్రేమ వున్నా నా మాటవిని మీలోని రచయితనే చంపేయండి. కళాకారుడిని ఆత్మహత్య చేయండి. అలా చేయని పక్షంలో మీ 'ఇగో' 'ముందిప్పుడు మీ భార్యను బలి తీసుకొంటుంది. ఆ తర్వాత ఎప్పుడో మిమ్మల్నే బలి తీసుకుంటుంది !

కాంతారావు మాటల్ని వింటున్నాడు గోపీచంద్.

మనసులో విశ్లేషించుకొంటున్నాడు.

'మీ మనసులో ఆదర్శాలను చెప్పటానికి సాహిత్యం, కళా ప్రక్రియలు సాధనాలే. కాదనను. కానీ తొంభై తొమ్మిది ఆదర్శాలు చెప్పే కన్నా ఆచరణలో వొక్కటి చేసి చూపించటం గొప్పండి. చెప్పటం వ్యసన మవుతే చేసి చూపటం క్రియాశీలత. మీరలా చేసి చూపేరు. సులోచనను పెళ్లి చేసుకొన్న మీ ఔన్నత్యంముందు ప్రపంచం తల వొగ్గుతుంది, ఏనాటికైనా. వెంకన్నబాబును మనిషిని చేశారే— అలాంటి చర్య మీకు శాశ్వతమైన తృప్తినిస్తుంది. ఎండమావులవెంట పరుగులెందుకండీ ? జీవితంతో యీ దాగుడుమూతలెందుకు ? మీలోని ఆ వొక్క బలహీన తను చంపితే మీ ఔన్నత్యం పెరుగుతుందేకాని తరగదు. మానవత్వం చంపుకొని అయినా మహా రచయిత అయేకంటే, రచయితను చంపి మానవత్వాన్ని బ్రతికించుకోటంలో జీవిత పరమార్థం వుందని గుర్తించండి.'

ఆలోచన — విశ్లేషణ... ఆలోచన.

డాక్టర్ మరో గదిలోంచి బయటికొచ్చాడు.

ఆశగా చూచాడు గోపీచంద్.

'ఆమెకేం ఫర్వాలేదండీ. కానీ ఆమె చాలా బలమైన షాక్‌ను ఎదుర్కొంది. కోలుకొన్న తర్వాత ఆమె మానసిక స్థితి ఎలా వుంటుందో యిప్పుడప్పుడే చెప్పలేను. బట్ షి యీజ్ ఎ టెండర్ హార్టెడ్ వుమెన్. ఆమె మామూలు స్థితి రావాలంటే ఆమెకు ముఖ్యంగా కావల్సింది — ఆమెను అర్థం చేసుకోటం. సానుభూతి, కన్నీళ్లుకాదు. మిస్టర్ గోపీచంద్. మీరు రచయిత. యింతకన్నా మీకు నేను చెప్పాల్సిందేముంది ? షి యీజ్ నవ్ ఏన్ ఆర్ట్‌పీస్ ఆఫ్ మార్బుల్. ఆమె అపురూపమైన పాలరాతి కళాఖండం. హేండిల్ హర్ విత్ ఎక్స్ట్రీమ్ కేర్. ఐ విల్ డూ మై బెస్ట్.'

డాక్టరు వెళ్లిపోయాడు. నాయుడు ఆత్రంగా లోపలికొచ్చాడు.

డాక్టరు ఆ గదిలోనుంచి రావటం బయట ఎదురు చూస్తున్న జనం చూచారు.

'ఏమయింది ? ఏమయింది ?'

'ఎవరికి జబ్బు ? డైరెక్టర్‌గారిక్కాదుకదా ?'

'కాదు. గోపీచంద్‌గారి భార్యకు. యిప్పుడు బాగానే వుంది.'

డాక్టర్ వెళ్లిపోయాడు.

'జంటిల్ మెన్.'

అంతా ఆ సంబోధనకు అటు తిరిగేరు. గోపీచంద్.

'నా అనుచిత ప్రవర్తనకు కారణం డాక్టర్‌గారు చెప్పినదాన్నిబట్టి మీరంతా గ్రహించే వుంటారు. నేను వెళ్లిపోయినా నాకోసం మీరంతా ఎదురుచూడటం మీ అభిమానానికి చిహ్నం. అందుకు కృతజ్ఞతలు.

డాక్టరుగారు నా భార్యకు జబ్బు చేసిందని చెప్పేరు. కానీ నిజానికి జబ్బుచేసింది నాకే. నాకున్నదాన్ని చూచి ఆమెకు జబ్బుచేసింది.'

'ఎవరికైతేనేంలెండి. యిప్పుడు నెమ్మదిగా వుందికదా ?

అది చాలు. మీరు తొలిసారిగా దర్శకత్వం వహించిన సినిమాను చూచాను. రెండో ఛాన్సు నేను యిద్దామనుకొంటున్నాను. యిదిగో కంట్రేక్టు అంకెలేసుకొని సంతకంచేసివ్వండి. స్పాట్ పేమెంట్ యిప్పుడే, భారీ ప్రొడ్యూసర్ అన్నాడు.

'భారీ ప్రొడ్యూసర్‌గారితో మేము పోటీపడటం కాదనుకోండి. మా పిక్చరుకు మీరే దర్శకులు. డేట్ ఎప్పుడిస్తారో చెప్పండి. ప్లీజ్.'

గోపీచంద్ నవ్వేడు.

'మీ అభిమానానికి కృతజ్ఞతలని యిందాక అన్నాను. దాన్ని వుప సంహరించుకొంటున్నానిప్పుడు. మీకు నా మీద అభిమానంలేదు. నేను సంపాదించిపెట్టగల డబ్బుమీద మీకు అభిమానం. కానీ..'

'వాట్ డూ యూ మీన్ ? మీ వుద్దేశ్యం ఏమిటి ?' కోపంగా అన్నాడు భారీ ప్రొడ్యూసర్. జనంలో గుసగుసలు బయలుదేరేయి.

'నా సెకండ్ పిక్చర్‌కు కాంట్రేక్టు చేయమంటేనే అంగీకరించ లేదు గోపీచంద్‌గారు. యీ పిక్చర్ రిలీజ్ అవుతేకానీ వారు మరో పిక్చర్‌కు అంగీకరించమన్నారు. ఆ మాటనే నిందాకటి నుంచి చెప్తూనే వున్నాను కదా ? ఆయనిప్పుడు భార్య ఆరోగ్య విషయంగా మంచి 'మూడ్'లో లేరు. తర్వాత మాట్లాడండి. యిప్పుడెందుకాగొడవలు ? ' నాయుడు జనానికి నచ్చచెప్తున్నట్లు అన్నాడు.

జనం గొణుక్కొంటూ మెల్లగా కదలబోయారు.

'ప్లీజ్. ఆగండి. నేను రచయితగా, దర్శకుడిగా వొక ప్రకటన చేయబోతున్నాను. దాన్ని వినిపోండి.'

అంతా ఆగేరు.

ఒక్కక్షణం నిశ్శబ్దం. అంతా ఆత్రంగా ఆతని ప్రకటనకోసం ఎదురు చూస్తున్నారు.

'నేను బాగా ఆలోచించి నిర్ణయించుకొని చేస్తున్న ప్రకటన యిది. నా నిర్ణయానికి తిరుగు వుండదు.'

ఏమిటబ్బా అది ? రెమ్యూనరేషన్ పెంచుతాడా ?

'నేను రచయితగా. దర్శకుడిగా సినిమా రంగం నుంచి రిటైరవుతున్నాను.'

వొక్కక్షణం ఆశ్చర్యం వల్ల ఎవ్వరూ మాట్లాడలేదు.

'ప్రవేశించిందే యిప్పుడుగా ? అప్పుడే రిటైర్‌మెంట్ ఏమిటి?'

'ఎందుకు ?'

'ఎందుకంటే నేను ధనస్వామ్య వ్యవస్థకు వూడిగం చేయలేను కనుక, రాసిందీ, తీసిందీ అంతా ట్రేష్ అని తెల్సుకొన్నాను కనుక విష సాగారాన్ని క్షీరసాగర మనుకొని ఎంత మథించినా విషమే కాని అమృతం పుట్టదు కనుక. నా జీవితంతో నేను దాగుడుమూతలాడుకోలేను కనుక మనిషిగా బ్రతకాలన్న కోరికను చంపుకోలేక నాలోని రచయితకు, సినిమా రచయితకు యీ క్షణంలో వురి వేస్తున్నాను. శెలవ్.'

ఎవరూ చప్పెట్లు కొట్టలేదు. గోపీచంద్ వాంఛించనూలేదు. అతను లోపలికెళ్లేడు.

అరుంధతి, రమాదేవి, కృష్ణమూర్తి, కాంతారావులు వెంట రాగా మరికాస్సేపటికి సులోచనను పట్టుకొని మెల్లగా బయటికి నడిపించుకొంటూ వచ్చేసరికి నాయుడుతో సహా అక్కడ ఎవరూలేరు. అంతా నిర్మానుష్యం. ఆతని దోవన ఏ అడ్డంకులూ లేవు. ఆకర్షణలూ లేవు.

మెల్లగా నవ్వుకొని నాలుగడుగులు వేసేడో లేదో అతని కుడిచెయ్యి చిటికెన వ్రేలునెవరో పట్టుకొన్నారు.

అటుచూస్తే వెంకన్నబాబు !

'డాక్టర్ ఆలస్యంగా పంపేడు. సినిమా మిస్ అయ్యాను.'

మాట లొచ్చిన వెంకన్నబాబు ! ?

'మంచే జరిగింది. నీ మనసన్నా కల్తీ కాలేదు.

'నేనూ కల్తీ చేసుకోలేదు.'

తమ్ముడి వైపు మెచ్చుకోలుగా చూచాడు గోపీచంద్.

'టేక్సీని పిలవనా అన్నయ్యా. కార్లు వాళ్లు లేరుగా ?'

'పిలువు. మీ వదిన నడవలేదు గదా ? '.

కృష్ణమూర్తి ఎన్నో టేక్సీలను పిలిచేడు. వొక్కటీ ఆగలేదు.

'ఎందుకండీ ఆ యిబ్బంది ? యిలా మీరు వుంటే నేను ఎంత దూరమన్నా హాయిగా మీతోపాటు నడవగలను.'

'లోచనా' అతను ఆమెను దగ్గిరిగా పొదివిపట్టుకొంటూ ఆర్ద్రత నిండిన గుండెతో అన్నాడు.

(అయిపోయింది) ✶

న్యూఢిల్లీ లేఖ

(5 వ పేజీ తరువాయి)

పార్టీలు మార్చే ప్రబుద్ధుడిని నేను "పండితుడు" అనను కదా! ఈయన తన పార్టీలని కొందరు హాలీ-వుడ్ నటీమణులు భర్తలని మార్చినట్లే మార్చేస్తూ ఉంటాడు....) చీనా వాళ్ళు, పాకిస్థానీలూ ఎంత గొప్ప వాళ్లో తెగ వర్ణిస్తాడు ఈయన. ఈయన కర్చులు భరించినద ఎవరు? ఇలాంటి వాళ్ళు ఎప్పుడూ. చీనా, పాకిస్తాన్, ఇస్రాయెల్ దేశాలకి మాత్రం వెడుతూ ఉంటారేమిటి? (ఒకప్పుడు ఇస్రాయెల్‌కి ఒక స్వామి మాత్రమే వెడుతూ ఉండే వాడు కాని పాపం అయన పట్టు సడలిపోతోంది.) వెళ్లి వచ్చి గొప్ప "ప్రత్యేక వ్యాసాలు" రాస్తారేమిటో!

ఇవన్నీ డబ్బులిచ్చి రాయించే వ్యాసాలని నా అను-మానం. జియా తాలూకు వ్యాసాలు ఇంతే, అను-కుంటాను. బొంబాయిలోని "జిన్నా హవుస్"ని పాకి-స్తాన్‌కి ఇచ్చెయ్యమని కుల్దీప్ నయ్యార్ సిఫారసు చేస్తే ఆశ్చర్యం ఏముంది? ఢిల్లీలోని లాల్ ఖిల్లా, ఆగ్రాలోని తాజమహల్‌ని సయితం పాకిస్తాన్‌కి ఇచ్చెయ్యమని రేపు ఆయన అన్నా ఆశ్చర్యం లేదు. అవీ మొగల్‌లు కట్టించినవే కదా?

భారత దేశంలో శ్రీమతి గాంధీ పరిపాలనని వ్యతిరే-కించే వాళ్ళు పాకిస్తాన్‌లో జియా పరిపాలననీ వ్యతిరేకించాలి. శ్రీమతి గాంధీ హంతకురాలు కాదు. జియా హంతకుడు. భుట్టో కూడా ఒక హంతకుడే. ఆయన స్థాపించిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ ఒక రాజకీయ పక్షం కాదు- అది ఒక రాజకీయ వాదుల ముఠా.

నేను శ్రీమతి గాంధీ అభిమానిని కాను కాని జియా-లాంటి వాళ్ళని గెడ కర్రతో ముట్టుకోమన్నా ముట్టు-కోను నేను- వాళ్ళు చాందినీ చౌక్‌లో అమ్మే కబాబ్‌లని ఎంత పొగడినా సరే! □

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna, Phones : P. B. X. : 61247, 61248 & 75667.



ఆఫీసు వదిలేసరికి ఆరయిపోయింది.

యూనియన్ మీటింగ్ అయింతర్వాత రాత్రి పది గంటలకు ఇల్లు చేరుకున్నాను. నా కోసం మా శ్రీమతి పడిగాపులు కాస్తూ కూర్చుంది.

స్నానం చేసి భోజనం దగ్గర కూర్చున్నాను.

"ఇంత ఆలస్య మయిందేం?" శ్రీమతి అడిగింది.

"యూనియన్ అధ్యక్షుడ్ని కదా మీటింగు చూసుకొస్తున్నాను."

"వేగంగా వచ్చుంటే బావుండేది."

"ఏం?"

"బాబూరావు–వాళ్లమ్మగారూ మీకోసం ఎదురుచూసి– చూసి వెళ్లి పోయారు."

"ఎవరూ ?! ఆ కుర్రాడేనా?!"

"ఆ! పాపం! ఆ అబ్బాయి మనం ఏం పని చెప్పినా చేస్తుంటాడు. ఈ వీధిలో ఎవరు చెప్పినా కాదనకుండా పన్జేస్తాడు."

"వాళ్లమ్మగారెందు కొచ్చారు.?"

"ఆ అబ్బాయికోసమే!"

"ఎందుకూ?"

"ఆ కుర్రాడికి ఎక్కడన్నా పని చూసి పుణ్యం కట్టుకోమని వేడుకుంది "

"అవునే! మా ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం ఖాళీగా ఉంది. నాకూ ఆ ఉద్యోగాన్ని ఈ కుర్రాడికి ఇప్పిద్దామనే ఉంది రేపు ఉదయం ఆ కుర్రాడికి కబురు చెయ్యి మాట్లాడాలి "

"అలాగే!... అవునూ! మీరు కొత్త చెప్పులు కొన్నట్టున్నారే!"

"ఆ! బావున్నాయా!?"

"బావున్నాయి గాని ఎంతేవిటి?!"

"వందకి పాతిక తక్కువ!"

"అంటే – డబ్బది అయిదా?!"

"ఏం? అంత ఖరీదు చెయ్యవా?!"

"ఎందుకు చెయ్యవు: కానీ, మీకు అంత ఖరీదువెందుకండీ!"

"వేసుకుంటే తగనా?!"


"అన్నానా?!"

"ఆ మాటనక పోయినా అందులో గూడార్థం అదేకదా!"

"పోదురూ!.. ఆ అబ్బాయికి ఈ ఉద్యోగం ఎలాగైనా ఇప్పించండి పాపం! వాళ్ళు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు ఆవిడ సంపాదన మీద వాళ్లిద్దరూ నెట్టుకు రావడం కష్టంగా ఉందట. ఈ రోజంతా తన కష్టాలు చెప్పుకు ఏడ్చిందావిడ." మా ఆవిడ సిపార్సుకు అర్థం వుంది.

ఆ అబ్బాయి నాకు తెలుసు.

ఆ కుర్రాడికి తల్లి తప్ప 'నా' అనే వాళ్ళు ఇంకెవరూ లేరు. తల్లి అందరి ఇళ్లల్లోనూ 'పాచి' పని చేస్తూంటుంది. ఈ కుర్రాడు వీధిలో ఎవరు ఏం చెప్పినా చేస్తుంటాడు వాళ్ళు సంతోషంతో ఇచ్చే పదీ– పరక పుచ్చుకుంటాడు.



నాకు అప్పుడప్పుడూ 'వైన్' తెచ్చి పెడుతుంటాడు. పోనీ, పాపం! అటువంటి కుర్రాడికి ఉపకారం చేస్తే మన పేరు చెప్పుకు బ్రతుకుతాడు.

ఉదయం లేస్తూనే 'టీ' త్రాగడం నాకలవాటు. ఉదయం ఆరవుతుండగానే నేను 'టీ' త్రాగుతున్నప్పుడా కుర్రాడొచ్చాడు. ఆ అబ్బాయికీ గ్లాసుతో 'టీ' తీసుకువచ్చి ఇచ్చింది మా ఆవిడ.

నా ముందర చేతులు నులుముకు నిలబడ్డాడు. నేనే 'టీ' పుచ్చుకోమని చెప్పాను. వేడిగా సెగలు కక్కుతున్నగ్లాసుడు 'టీ' ఒక్క గుక్కలో త్రాగేసి గ్లాసు క్రిందపెట్టి చేతులు కట్టుకు నిలబడ్డాడా కుర్రాడు.

"మా ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం ఖాళీగా ఉంది. వేయిస్తాను చేస్తావా?"

"చేస్తానయ్యా!"

"ఏం చదువుకున్నావు."

"ఎనిమిదో తరగతి పాసై మానేశానయ్యా."

"ఎంప్లాయిమెంటు కార్డు తీసావా?!"

"తీసానయ్యా!"

"సాయంత్రం ఓ సారి ఇంటికి రా. అప్లికేషన్ ఫారం తీసుకొస్తాను."

"అలాగేనయ్యా!"

ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. నేను 'టీ' త్రాగడం పూర్తి చేసి గ్లాసు క్రింద పెట్టాను.

ఆ కుర్రాడి వినయ, విధేయతలకు నాకు సంతోషం వేసింది. రోజుకంటే ఈ రోజు ఉద్యోగం ఇప్పిస్తాననే సరికి మరింత నమ్రతగా చేతులు కట్టుకు నిలబడ్డాడు.

ఇటువంటి కుర్రాడ్ని వేయించినా తనకి కీర్తి దక్కుతుంది. మంచి కుర్రాడ్ని తీసుకు వచ్చినందుకు అందరూ ప్రశంసిస్తారు కూడా.

ఆఫీసు టైం అయేసరికి గాబరాగా స్నానంచేసి బయల్దేరాను.

చెప్పుల స్టాండు దగ్గర కొచ్చేసరికి నాకు మతి పోయింది. నిన్ననే- కొన్న కొత్త చెప్పుల జత కనిపించలేదు. ఆఫీసుకు టైం అవుతోందన్న భావన నాలోని కోపాన్ని రగిలిస్తోంది.

వాచీ చూసుకున్నాను.

టైం అయిపోతోంది. గాబరా నన్ను నంజుకుంటోంది.

"ఏవేయ్! ఇక్కడ నా కొత్త చెప్పులుండాలి. ఏవి?"

"చూడండి. అక్కడే ఉంటాయి. ఇల్లు ఊడ్చేటప్పుడు చూసాను."

"లేవు"

"సరిగా చూడండి?!"

"నువ్వే వచ్చి చూడు. నాకేం చత్వార మనుకున్నావా?!"

"మీరిప్పుడా కుర్రాడితో మాట్లాడుతున్నప్పుడు అవ్వి అక్కడే ఉన్నాయి గదండీ. ఈ క్షణానికే ఎటు మాయం అయిపోతాయ్!"

"ఆ!"


నా గొంతులో తడారిపోయింది.

ఆ అబ్బాయి ఉన్నప్పుడు ఉన్నవి- ఇప్పుడెక్కడికి వెళ్తాయి?

నా తలగిర్రున తిరిగింది.

"ఏమేవ్! ఆ కుర్రాడు మళ్ళావస్తే మరిక మనింటి ఛాయలకు రావద్దని చెప్పి పంపించెయ్."

చెప్పుల్లేకుండా – కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు బయల్దేరాను. □



హైదరాబాదు నోట్‌బుక్

సుమేరు – సంస్కృతం:

సెప్టెంబర్ 9 వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలోని తెలుగు భాషా సమితి కార్యాలయంలో జరిగిన తెలుగు గోష్ఠి సమావేశంలో సుమేరియన్ – సంస్కృత భాషల సంబంధం గురించి విపులంగా చర్చలు జరిగాయి ఈ చర్చలలో మానవ జాతి శాస్త్రం, చరిత్ర, భూగోళం మున్నగు విషయాలు కూడ భాషా చర్చలో ప్రస్తావితమయ్యాయి చర్చను ప్రముఖ పాత్రికేయులు, కళాకారులు శ్రీ రాం భట్ల కృష్ణమూర్తి ప్రారంభించారు సంస్కృతం ఒకప్పుడు వ్యవహార భాషగా ఉందనడానికి లుధ్వేనియా భాష నేటికి సంస్కృతానికి సన్నిహితంగా ఉండడమేనని ఆయన అన్నారు బాబిలోనియనులు సుమేరియన్ భాషను ప్రాచీనమన్నారు సుమేరియన్ సంస్కృతి భాష అధ్యయనం చేయడంవల్ల సంస్కృతంలోని చాల పదాలకు మన ఆచార్య వ్యవహారాలకు సరైన పరిష్కారం లభిస్తుంది. బ్రాహ్మణ శబ్దం తీసుకుందాం. సుమేరియన్‌లో బ – రు అంటే దేవాలయాన్ని ఆశ్రయించినవాడు అని, ఇదే బ్రాహ్మణ శబ్దానికి మూలమని డాక్టర్ కోశాంబి అన్నారు. వాడే సర్వజ్ఞుడు సుమేరియాలో ఏక పాలక వ్యవస్థ ఉండేది. రాజా మంత్రి ఒకడే వానిని సంగ అనేవారు సంగ శబ్దానికి తమిళ సంగ సాహిత్యంతోను సంబంధం ఉంది వ్యవసాయ వ్యవస్థలో పుర, మాందాతు అనే విభాగాలున్నాయి పాచికల ద్వారా పంచే భూమి పురం. దేవాలయ భూమి మాందాతు. రెవిన్యూ రికార్డులకు అక్ష పటిలమని నేటికీ పేరు. పాచీన అక్ష సంప్రదాయం ఈ పదంలో మిగిలింది. క్రమంగా ఇవి, పురం అగం అనే సాహిత్య విభాగాలకు రూఢమయాయి. క్రమంగా ఈ సంగునికి సహాయకుడు కావలసి వచ్చాడు వాడికి పటేసి అని వేరు. సంగక్రమంగా రాజు మాత్రంగానే మిగిలాడు ఈ సంగపదం ఏకీశ్వరోపాసకులయిన వీరశైవులలో మిగిలింది నేటికీ ఉంది. ఉడువం – నక్షత్ర సంబంధమైనది, ఆకాశం, ఆకాశం ఐదవది గనుక ఐదు అని మన సంగీత విద్వాంసులు అర్థంలాగారు కాని ఇది ఉడు ప్రాతంనుంచి వచ్చిందని నా నమ్మకం. బాబిలోనియాలో ఉర్ దగ్గర తవ్వకాలలో పెక్కు సంగీత

సంగయ్య. సంగమయ్యగా నదుల కలయికకు, కూడలికి ఏమీ సంబంధం లేదు – అని శ్రీ కృష్ణమూర్తి అన్నారు బౌద్ధుల అవలోకితేశ్వర పూజ ధాన్య కటకం దగ్గరి ప్రోతాలక అనేచోటునుంచి ఉత్తర దేశానికి వ్యాపించిందని, ఇతనినే అమితాభుడంటారని క్రీస్తుకు మూడు వేల సంవత్సరాలకు పూర్వం సుమేరియాలో అంహతప్ అనే దేవత ఉండేవాడని, అతడు పశ్చిమ స్వర్గాధిపతి అని, ఆ పదమే అమితాభగా మారిందని శ్రీ చీమకుర్తి శేషగిరిరావు అన్నారు. శ్రమణ శబ్దానికి సరమన్ అనే సుమేరియన్ పదం మూలంకావచ్చునని ఆయన అన్నారు.

గర్వాణ, నాష్పతి శబ్దాలు కూడ అలాటివే. గిర్ అంటే మొదటిది శివశబ్దమూ సుమేరియో అస్సీరియన్ పదమే కాలయవన, కాలనేమి పదాలలోని కాల శబ్దానికి అధినేత అని సుమేరియో అస్సీరియన్‌లో అర్థం నలుపుకాదు. శింశుమార శబ్దాన్ని మన వారు ఏవ్యుత్పత్తి సాధించినా, సిన్ అంటే, సుమేరియన్‌లో చంద్రుడు. దీనివల్ల సినీ వాలీ అనే పదార్థమూ స్పష్టమైంది. శింశుమారీతొరితొ చంద్రుడున్న నక్షత్ర మండలం. సంగీతంలో ఔడబ, షాడబ శబ్దాలున్నాయి. ఔడబం ఐదు స్వరాల పద్ధతి. ఇది చైనాలో వాద్యాలు దొరికాయి ఉదు. ఉరు ఒకప్పుడు గొప్ప సంగీత కేంద్రం అక్కడినించి వచ్చిన పంచ స్వర పద్ధతి అయి ఉంటుంది పంచ స్వర పద్ధతే పూర్వం-గ్రీసునుంచి చైనావరకు వాపించి ఉంది. ఉడు యోధ గణమని పాణిని అన్నాడు 17 వ శతాబ్ది అహోబల పండితుడు ఔడవ, షావడ చర్చ చేశాడు ఇలాగే మైత్రావరుణ అనేది మిత్ర – వరుణ అవే రెండు వర్గాల మేళనంవల్ల ఏర్పడిన దేవత – అని శ్రీ శేషగిరిరావు అన్నారు. ఉరత్తు జాతివారు ఆర్మీనియాను పాలించారని, ఉరత్తులు నదులకు అడ్డు కట్టలు కట్టి నీరు పారించుకొని వ్యవసాయం చేసేవారని, ఋగ్వేదంలో కనిపించే వృత్రాసురుడు ఈ ఉరత్తులేనని, నదులకు వృత్రాసురుడు పెద్ద సర్పంలాగ అడ్డుగా పడుకొన్నాడనే వర్ణనలు ఉన్నాయని, శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి అన్నారు. చర్చలలో శ్రీయుతులు పాతూరి రామశాస్త్రి, అవధానుల విజయకుమార్, రాంభట్ల కృష్ణమూర్తి, యార్లగడ్డ అంజనేయులు, ముదిగొండ వీరభద్రశాస్త్రి, పుచ్చాపరబ్రహ్మ శాస్త్రి, చామకుర్తి శేషగిరిరావు, చింతా వేంకటేశ్వర్లు మున్నగువారు పాల్గొన్నారు.


అద్భుత ప్రపంచం ఆవిష్కరణ:

సుప్రసిద్ధ ఇంద్రజాలికుడు ప్రొఫెసర్ బి వి. పట్టాభిరాం రచించిన 'అద్భుత ప్రపంచం' అనే గ్రంధాన్ని సెప్టెంబర్ 3 వ తేదీన రవీంద్ర భారతిలో ఉస్మానియా విశ్వవిద్యాలయం అప్లైయడ్ సైకాలజీ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. యాదగిరిరెడ్డి ఆవిష్కరించారు. వివిధ దేశాలలోని అతీంద్రియ శక్తులు, వాటికి సంబంధించిన శాస్త్ర విజ్ఞానం, ప్రయోగాలు, పరిశోధనలు, అనుభవాలు చరిత్ర సేకరించి రచించిన అపూర్వ గ్రంధమిది. సృజన ఆర్ట్స్ థియేటర్‌వారు ఈ ఆవిష్కరణోత్సవం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ పొత్తూరి వేంకటేశ్వరం ఈ గ్రంధాన్ని అంకితం పుచ్చుకున్నారు. ఐ. ఎ ఎస్ అధికారి శ్రీ పి. ఎల్ శివరాం అధ్యక్షత వహించారు.- ప్రముఖ రచయిత్రి కుమారి వాసిరెడ్డి సీతాదేవి, వాకాటి పాండురంగరావు ప్రసంగించారు. సభా కార్యక్రమానికి ముందు ప్రొఫెసర్ పట్టాభిరాం రెండుగంటలపాటు సమ్మోహనకరంగా ఇంద్రజాలం ప్రదర్శించారు.

ఉపశ్రుతి:

ఆంధ్రప్రదేశ్‌కు మహోపకారం చేసిన గవర్నర్ రామ్‌లాల్ పేరు నగరంలో ఏ వీధికైనా పెడితే బాగుంటుందండీ – అన్నారు ఒక కాంగ్రెస్సయ్యభిమాని నాతో. కోఠీనుంచి సికిందరాబాద్ రైలు స్టేషన్‌కు వెళ్లే 86 నంబరు బస్సు రూటుకు పెడితే మంచిది – అన్నారు నా పక్కన ఉన్నవారు.

–తిరుమల రామచంద్ర



ప్రముఖ మెజీషియన్ శ్రీ బి. వి. పట్టాభిరామ్ రచించిన 'అద్భుత ప్రపంచం' పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, కుమారి వాసిరెడ్డి సీతాదేవి, శ్రీ పి ఎల్. శివరామ్, ప్రొ: యాదగిరి రెడ్డి, శ్రీ వాకాటి పాండు రంగారావు, ప్రొ. బి. వి. పట్టాభిరామ్, శ్రీ విజయకుమార్‌లని చిత్రంలో చూడవచ్చు.



అల్లూరి సీతారామరాజు చిత్ర పటాన్ని ఆవిష్కరించిన శ్రీ సుబ్బరామిరెడ్డితో హీరో కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ శ్రీ యస్. వి. ప్రసాద్, వైస్ ఎడ్మిరల్ జె. జి. నాద్కర్ణి, అధ్యక్షులు శ్రీ కె. ఆర్. సంగమేశ్వరన్, పోలీసు సూపరింటెండెంట్ శ్రీ సి. రామస్వామి ప్రభృతులని చిత్రంలో చూడవచ్చు.

సీతారామరాజు నిధి సేకరణ కోసం కృష్ణంరాజు నాయకత్వంలో తారా విభావరి

విశాఖనగరంలో సెప్టెంబరు 9న రైల్వే స్టేడియంలో అల్లూరి సీతారామరాజు స్మారక నిధిసేకరణకు తెలుగు సిని కళాకారులు "తారా విభావరి" కార్యక్రమాన్ని జయ ప్రదంగా నిర్వహించారు.

అల్లూరి సీతా రామరాజు స్మారక సాంస్కృతీ సంఘం నేతృత్వంలో ఏర్పాటైన- ఈ తారా విభావరిలో విప్లవ నటుడు శ్రీ కృష్ణంరాజు నాయకత్వంలో షుమారు నలభై మంది సిని కళాకారులు వివిధ ప్రదర్శనలు గావించారు.

శ్రీ కృష్ణంరాజు, మురళీ మోహన్, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, శరత్‌బాబు, రంగనాథ్, సుధాకర్, రాజేంద్రప్రసాద్, రాళ్ళపల్లి, కె కె. శర్మ, సుత్తివేలు, మాడా, సారధి, రావికొండలరావు, చిట్టిబాబు, జగ్గారావు, విజయశాంతి, ప్రభ,, మమత, రమాప్రభ, జయవాణి, గిరిజారాణిప్రభృతులతో పాటు నాట్య రాణి అనురాధ ఈ తారా విభావరిని భువన మనోహరంగా తీర్చి దిద్దారు.

శ్రీ నాగేశ్వరరావు మిమిక్రీ, శ్రీ యం. మదన్‌మోహన్ రావణా బ్రహ్మ ఏక పాత్రాభినయంతో పాటు శ్రీ రాంబాబు, శ్రీ చక్రవర్తుల అక్కినేని, ఎన్.టి ఆర్. ఏక పాత్రాభినయనం, ఒకింటి కథ, రేపొద్దునిస్తా, పండగల్లుడు తదితర నాటికల హాస్యపు జల్లులు అందరిని రంజింప జేశాయి.

తూర్పు నౌకా దళంప్రధాన అధికారి వైస్ ఎడ్మిరల్ శ్రీ జె. జి.నాద్కర్ని క్షత్రియోచితమైన రజత ఖడ్గాన్ని శ్రీ కృష్ణంరాజుకు సమర్పించి ఆయనను సన్మానించారు.

సంఘం అధ్యక్షులు విశాఖ ఉక్కు ప్రాజెక్టు మానేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. ఆర్. సంగమేశ్వరన్ అధ్యక్షతన జరిగిన తారావిభావరి సన్మాన సభలో శ్రీ కృష్ణంరాజు, శ్రీ గుమ్మడి, శ్రీ ప్రభాకరరెడ్డి ఉత్తేజంతో వుపన్యసించారు. వుపాధ్యక్షులు శ్రీ టి. సుబ్బరామిరెడ్డి శ్రీ అల్లూరి చిత్ర పటాన్ని ఆవిష్కరించగా, జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. వి. ప్రసాద్ నటీ నటులకు మెమొంటోలను అందజేశారు.ప్రధాన కార్యదర్శి శ్రీ మొవ్వాలు బసవపున్నయ్య సదస్సుకు స్వాగతం చెప్పారు.

మూడు గంటల సేపు ముచ్చటగా జరిగిన ఈ తారా విభావరి కార్య క్రమాల ద్వారా లభించిన నిధితో విశాఖనగరంలోని ఆశిలిమెట్టలో అల్లూరి కాంస్య విగ్రహాన్ని, గిరిజన ప్రాంతంలో మ్యూజియం కాంప్లెక్సు నిర్మాణంచేపడతామని, ఈ కార్యక్రమానికి ప్రభుత్వం నూరు శాతం మాచింగ్ గ్రాంటు ఇస్తున్నారని శ్రీ బసవపున్నయ్య ప్రకటించడం మహామహులైన విప్లవ పురుషుని మాటలతో గాక చేతలతోనైనా ఇప్పటికి గుర్తించారనే భావం అందరిలో కల్గింది.

ఏది ఏమైనా ఈ మహోత్సవానికి స్వంత ఖర్చులతో మద్రాసు నుంచి కళాకారులను విశాఖకు తరలించి తారా విభావరి కార్యక్రమాన్ని జయప్రదంగా జరిపించిన హీరో కృష్ణంరాజు నిజ జీవితంలో గూడ హీరో అని అనిపించుకున్నారు.

(ఒ. వి)

హౌరాలో ఆంధ్రకేసరి సంఘం వినాయకచవితి ఉత్సవాలు

జోగాచ (హవురా) ప్రవాసాంధ్రులు1974లో స్థాపించిన 'ఆంధ్ర కేసరి సంఘం' ఆధ్వరంలో సంఘ సభ్యులు కుటుంబ సమేతమంగా" శ్రీ వినాయకచవితి" ఉత్సవాలు జరుపుకొన్నారు.

చవితినాడు సాయంకాలము మహిళలు "శ్రీ అష్ట లక్ష్మి పూజ", సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు.

అనుబంధశాఖ "బాల వికాస సభ" ఆధ్వర్యంలో జరిగిన చిన్న పిల్లల శ్లోక పఠనము, పద్య పఠనము స్థానిక బెంగాలీలను విశేషంగా ఆకర్షించింది.

1-9-84 నాడు వినాయక ప్రతిమను నాల్గు వీధులలో ఊరేగించి తటాక నిమజ్జనము చేశారు. □

రచయితలకు మనవి


స్థానికంగా వున్న రచయితలు, కార్టూనిస్టులు కూడా మా కార్యాలయానికి వచ్చి వారి రచన లందజేస్తున్నప్పుడు వాటితోపాటు స్వంత చిరునామా గల స్టాంపులంటించిన కవరు పెట్టడం అవసరం. సం.

దీపావళి శుభాకాంక్షలతో!



బట్టర్ ఫ్లై స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్ యేళ్ల తరబడి నిగనిగలాడుతూ వుంటుంది శుభ్రం చేయడం చాలా సులభం. లోపల, వెలుపల చాలా శుభ్రంగా, తళతళలాడుతూ వుంటుంది ఇది నాణ్యమైన నాన్ మేగ్నటిక్ 18 - గేజ్ స్టెయిన్‌లెస్‌స్టీల్ ఒకే షీటుతో తయారుచేయబడింది అందువల్ల, నల్ల మరకలు, పొట్లిపోవడం, గీరలు పడటం, అరిగిపోవడం అంటూ వుండవు పైగా, అతి సురక్షితమైన పద్ధతిలో తయారుచేయబడింది కూడా!

- మీకు అనువైన సైజులలో లభిస్తాయి. 3, 5, 6, 7.5, 10 & 12 లీటర్లు
- రెండు రకాల ప్రెషర్‌పాన్స్
- స్టెయిన్‌లెస్‌స్టీల్ పాత్రల తయారీలో నలభై యేళ్ల అనుభవంగల సంస్థ తయారీ



మీరు కోరే కంటెయినర్లపై
50% ఆదా

30% ఇంధనం,
కాలం ఆదా.
పదేళ్ల గ్యారంటీ.

బట్టర్ ఫ్లై

స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్

ఉత్పత్తిదారులు గంగాధరం ఎంటర్‌ప్రైజెస్ 147, కారపాక్కం ఓల్డ్ మహాబలిపురం రోడ్డు మద్రాసు-600 096
ఫోన్. 552587, 555127, 556091

ASP GE 1103A Tel

జంట నగరములకు పంపిణీదారుడు:
గుప్తా స్టీల్ ప్యాలెస్ 1–8–27/12 & 13, ఒక్కడపల్లి
హైదరాబాద్–500 020
ఫోన్ : 62463

కోస్తా ఆంధ్రాకు పంపిణీదారుడు:
శ్రీ రాఘవేంద్ర మెటల్ స్టోర్స్ గుడివాడ వారి వీధి
విజయవాడ–520 001
ఫోన్ : 77716